సెప్టెంబర్
2015

113

సంపుటి : 10 సంచిక : 4


వెల రు. 10 /-

## ఈ సంచికలో........

కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో మీడియా
పశ్చిమబెంగాల్‌లో టియంసి ప్రభుత్వ ఆటవిక పాలన
ప్రజలపై అక్రమంగా భారాలు మోపుతున్న విద్యుత్ పంపిణీ కంపెనీలు
పెట్టుబడిదారీ సంక్షోభానికి మరో సూచన మార్కెట్ల పతనం
కార్మిక సమస్యలు - యజమానుల కొమ్ముకాస్తున్న ప్రభుత్వం
హిందూత్వ వాదుల దాడులకు మేం లొంగం
స్టాలిన్‌ను గురించిన సమగ్ర విశ్లేషణ
అలుపెరుగని మార్క్సిస్టు యోధుడు కా॥ హరికిషన్‌సింగ్ సూర్జిత్
అంతర్జాతీయ పరిణామాలు నూతన వాస్తవాలు

# అలుపెరుగని మార్క్సిస్టు యోధుడు
# కా॥ హరికిషన్‌సింగ్ సూర్జిత్

**యల్.యస్. భారవి**



కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ భారతదేశపు గొప్ప కమ్యూనిస్టు యోధుల్లో ఒకరు. ఆయన శతజయంతి సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించాలని భారతకమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 21వ మహాసభ తీర్మానించింది. ఆయన దేశభక్తుడు, అంతర్జాతీయవాది, లౌకికవాది. సూర్జిత్ తన జీవితాన్నంతా కార్మిక వర్గ ప్రయోజనాల కోసం, సమసమాజ స్థాపన కోసం, సామ్యవాదం కోసం అంకితమిచ్చారు. ఏడు దశాబ్దాలకుపైబడిన రాజకీయ జీవితంలో ప్రజలతో మమేకమై పనిచేశారు. 1916లో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ జిల్లా రోపావాల్ అనే గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించిన ఆయన 2008 ఆగస్టు 1వ తేదీన కన్నుమూశారు.

సూర్జిత్ తండ్రి హర్నామ్‌సింగ్, తల్లి గుర్బచన్ కౌర్. హర్నమ్‌సింగ్ కార్మిక, రైతు ఉద్యమాల నాయకుడు. సూర్జిత్ తల్లి కూడా అదేబాటలో నడిచింది. జాతీయోద్యమ నాయకుల సభలకు సూర్జిత్‌ను కూడా తనతో తీసుకువెళ్ళేది. తన ఇంటికి వచ్చే కీర్తి, రూలి, సంగమ్ పత్రికలను పఠించే సూర్జిత్ కీర్తి పురోగామి భావాలకు ఆకర్షితుడై 15 ఏళ్ళ వయసులోనే భగత్‌సింగ్ స్థాపించిన నౌజవాన్ భారత్ సభలో చేరాడు. 1931లో 15 ఏళ్ళ వయస్సులోనే ఒక నిషేధిత గదర్ సంస్థ తరఫున తన గ్రామంలో సభను ఏర్పాటు చేశాడు. సూర్జిత్ జీవితంలో మలుపు తిరిగిన సంఘటన హొషియార్ పూర్‌లో జరిగింది. 1932 మార్చి 23వ తేదీ భగత్‌సింగ్ తొలివర్ధంతి రోజున స్థానిక కోర్టు భవనంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. కాని సైన్యం చుట్టుముట్టిందని ఆ కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ఇది నచ్చని సూర్జిత్ జెండా తీసుకొని వెళ్ళి, యూనియన్ జాక్‌ను తొలగించి జాతీయ జెండా ఎగురవేశాడు. సైన్యం ఆయనను బంధించి జైలులో వేసింది. మేజిస్ట్రేట్ నీ పేరేమిటని అడిగితే "లండన్ తోడ్‌సింగ్" అని జవాబిచ్చాడు. అంటే లండన్‌ను ధ్వంసం చేసే సింగ్ అని అర్థం. అటువంటి ధీశాలి సూర్జిత్. 1934లో జైలునుండి విడుదలయ్యాడు.

1934లోనే హర్బన్స్‌సింగ్ బన్సి అనే బంధువు ద్వారా రహస్య జీవితం గడుపుతున్న కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. ఆ సంవత్సరమే పంజాబ్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. సూర్జిత్‌కు పుస్తకాల షాపును నిర్వహించే బాధ్యత ఇవ్వబడింది. 1935లో సూర్జిత్ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యుడయ్యారు. 1938లో కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారు. అదే సంవత్సరంలో పంజాబ్ కిసాన్ సభ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

గొప్ప యోధులైన కమ్యూనిస్టు నాయకుల వలెనే సూర్జిత్ కూడా ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొన్నారు. త్యాగాలు చేయడం ఒక అలవాటుగా మార్చుకున్నారు. ప్రతికూల పరిస్థితులను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు ఎనిమిది సంవత్సరాలు, తర్వాత రెండు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. దాదాపు ఎనిమిది సంవత్సరాలు అజ్ఞాతవాసం కూడా గడిపారు.

1940 డిసెంబర్ 13వ తేదీన భగవాన్‌పూర్ స్టేషన్‌లో పోలీసులు సూర్జిత్‌ను అరెస్టుచేశారు. లాహోర్‌లోని ఎర్రకోట జైలులో మూడు నెలలు చీకటి గదిలో బంధించారు. తర్వాత రియోలో జైలుకు తరలించారు. అక్కడే సూర్జిత్‌కు బిటి రణదివె, డాంగే, సజ్జాద్ జహీర్, అజయ్‌ఘోష్ కలిశారు.

సూర్జిత్ భార్య ప్రీతంకౌర్. ఆమె లేకుండా ఆయన జీవితం అసంపూర్ణం. ప్రీతం ధీశాలి. విశిష్ట వ్యక్తిత్వం గల మహిళ. తను కట్నం తీసుకోనన్నా, కట్నంగా ఇంటి సామాగ్రి పంపగా, అవి వెనక్కి పంపేదాకా ఆయన పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకోలేదు. చివరిదాకా ప్రీతంకౌర్ ఆయనకు అండగా ఉండి, ఆయన కార్యదీక్షకు ఎక్కడా ఆటంకం రాకుండా చూసుకుంది.

1954లో జరిగిన కమ్యూనిస్టుపార్టీ మూడవ మహాసభలో సూర్జిత్ కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికయ్యారు. 1964లో కమ్యూనిస్టుపార్టీ చీలిపోయే వరకు ఆయన ఆ బాధ్యతల్లో కొనసాగారు. కమ్యూనిస్టుపార్టీలో తలెత్తిన రివిజనిస్టు ధోరణులపై ముందుండి పోరాడిన వారిలో సూర్జిత్ ఒకరు. అలాగే సిపిఎం ఏర్పాటులో సూర్జిత్ ప్రముఖ పాత్ర పోషించారు.

రైతాంగ పోరాటంతో సుదీర్ఘకాలం పెనవేసుకున్న బంధం, అనుభవం ఆయన సొంతం. 1959లో పంజాబ్‌లో అదనపు లెవీ వ్యతిరేక ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా అనేక సంవత్సరాలపాటు పనిచేశారు. దీర్ఘకాలంగా రైతాంగ ఉద్యమాలు నడిపిన అనుభవం, పార్టీ నిర్మాణంలో పోషించిన పాత్ర వలన, పార్టీలో ఎప్పుడూ సమస్యలు వచ్చినా, మితతత్వాలకి దూరంగా ఉండి పార్టీని సరియైన దిశలో నడిపించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ ఏడవ మహాసభలో సూర్జిత్ కేంద్రకమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఎన్నికయ్యారు. సిపిఐ (ఎం) 19వ మహాసభ వరకు ఆయన ఆ బాధ్యతలలో కొనసాగారు. ఆ నాలుగు దశాబ్దాల కాలంలో పార్టీ కార్యక్రమం, ఎత్తుగడల పంథాను రూపొందించడంలో సూర్జిత్ కీలకపాత్ర పోషించారు. పార్టీ రాజకీయ

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **అలుపెరుగని మార్క్సిస్టు యోధుడు కా॥ హరికిషన్‌సింగ్ సూర్జిత్**
యల్. యస్. భారవి ... 2
2. **కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో మీడియా**
ప్రకాశ్ కరత్ ... 4
3. **పశ్చిమబెంగాల్‌లో టియంసి ప్రభుత్వ ఆటవిక పాలన**
సూర్యకాంత్ మిశ్రా... 7
4. **ప్రజలపై అక్రమంగా భారాలు మోపుతున్న విద్యుత్ పంపిణీ కంపెనీలు**
ఎం. వేణుగోపాలరావు... 12
5. **పెట్టుబడిదారీ సంక్షోభానికి మరో సూచన మార్కెట్ల పతనం**
ఎస్. వెంకట్రావు... 17
6. **కార్మిక సమస్యలు - యజమానుల కొమ్ముకాస్తున్న ప్రభుత్వం**
టి.కె. రాజలక్ష్మి... 20
7. **హిందూత్వ వాదుల దాడులకు మేం లొంగం** అనుపమ కటకం... 23
8. **స్టాలిన్‌ను గురించిన సమగ్ర విశ్లేషణ**
ఎం. నిర్మల్ కుమార్... 27
9. **అంతర్జాతీయ పరిణామాలు నూతన వాస్తవాలు** జాన్ చెరియన్ ... 32



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# మతోన్మాద హత్యలు

ప్రముఖ హేతువాద మేధావి, హంపి విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గి దారుణ హత్య దేశానికి రానున్న ఫాసిస్టు తరహా ప్రమాదాన్ని సూచిస్తోంది. ఆగస్టు 30వ తేదీ ఉదయం 7.30 నిమిషాలకు కుల్బుర్గి కర్నాటకలోని ధర్వాడ్ నగరంలో ఉదయం నడకకు వెళ్లి ఇంటికి వచ్చిన సమయంలో ఇద్దరు అగంతకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆయనను కాల్చి చంపారు. హేతువాద భావాలు వ్యక్తం చేసినందుకుగాను గతంలో అనేక సార్లు కల్బుర్గిని హత్య చేస్తామని హిందూత్వ మతోన్మాద శక్తులు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ హత్య జరిగింది.

రెండేళ్ల క్రితం 2013 ఆగస్టు 20వ తేదీన మహారాష్ట్రలోని పుణె నగరంలో ప్రముఖ హేతువాది నరేంద్ర దబోల్కర్ ఇదే విధంగా హత్యకు గురైనారు. ఆయన ఉదయం నడకకు వెళ్లి వస్తుండగా 7.30 నిమిషాలకు ఇద్దరు అగంతకులు మోటారు సైకిల్‌పై వచ్చి దబోల్కర్‌ను కాల్చి చంపి పరారైనారు. హేతువాద భావాలు వ్యక్తం చేసినందుకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసినందుకు ఆయనను కూడా హత్య చేస్తామని అంతకు ముందు హిందూ మతోన్మాద శక్తులు హెచ్చరించాయి. దాని తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 16న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో సిపిఐ నాయకుడు, హేతువాది గోవింద పన్సారేను ఇదే విధంగా హత్య చేశారు. ఆయన ఉదయం నడకకు వెళ్లి వస్తుండగా 9.30 గంటల సమయంలో ఇద్దరు దుండగులు మోటారు సైకిల్‌పై వచ్చి కాల్చి పారిపోయారు.

ఈ హత్యల పరంపరను చూస్తూంటే హిందూత్వ శక్తులు ఒక పథకం ప్రకారం అభ్యుదయ, హేతువాద దృక్పథం గలవారిని లక్ష్యం చేసుకుని హత్యలకు పాల్పడుతన్నట్లు అనిపిస్తోంది. ముగ్గురు మేధావుల హత్య జరిగిన కర్నాటక, మహారాష్ట్రలు రెండూ మతతత్వ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు బలమైన కేంద్రాలు. రెండు చోట్లా మతోన్మాద శక్తులు అభ్యుదయ గాముకులపై గతంలో అనేక దాడులు చేసి ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా హత్యాకాండకు దిగడానికి సాహించాయంటే కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉందన్న ధీమా కూడా కారణం కావచ్చు.

కేంద్రంలో బిజెపీ-ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఒక పథకం ప్రకారం హిందూత్వ భావజాలాన్ని ప్రజా జీవనంలోకి చొప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో బాటు ఆ భావాలను వ్యతిరేకించే, అభ్యుదయ భావాలు ప్రచారం చేసే గొంతులను నొక్కే ప్రయత్నాలు కూడా తీవ్రమైనాయి. మతతత్వానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేస్తున్న తీస్తా సెతల్వాద్‌ను అనేక కేసుల్లో ఇరికించి జైలు పాలు చేయడం, ముంబయిలో మోడీ అకృత్యాలను వ్యతిరేకించిన పోలీసు అధికారి సంజీవ్ భట్‌ను సర్వీసునుండి తొలగించడం.. ఇవన్నీ కూడా బిజెపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల ఫాసిస్టు తరహా చర్యలకు నిదర్శనాలు. ఇప్పటికే సంఝౌతా ఎక్స్‌ప్రెస్, జుమా మసీదు వంటి చోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడి అనేక మంది ప్రజల ప్రాణాలు తీసిన హిందుత్వ టెర్రరిజం ఇప్పుడు ఎంపిక చేసుకున్న వ్యక్తుల హత్యలకు కూడా పాల్పడుతన్నదన్న విషయం నాడు దబోల్కర్‌నుండి నేడు కల్బుర్గి వరకు జరిగిన హత్యలు తెలియజేస్తున్నాయి.

ప్రజాస్వామ్య శక్తుల పీకనొక్కేందుకు మతోన్మాదులు జరుపుతున్న ఈ మారణ కాండను అభ్యుదయ శక్తులు సమైక్యంగా ప్రతిఘటించాలి. ఇటువంటి ఫాసిస్టు దాడులపై నిరసన గళాన్ని మరింత గట్టిగా, విస్తృతంగా వినిపించాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో మీడియా

**ప్రకాశ్ కరత్**



సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

***ప్రజాశక్తి 35వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో ఆగస్టు 1వ తేదీన 'వర్తమాన పరిస్థితులు-మీడియా' అనే అంశంపై వివిధ పత్రికల సంపాదకులు పాల్గొన్న సెమినార్‌లో పీపుల్స్ డెమోక్రసీ సంపాదకులు ప్రకాశ్ కరత్ చేసిన ప్రసంగం.***

వేదికపై ఉన్న సంపాదకులకూ, ప్రియమైన మిత్రులకూ, అందరికీ నమస్కారం. ప్రజాశక్తి 35వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా నా సంతోషాన్ని మీతో పంచుకోగలుగుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో శ్రమజీవుల ప్రతిధ్వనిగా ప్రజాశక్తి ఇంతకాలం చాలా సుస్థిరంగా, నికరంగా పనిచేస్తూ వస్తోంది. రానున్న రోజుల్లో అది మరింత సమర్థవంతంగా తన పాత్రను నిర్వహించగలుగుతుందని నేను ఆశిస్తున్నాను.

వర్తమాన పరిస్థితులు-మీడియా అన్న అంశంపై ఈ రోజు మనం చర్చిస్తున్నాం. మీడియాపై కార్పొరేట్ రంగం యొక్క గుత్తాధిపత్యం బాగా పెరిగిన కాలంలో ప్రజాశక్తి వంటి పత్రికల అవసరం చాలా ఎక్కువగా ఉంది. ప్రజాశక్తి ఇతర పత్రికలకు భిన్నమైన ప్రత్యామ్నాయ భావజాలానికి ప్రాతినిథ్యం వహిస్తుంది. కాబట్టి దాన్ని నిలబెట్టేది ప్రజలూ, మరీ ముఖ్యంగా శ్రమజీవులు కాబట్టి రాబోయే రోజుల్లో ప్రజాశక్తి వంటి పత్రికల అవసరం, ప్రాధాన్యత మరింతగా పెరుగుతాయి.

వర్తమాన పరిస్థితులలో మీడియా పాత్ర ఏమిటనేది మనం పరిశీలించాల్సి ఉంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు అంశాలు మనకు ప్రధానంగా కనిపిస్తున్నాయి. మొదటిది: నయా ఉదారవాద విధానాలను ఉధృతంగా, దూకుడుగా అమలు జరుపుతున్నారు. ప్రజల జీవన స్థితిగతుల మీదా, దేశ ఆర్థిక పరిస్థితుల మీదా దీని ప్రభావం పడుతోంది. రెండోది : హిందూత్వ అజెండాను మరింత తీవ్రంగా, ఉధృతంగా ముందుకు తీసుకుపోతున్నారు. అలా ముందుకు తీసుకుపోవడమనేదాని ప్రభావం రాజకీయాలకు మాత్రమే పరిమితమై ఉండదు. ఈ రెండంశాలూ సాంస్కృతిక జీవితాన్నీ, సామాజిక జీవితాన్నీ, అన్ని రంగాలనూ ప్రభావితం చేసే ధోరణి మన దేశంలో కనిపిస్తోంది. మూడోది : నిరంకుశ పోకడలు పెరిగిపోతున్నాయి. వ్యక్తిగతమైన నిరంకుశ పోకడలు పెరిగిపోవడం వల్ల వ్యవస్థలో విలువలు తారుమారవుతున్నాయి. ఈ నిరంకుశ పోకడలు ఎలా పెరుగుతున్నాయనేది నేను తరువాత చెబుతాను. కానీ ఈ మూండశాల వల్ల దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని మనం గుర్తించాల్సి ఉంటుంది.

ఈ నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావం కేవలం ఆర్థిక రంగానికే పరిమితమై ఉండదు. ఆర్థిక, సామాజిక రంగాలతోపాటు ప్రతిదాన్నీ మార్కెట్ నడిపిస్తోంది. మార్కెట్టే సర్వస్వం అనే పరిస్థితిని తీసుకువస్తుంది. మార్కెట్ అధీనంలో, మార్కెట్ ప్రయోజనాల కోసం, మార్కెట్ చెప్పుచేతల్లో, మార్కెట్ శక్తులు చెప్పినట్లు నడిచే విధంగా మీడియా తయారవుతోంది. మామూలుగా రాజకీయాల్లో ఉన్నప్పుడు ఇదేదో రాజకీయాలకు సంబంధించిన అంశం అనుకుంటారు. కానీ నయా ఉదారవాద విధానాలు వచ్చాక రాజకీయవేత్తలకూ వ్యాపారవేత్తలకూ మధ్య విభజన రేఖ చెరిగిపోయింది.

గత నాలుగు దశాబ్దాలలో రాజకీయాలు, వ్యాపారం మమేకమైపోయాయి. వ్యాపారవేత్తలు రాజకీయాలను నడిపిస్తున్నారు. వాటి ఫలితాలు మనకు కనిపిస్తున్నాయి. శాసనసభలకు, చట్ట సభలకు ఎన్నికైన సభ్యుల తీరుతెన్నులను చూసినట్లయితే చాలా మంది రాజకీయ నాయకులు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఒకవైపు రాజకీయవేత్తలుగానూ, మరోవైపు వ్యాపారవేత్తలుగానూ ఉన్నారు. నయా ఉదారవాద విధానాలన్నవి ఈ విధంగా మన దేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, మీడియా రంగాలన్నిటినీ కూడా ప్రభావితం చేసేవిగా తయారయ్యాయి.

ఈ విధంగా వ్యాపారం, రాజకీయాలు పెనవేసుకొనిపోయి, రెండూ కలిసి ఒక దుష్టకూటమిగా రూపొందడం మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కేవలం చట్టసభల సభ్యులే కాదు. మంత్రులు, క్యాబినెట్ మంత్రులు, సహాయ మంత్రులెవరినైనా తీసుకోండి. ఒక మంత్రి ఏ శాఖకయితే ఆధ్వర్యం వహిస్తున్నాడో ఆ శాఖకు సంబంధించే అతడు వ్యాపారం చేస్తుంటాడు. ఇదివరకు ప్రభుత్వంలో టెలికమ్యూనికేషన్ల మంత్రి ఉన్నాడు. ఆయన టెలికమ్యూనికేష్ల రంగంలో అవినీతి వ్యవహారాలలో కూరుకుపోయాడు. చివరికాయన పరిస్థితి ఎలా ఉందో మనం చూశాం. అలాగే ఒక మంత్రి విద్యాశాఖ నిర్వహిస్తుంటాడు. లెక్కకు మిక్కిలిగా కార్పొరేట్ విద్యాసంస్థలు నడుపుతుంటాడు. ఒకాయన ఆరోగ్య శాఖా మంత్రిని అంటాడు. ఆయన పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రులను నడుపుతుంటాడు. ఈ విధంగా వ్యాపారవేత్తల వ్యాపారాలు, వారు నిర్వహించే రాజ్యాంగబద్ధమైన మంత్రిత్వ శాఖలూ, ప్రభుత్వ వ్యవహారాలూ కలగలిసి పోవడమన్నది నయా ఉదారవాద దశలో మనం చూస్తున్న ఒక

> **“ నరేంద్రమోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమౌతోంది. ఆయన పాలనలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రైతుల ఆత్మహత్యలు 26 శాతం పెరగడం మనం చూడొచ్చు. మరి మన ప్రధాన స్రవంతి మీడియాలో ఈ అంశాలు ఏ మేరకు ప్రతిబింబిస్తున్నాయి? ”**



**ప్రజాశక్తి వార్షికోత్సవ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్**

విపరీత పరిణామం.

ఒక వ్యక్తి నిర్వహించే పదవికీ, అతని వ్యక్తిగత వ్యాపారానికీ సంబంధం ఉండకూడదు. ఈ ప్రయోజనాల ఘర్షణ అనేది ఉండకూడదనేది ఒక ముఖ్యమైన సూత్రం. కానీ ఇప్పుడీ సూత్రం గాలికి వదిలివేయబడింది. తను చేసే పదవికి సంబంధించిన వ్యాపారం చేసుకోవచ్చు. ఇదేమిటి అని ప్రశ్నించడం మీడియాలో ఎదురు కాదు. వ్యాపార ప్రయోజనం ఉన్న వ్యక్తి మంత్రిత్వశాఖను నిర్వహించడం వల్ల కలుగుతున్న దుష్ఫలితాలేమిటన్న ప్రశ్న మన మీడియాలో, ముఖ్యంగా ప్రధాన స్రవంతి మీడియాలో ఎప్పుడూ ఎదురుకాదు. ఎందుకు ఎదురుకాదంటే మీడియాను కూడా ఆ శక్తులే నడిపిస్తున్నాయి. ఏ మార్కెట్ శక్తులైతే రాజకీయాలనూ, వ్యాపారాలనూ శాసిస్తున్నాయో, ఆ మార్కెట్ శక్తులే మీడియాను కూడా నడిపించడం వల్ల మీడియాలో ఇదొక ప్రధాన సమస్యగా, ఒక చర్చనీయాంశంగా ముందుకు రాకపోవడం మనం చూస్తున్నాం. టీవీ ఛానళ్లనూ, పత్రికలనూ ఈ శక్తులే నడుపుతున్నాయి. ఈ టీవీ ఛానళ్ల గురించి మనకు తెలుసు. అవి రేటింగ్ ద్వారా తమ వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం సమాచారాన్ని కూడా ఒక సరుకుగా మార్చిన పరిస్థితిని మనం చూశాం. అక్కడ రాజకీయాలు సరుకుగా మారిపోయాయి. ఇక్కడ దానికి సంబంధించిన విషయాలు చెప్పాల్సిన మీడియాలో సమాచారం కూడా సరుకుగా మారిపోవడం నయా ఉదారవాద విధానాల ఫలితమే.

ఈ ప్రభావం మనం చూస్తే మామూలుగా టీవీలో ఉన్న పరిస్థితి పత్రికలకు ఇంకా రాలేదు, కొంచెం మెరుగ్గా ఉన్నాయనే భావన ఉండేది. కానీ పత్రికలు కూడా త్వరితంగా మారిపోతున్నాయి. గత ఎన్నికల్లో మొత్తం కార్పొరేట్ల అధీనంలో ఉన్న మీడియా యావత్తూ నరేంద్ర మోడీ వెనుక మోహరించి, ఆయనకు అనుకూల ప్రచారం చేయడం చూశాము. ఇది ఒక మీడియా అనీ, ఛానళ్లనీ కాదు. జాతీయ మీడియా ఇలా చేసింది. ప్రాంతీయ మీడియా ఇలా చేయలేదు అని చెప్పడం లేదు. జాతీయ, ప్రాంతీయ, సమస్త మీడియా కూడా నరేంద్ర మోడీకి అనుకూలంగా పనిచేయడం, ఆయన గురించి అత్యధిక ప్రచారం కల్పించడం, ఆయన విజయానికి చాలా ప్రధానంగా దోహదం చేసిన అంశాల్లో ప్రధానమైనది.

నరేంద్రమోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమౌతోంది. ఆయన పాలనలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రైతుల ఆత్మహత్యలు 26 శాతం పెరగడం మనం చూడొచ్చు. మరి మన ప్రధాన స్రవంతి మీడియాలో ఈ అంశాలు ఏ మేరకు ప్రతిబింబిస్తున్నాయి? ఒక్కసారిగా ఆత్మహత్యలు ఎందుకు పెరిగాయి, ఇదివరకు జరగని చోట్ల కూడా ఇప్పుడెందుకు జరుగుతున్నాయి, దీని మూల కారణాలు, వ్యవస్థాపరమైన అంశాలు అనే లోతైన పరిశోధన, విశ్లేషణ వీటిలో కనిపించడం లేదు. ఇవ్వడమే చాలా తక్కువ. ఇచ్చినది కూడా చాలా పైపైనే ఇవ్వడం జరుగుతోంది. కారణం ఏమిటంటే ఇది ఆకర్షణీయమైన సమాచార సరుకు కాదు. ఇది పాఠకులను ఆకర్షించి వ్యాపారపరంగా ఉపయోగపడుతుందన్న భావన వాటికి లేదు. అందుకని దీనికి తగినంత ప్రాధాన్యత లభించదు.

వీటిలో వచ్చే వార్తా కథనాలే కాదు. వ్యాఖ్యానాలు, సంపాదకీయాల్లో వెలిబుచ్చే అభిప్రాయాలు కూడా ఈ దేశ ప్రజల ప్రయోజనాలకంటే కార్పొరేట్ల ప్రయోజనాలనే అవి ప్రతిబింబిస్తూ ఉన్నాయి. విజయవాడకు విమానంలో వస్తూ నేనొక ప్రముఖ ఆంగ్ల పత్రిక చదివాను. మూడీస్ అనే సంస్థ భారతదేశానికి ఇచ్చిన రేటింగ్‌పై అందులో సంపాదకీయం ఉంది. ఈ మూడీస్ అనేది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి సంబంధించిన సంస్థ. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఏది లాభం చేస్తుందీ, దాని ప్రకారం ఎలా నడవాలీ అని దేశాలకు ఆదేశాలూ, లేదా సూచనలూ చేస్తుంది. మూడీస్ సంస్థ ఏవిధమైన రేటింగ్ ఇస్తే దాని ప్రకారం ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రయాణిస్తూ ఉంటుంది. కాబట్టి మూడీస్ సంస్థ రేటింగ్ అనేది కార్పొరేట్‌లకు చాలా ముఖ్యమైనది. ఈ పత్రికలో ఏమని రాస్తున్నారంటే మూడీస్ రేటింగ్ ప్రకారం పలానా విషయాన్ని వాళ్లు భారత దేశానికి చెబుతున్నారు, వీటిని తక్షణం అమలు చేయడం మంచిదని ఈ పత్రిక సంపాదకీయం రాసింది. అంటే భారతదేశ ప్రజలకు, భారతదేశానికి ఏది

> **“ వాస్తవమైన కారణం ఏమిటంటే తీస్తా సెతల్వాద్ స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. ఆ స్వచ్ఛంద సంస్థ మతతత్వానికి వ్యతిరేకంగా, మరీ ముఖ్యంగా నరేంద్రమోడీ పాలిస్తున్న గుజరాత్‌లో మతపరమైన హత్యాకాండ జరిగినప్పుడు బాధితులను సమీకరించి సాక్ష్యా లను సమర్పించడంలో ముఖ్యపాత్ర నిర్వహించింది. ”**

ప్రయోజనకరమన్న దాన్ని అమలు చేయాలనే చర్చకాదు. మూడీస్ సంస్థ ద్రవ్య పెట్టుబడికి అనుకూలంగా నలహాలివ్వటం, దానికనుకూలంగా ఈ పత్రిక రాయడం, మీడియా కార్పొరేట్ శక్తులకు పూర్తి అను కూలంగా ఉంది కాబట్టే ఇలా జరుగుతుందని మనం అర్థం చేసుకోవాలి.

రెండో అంశం మెజారిటీ హిందూ మత తత్వం. దీని దుష్ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి. విద్య, సాంస్కృతిక, పరిశోధనా సంస్థలు, ప్రత్యేకంగా ఉన్నత విద్యా సంస్థలు ఈ దాడికి గురవుతున్నాయి. ఐఎంఎం, ఐఐటి, ఎఫ్‌టిఐఐ వంటి సంస్థలపై దాడి జరుగు తోంది. ఈ ఐఐటిలనేవి హిందూ వ్యతిరేక సంస్థలుగా, నిలయాలుగా మారిపోతున్నాయని ఆరెస్సెస్ పత్రిక 'ఆర్గనైజర్'లో రాశారు. వారి చాంధసవాద భావజాలాన్ని ఆ సంస్థలపై రుద్దడానికి, వాళ్లకు కావలసినవారిని తీసుకొచ్చి అక్కడ పెట్టడానికి ఐఐటిలు హిందూ వ్యతిరేక నిలయాలుగా మారుతున్నాయని తీవ్రస్థాయిలో, ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న ప్రచారదాడిగా దీన్ని చూడాల్సి ఉంది. ఆ తరువాత చరిత్ర పరిశోధనా మండలి, ఉన్నత విద్యా సంస్థలన్ని టినీ వారికి సంబంధించిన వారితో నింపడం, హిందూత్వ భావ జాలాన్ని దట్టించడం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. దీని కొనసాగింపుగా భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తున్నారు. ఎవరైనా సరే స్వతంత్రమైన అభిప్రాయాలు ప్రకటిస్తే, వారికి భిన్నమైన అంశాలూ, అభిప్రాయాలూ చెపితే వారిపైన వెంటనే దాడి చేయడం, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచి వేయడం మనం చూస్తున్నాం. ఈ సందర్భంలోనే నిరంకుశ పోకడలు కూడా పెరుగుతున్నాయనే మాట కూడా వాడాను. కార్పొరేట్ మీడియాలోని అనేక దుర్లక్షణాల గురించి చెప్పుకున్నాం. కార్పొరేట్ మీడియా, భావ ప్రకటనా స్వేచ్ఛనూ అరికట్టాలనేది మన ఉద్దేశం కాదు. ఉదాహరణకు దక్షిణ భారతదేశంలో చాలా ప్రసిద్ధమైన సన్ టీవీ నెట్ వర్క్ ఉంది. సన్ టీవీకి సంబంధించిన అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆటంకాలు కల్పించింది. వారు జాతీయ భద్రతకు వ్యతిరేకంగా వ్యవహరించారని అలా చేశామంటున్నారు. ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నిస్తే గత ప్రభుత్వ హయాంలో దానిపై ఒక విచారణ ప్రారంభమైందని చెబుతున్నారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత అందుకు సంబంధించి నిర్ణయం తీసుకోవచ్చు. కాని జాతీయ భద్రత పేరుతో పెద్ద మీడియా సంస్థలకు కూడా అనుమతులు నిరాకరిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ ఏమవుతుంది? అత్యధిక సంఖ్యాకుల మతం అంటూ హిందూత్వ పేరుతో దాడి చేయడం, ప్రభుత్వానికి ఇష్టం లేనివారి గొంతు నొక్కడం అనే రెండు రకాల నిరంకుశ ధోరణులు ఇప్పుడు మనకు కనిపిస్తున్నాయి.

ఈ క్రమంలోనే తీస్తా సెతల్వాద్ మీద జరుగుతున్న దాడి, దుమారాన్ని కూడా చూడొచ్చు. ఆమె 'మతతత్వంపై పోరాటం' అనే పత్రిక నిర్వహిస్తున్నారు ఈ పత్రిక మతతత్వ అంశాలపై ఎప్పుడూ విశ్లేషణలు ఇస్తుంటుంది. ఆ పత్రికకు ఫోర్డ్ ఫౌండేషన్ నుంచి రెండున్నర కోట్ల రూపాయల విరాళం అందిందట. ఈ విరాళం భారత దేశ ఆర్థిక భద్రతకు పెద్ద ప్రమాదం కాబట్టి, ఆమెను వెంటాడాలనే వైఖరిని ప్రభుత్వం తీసుకుంది. వాస్తవమైన కారణం ఏమిటంటే తీస్తా సెతల్వాద్ స్వచ్ఛంద సంస్థను నడుపు తున్నారు. ఆ స్వచ్ఛంద సంస్థ మతతత్వానికి వ్యతిరేకంగా, మరీ ముఖ్యంగా నరేంద్రమోడీ పాలిస్తున్న గుజరాత్‌లో మత పరమైన హత్యాకాండ జరిగినప్పుడు బాధితు లను సమీకరించి సాక్ష్యా లను సమర్పించడంలో ముఖ్యపాత్ర నిర్వహించింది. అనేక సందర్భాల్లో వారికి ఆశ్రయం కల్పించడంలో, వారికి సహాయసహకారాలు అందించటంలో చాలా నికరమైన, నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహిం చింది. అది వారికేమాత్రం మింగుడు పడటం లేదు. దానికి ఆర్థిక భద్రత అనే పేరు పెట్టి ఆమెను అనునిత్యం వెంటాడుతున్నారు.

మనం సంతోషించాల్సిన విషయం ఏమిటంటే నయా ఉదారవాద విధానాలకు సంబంధించిన అంశాల్లో మన మీడియా తన పాత్రను తాను నిర్వహించకపోయినప్పటికీ భావ ప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడినీ, మెజారిటీ మతతత్వ శక్తుల విశృంఖల పోకడలనూ మీడియాలో ఒక భాగం ప్రముఖం గానే చెబుతున్నది. ఇది మంచిదికాదని నిరసిస్తున్నది. ఇది మనం ఆహ్వానించదగిన పరిణామం. అదింకా పెరగాలి. పెరుగుతున్న నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా శక్తివంతమైన పాత్ర నిర్వహించాలి. భారత దేశంలో మెజారిటీ మతతత్వానికి వ్యతిరేకంగా లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి అవి క్రియాశీలంగా వ్యవహరించాలని కోరుకోవాలి.

చివరిగా మీడియాకు సంబంధించిన సున్నితమైన ఒక అంశం చర్చనీయాంశంగా ఉంది. మీడియాలో వస్తున్న పోకడలను తనకు తాను స్వీయ నియంత్రణ చేసుకోవడమా, లేక దీనిని సరిదిద్దడానికి ఒక బాహ్య నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయడమా అనే చర్చ జరుగుతూ వస్తున్నది. చాలా వరకూ మనమంతా బాహ్య నియంత్రణ కాదు. స్వీయ నియంత్రణే మంచిదనే వైఖరితో ఉన్నాం. కానీ ఇన్నేళ్ల అనుభవాన్ని చూసినప్పుడు మీడియాకు ఒక స్వతంత్ర నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరమనిపిస్తున్నది. అదెలా ఉంటుంది, రూపురేఖలు ఎలా ఉంటాయి అనేది ఇప్పుడు చెప్పలేకపోయినా అది ప్రభుత్వంలో భాగంగా మాత్రం ఉండకూడదు. ప్రభుత్వ అదుపాజ్ఞల్లో ఉండకూడదు. స్వతంత్రంగా పనిచేసి మీడియాను మరింత జవాబుదారీగా, ప్రజాస్వామికంగా, అర్థవంతంగా నడపడానికి కావలసిన ఒక స్వతంత్ర స్వయం ప్రతిపత్తి గలిగిన నియంత్రణా వ్యవస్థ రూపకల్పన అవసరమని అనుభవం మనకు చెపుతున్నది.

**(ప్రకాష్‌కరత్ ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసినవారు తెలకపల్లి రవి. వ్యాసరూపమిచ్చిన వారు యు రామకృష్ణ.)**

# పశ్చిమబెంగాల్‌లో టియంసి ప్రభుత్వ ఆటవిక పాలన



సూర్యకాంత్ మిశ్రా
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

***దే**శంలోకెల్లా బలమైన వామపక్ష శక్తిగా ఉన్న పశ్చిమబెంగాల్‌లోని వామపక్ష ఉద్యమంపై తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం లోని ప్రభుత్వం, పాలకవర్గాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయి. సిపిఐ (యం) పొలిట్‌బ్యూరో సభ్యులు సూర్యకాంత్‌మిశ్రా పార్టీ పశ్చిమబెంగాల్ రాష్ట్ర కమిటి కార్యదర్శిగానూ, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగానూ రెండు ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న రాజకీయ అణచివేతపై డా. సూర్యకాంతమిశ్రా మాధవ్ టిపు రామచంద్రన్‌కు 2015 మే 19వ తేదీన ఇంటర్వ్యూ ఇచ్చాడు. కలకత్తా నుండి నాడియాకు కారులో వెళుతున్నపుడు మూడు గంటలకుపైగా ఈ ఇంటర్వ్యూ కొనసాగింది. ఈ ఇంటర్వ్యూలో పశ్చిమబెంగాల్‌లో ప్రజాస్వామ్యంపైనా, ప్రజలపైనా జరుగుతున్న ముప్పేటదాడిని గురించి డా. సూర్యకాంతమిశ్రా వివరించారు. ఈ దాడి యొక్క ఫలితాలు వామపక్షాలు, వామపక్ష పార్టీలకే పరిమితం కావని చెప్పారు. రాష్ట్రంలో వామపక్షశక్తులపై జరుగుతున్న దాడులను, ప్రస్తుతం జరుగుతున్న అణచివేతను 1970వ దశాబ్దంలో జరిగిన అర్థఫాసిస్టు బీభత్సకాండను పోల్చుతూ ఈ రెండింటి మధ్య ఉన్న పోలికలు, వైరుధ్యాలను వివరించారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ వామపక్ష శక్తులు పునరుజ్జీవం పొందాల్సిన అవసరాన్ని, అందుకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు.*

**మాధవ్ టిపు రామచంద్రన్: పశ్చిమబెంగాల్‌లో ఈ రోజు జరుగుతున్న రాజకీయ అణచివేత స్వభావం ఏమిటి?**

**సూర్యకాంతమిశ్రా:** రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నాలుగు సంవత్సరాల తర్వాత ఈ రోజు బహు విధాలైన అణచివేతను మేము ఎదుర్కొంటు న్నాము. రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా మూడు విధాలైన దాడి జరుగుతున్నది. మొదటిది. ప్రజాస్వామిక సంస్థలపైనా, ప్రజాస్వామ్యంపైనా జరుగు తున్నది. రెండవది. ప్రజల జీవనాధారాలపై జరుగుతున్నది. మూడవది. రాష్ట్రంలోని లౌకికవాదంపై జరుగుతున్నది. వీటన్నింటితో పాటు రాష్ట్రంలోని సిపిఐ(యం)పైనా, వామపక్ష సంఘటనపైనా తీవ్రమైన దాడి జరుగుతున్నది.

**యంటిఆర్: వామపక్షాలు ఎటువంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది?**

**యస్‌కెయం:** ఈ కాలంలో 170 మంది వామపక్షాల కార్యకర్తలు హత్య చేయబడ్డారు. వేలాది మంది కార్యకర్తలపై కౄరమైన దాడులు చేశారు. గాయపడిన వారు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవటాకి కూడా అవకాశం ఇవ్వలేదు. బాధితుత ఫిర్యాదులను పోలీసులు నమోదు చేయలేదు. నా అంచనా ప్రకారం వారిలో 5000ల మందికిపైగా వికలాంగులై మిగిలిన జీవితమంతా దుర్భర పరిస్థితులను అనుభవించాల్సిన స్థితిలో ఉన్నారు. పార్టీ, ప్రజాసంఘాలు, వామపక్షాలకు చెందిన 1500ల ఆఫీసులపై దాడులు చేసి ఆక్రమించుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని టియంసి ఆఫీసులుగా మార్చటమో, లేదా మూసివేసి ఉంచటమో చేశారు. 1,00,000 మందికి పైగా కామ్రేడ్స్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించారు. 51,000ల మందికి పైగా ప్రజలను వారి నివాస ప్రాతాల నుండి తరిమివేశారు. ఒకటి రెండు సంవత్సరాల తర్వాత ప్రజలు వారి నివాస ప్రాంతాలకు తిరిగి వస్తే వారు ఇతరులతో మాట్లాడటానికి, ఇళ్ళు వదలి బయటికి రావటానికి అంగీకరించటం లేదు. వారివద్ద ఉన్న సెల్ ఫోన్లు, లాండ్‌లైన్ ఫోన్లు లాక్కుంటున్నారు. కనీసం ఉత్తరాలను పోస్టుబాక్సుల్లో వేయటానికి కూడా వారికి అవకాశం ఇవ్వటం లేదు. గూండాలు వారి వద్దనుండి బలవంతంగా జరిమానాలు వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లు చాలా సందర్భాలలో లక్షల రూపాయలలో ఉంటున్నాయి. (మా అంచనా ప్రకారం రాష్ట్రంలో 50 కోట్ల రూపాయలను ప్రజల వద్ద నుండి బలవంతంగా వసూలు చేశారు.)

**యంటిఆర్: ఈ బలవంతపు వసూళ్ళను ఏ విధంగా చేస్తున్నారు?**

**యస్‌కెయం:** బెదిరించటం ద్వారా ఈ డబ్బును వసూలు చేస్తున్నారు. మావద్ద కొన్ని డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ, వారు కాగితాల రూపంలో ఎటువంటి సాక్ష్యాలను వదలటం లేదు. బలవంతంగా తమ ఇళ్ళను వదలిపోయిన వారు తిరిగిరాని సందర్భాలలో వారి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారు. "మీవారిని తిరిగివచ్చి ఇక్కడే ఉండి, జరిమానాలు చెల్లిస్తూ బతకమని చెప్పండి. అలా చేయకపోతే వారి కుటుంబాలు ఇక్కడ ప్రశాంతంగా బతకటానికి అంగీకరించం. ఈ విషయాన్ని వారికి తెలియజేయండి." అని గూండాలు బెదిరిస్తున్నారు.

**యంటిఆర్: మీరు చెప్పిన అంశాలలో మొదటిదైన ప్రజాస్వామిక సంస్థలు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులను వివరించారు?**

**యస్‌కెయం:** సమాజంలో ప్రజాస్వామిక శక్తులపై జరుగుతున్న తీవ్రమైన దాడులలో కొద్దిభాగాన్ని మాత్రమే నేను మీకు వివరించాను. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ ప్రతిపక్షానికి చెందుతుంది. అంటే ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో చర్చనీయాంశం చేయటంలో ప్రతిపక్షం ప్రధానపాత్ర పోషించాలి. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో మేము ఎన్ని ప్రశ్నలు అడిగాం, ఎన్నిటికి సమాధానాలు చెప్పారు, ఎన్ని ప్రశ్నలు సమాధానాలు చెప్పకుండా మిగిలిపోయాయి, మా వాయిదా తీర్మానాలను ఏ విధంగా తిరస్కరించారు, అనధికార తీర్మానాలు, అనధికార చర్చలకు టైం కేటాయించకుండా ఏ విధంగా వ్యవహరిస్తున్నారు, తీర్మానాలను అధికారపార్టీ సభ్యులు మాత్రమే ఏ విధంగా ఆమోదించుకుంటున్నారు,

> **“ శారదా చిట్‌ఫండ్ కుంభకోణాన్ని గురించి శాసనసభలో చర్చించటం కోసం మేము వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టినపుడు అధికారపార్టీ శాసనసభ్యులు మా శాసన సభ్యులు కొందరిని శాసనసభలోనే కొట్టి, గాయపరిచారు. గాయపడిన వారిలో గతంలో మంత్రిగా పనిచేసిన, ప్రస్తుత శాసనసభ్యురాలు దేబలినా హేంబ్రం కూడా ఉన్నారు. ”**

మేము ప్రతిపాదించిన తీర్మానాలను ఏ విధంగా తోసిపారేస్తున్నారనే అంశాలను మేము ప్రతి సంవత్సరం ప్రచురిస్తున్నాము. అసెంబ్లీ సమావేశం జరగని సమయంలో అసెంబ్లీలో ఉన్న ప్రెస్ కార్నర్‌లోకి ప్రతిపక్ష నాయకునికి ప్రవేశం లేకుండా చేశారు.

**యంటిఆర్: ప్రెస్ కార్నర్ నిర్దిష్టంగా ఎందుకు ఉపయోగపడుతుంది?**

**యస్‌కెయం:** అసెంబ్లీ సభ్యులు ఎవరైనా విధానపరమైన అంశాలను, చర్చించాల్సిన ఇతర అంశాలను ప్రెస్ వారిని కలిసి వివరించటానికి మేము అధికారంలో ఉన్నపుడు ప్రెస్ కార్నర్‌ను ఏర్పాటు చేశాం. ఒక ప్రభుత్వంగా పత్రికల ద్వారా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని మేము భావించాం. మేము క్రమబద్ధంగా ప్రెస్ కార్నర్‌కు వెళ్ళి మా విధానాలను గురించి ప్రచార సాధనాల ద్వారా చర్చిస్తూ ఉండేవాళ్ళం. ప్రెస్ కార్నర్‌ను సాధారణంగా సాయంత్రం ఐదుగంటలకు మూసివేస్తారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకరోజు నేను ప్రెస్ కార్నర్ మూసివేత కాలాన్ని ఐదు నిముషాలు అతిక్రమించానని నాపై ఆరోపణ చేశారు. కాల పరిమితిని అతిక్రమించలేదనే విషయంలో నేను స్పష్టంగా ఉన్నాను. ఒకవేళ అతిక్రమించి నప్పటికీ అది ప్రతిపక్ష నాయకుడ్ని ప్రెస్ కార్నర్‌కు దూరంగా ఉంచాల్సినంత పెద్ద విషయమేమీ కాదు. ఇప్పటికి మూడున్నర సంవత్సరాల నుండి వారు ప్రెస్ కార్నర్‌ను మూసి ఉంచారు. అసెంబ్లీ సమావేశాలు జరగనపుడు అసెంబ్లీ బజారుకు అవతల నేను ప్రెస్ సమావేశాలను ఏర్పాటు చేసుకుంటు న్నాను. (వాటిని నేను పార్టీ ఆఫీసులో కూడా ఏర్పాటు చేసుకోగలను.) మంత్రులు వాళ్ళ కార్యాలయాల్లోనే ప్రెస్ సమావేశాలను ఏర్పాటు చేసుకుంటారు. అసెంబ్లీలోని ఏ పార్టీకి చెందిన సాధారణ సభ్యుడైనా తన అభిప్రాయాలను పత్రికలతో చర్చించే హక్కుంది. అందుకోసమే ప్రెస్ కార్నర్‌ను ఏర్పాటు చేయటం జరిగింది.

**యంటిఆర్: అసెంబ్లీకి సంబంధించి ఇతర అంశాలు కూడా ఉన్నాయా?**

**యస్‌కెయం:** ఇవి కొత్త ప్రభుత్వం యొక్క స్వభావాన్ని తెలియజేసే కొన్ని సంఘటనలు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణాన్ని గురించి శాసనసభలో చర్చించటం కోసం మేము వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టినపుడు అధికారపార్టీ శాసనసభ్యులు మా శాసనసభ్యులు కొందరిని శాసనసభలోనే కొట్టి, గాయపరిచారు. గాయపడిన వారిలో గతంలో మంత్రిగా పనిచేసిన, ప్రస్తుత శాసనసభ్యురాలు దేబలినా హేంబ్రం కూడా ఉన్నారు. అధికారపక్ష సభ్యుల బెంచి, డెస్కుల మధ్యకు ఆమెను నెట్టారు. గాయపడిన మరో శాసనసభ్యుడు, మా పార్టీ రాష్ట్రకమిటి సభ్యుడైన గౌరంగా ఛటర్జీకి తలలో ఎముక చిట్లింది. మేము ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా ఆయనకు గాయం లేదనిచెప్పి ఆసుపత్రిలో చేర్చుకోలేదు. తర్వాత ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా సిటి స్కాన్‌లో ఆయన తలలోని గాయం స్పష్టంగా కనిపించింది. అసెంబ్లీలో జరిగిన ఘటనలకు పోలీసులు చేయగలిగినది ఏమీ ఉండదు. కాబట్టి ఈ అంశానికి సంబంధించి తర్వాత ఏ చర్యలూ తీసుకోలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాసనసభలో ప్రస్తావించిన సమస్యలకు ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. రాజ్యాంగం ప్రకారం శాసనసభ తాను నిర్వహించాల్సిన బాధ్యతలను నిర్వహించలేకపోయింది.

**యంటిఆర్: ఈ దాడులు ప్రత్యేకించి వామపక్షాలపైనే కేంద్రీకరించబడ్డాయా?**

**యస్‌కెయం:** లేదు. మొదట్లో మాపై ప్రారంభించిన దాడులు తర్వాత మొత్తం ప్రతిపక్షంపైకి, అధికారపార్టీ సభ్యులపై కూడా జరుగుతున్నాయి. కనీసం 50 మంది అధికారపార్టీ వారిని ఆ పార్టీ వారే చంపారని నేను ముఖ్యమంత్రికి చెప్పాను. వారి వద్ద కనీసం ఆ వివరాలు ఉంటాయనే నమ్మకం కూడా నాకులేదు. చారిత్రక అనుభవాన్ని చూస్తే ప్రజాస్వామ్యంపై దాడి ప్రారంభించిన తర్వాత ఏ ఒక్కరిని మినహాయించటం జరగదు. పాలకపార్టీ సభ్యులకు కూడా మినహాయింపు ఉండదు. చిట్‌ఫండ్ కుంభకోణంలో అతి ముఖ్యమైన సమాచారాన్ని సిపిఐ(యం)కు, పోలీసులకు, కోర్టులకు అందిస్తున్నారనే అనుమానంతో టియంసి నాయకులు తమ పార్టీ అనుయాయులను, యంపిలను కూడా దూరంగా ఉంచుతున్నారు.

**యంటిఆర్: ఇతర ప్రజాస్వామిక సంస్థల పరిస్థితి ఏమిటి?**

**యస్‌కెయం:** అన్ని సంస్థలూ తీవ్రమైన వత్తిడిలో ఉన్నాయి. స్థానికసంస్థలు, వాటికున్న అధికారాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఎన్నికలను రిగ్గింగ్ చేస్తున్నారు. అధికారపార్టీ వారిని మినహా మిగతా వారిని నామినేషన్లు వేయనీయటం లేదు. ఒకవేళ నామినేషన్లు వేసినా ఉపసంహరించుకొనేలా వత్తిడి చేస్తున్నారు. సహకార సంఘాలను కూడా తమ ముట్టడిలో ఉంచుకున్నారు. వాటికి ఎన్నికలను జరపకుండా వాటిని 'కార్యనిర్వాహకుల' తో నడుపుతున్నారు. విద్యాలయాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రజాస్వామ్యం లేదు. విద్యార్థులకు సంఘాలను ఏర్పాటు చేసుకొనే హక్కును నిరాకరిస్తున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికల విధానంపై దాడిచేస్తున్నారు. కార్మికులకు సమ్మె చేసే హక్కులేకుండా చేశారు. రాజ్యాంగ బద్ధ సంస్థలు, ఇతర ప్రజాస్వామిక సంస్థలపై దాడులు చేస్తున్నారు. ప్రభుత్వానికి ఇష్టంకాని తీర్పులివ్వటం, కొన్ని సిఫార్సులు చేయటంతో మానవహక్కుల సంఘం ఛైర్మన్‌ను తొలగించారు. ప్రస్తుతం మానవహక్కుల సంఘానికి ఛైర్మన్ లేదు. ఆ తర్వాత గతంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన వ్యక్తిని నియమించారు. సెలక్షన్ కమిటి సభ్యునిగా ఈ నియామకాన్ని నేను వ్యతిరేకించాను. మానవహక్కులను ఉల్లంఘించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులను కోర్టు పరిశీలిస్తుండగా, ఉల్లంఘించిన వ్యక్తిని మానవహక్కుల కమీషన్‌కు నియమించటం చరిత్రలో జరగలేదని నేను చెప్పాను. ఆయన ప్రస్తుతం మానవహక్కుల కమీషన్‌కు అనధికారిక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. రాష్ట్రంలో మానవహక్కుల పరిస్థితి ఎలా ఉన్నదో ఈ సంఘటన తెలియజేస్తు న్నది. ఎన్నికల సంఘాన్ని కూడా మినహాయించలేదు. ఎన్నికల సంఘంతో ప్రభుత్వం చేస్తున్న యుద్ధం పంచాయితి ఎన్నికలను జరిపే విషయంలో బహిరంగమైంది. ఒక సెషన్స్ కోర్టు జడ్జి తనకు భద్రత

> ఎన్నికల సంఘంతో ప్రభుత్వం చేస్తున్న యుద్ధం పంచాయితి ఎన్నికలను జరిపే విషయంలో బహిరంగ మైంది. ఒక సెషన్స్ కోర్టు జడ్జి తనకు భద్రత కల్పించాలని కోరుతూ మావద్దకు వచ్చాడు. న్యాయవ్యవస్థకు సంబంధించిన వారు కూడా ఏ విధంగా రక్షణలేని పరిస్థితుల్లో ఉన్నారో ఈ సంఘటన స్పష్టం చేస్తున్నది.

కల్పించాలని కోరుతూ మావద్దకు వచ్చాడు. న్యాయవ్యవస్థకు సంబంధించిన వారు కూడా ఏ విధంగా రక్షణలేని పరిస్థితుల్లో ఉన్నారో ఈ సంఘటన స్పష్టం చేస్తున్నది. ఆలీపూర్ కోర్టులో న్యాయం జరగదని భావించిన సిబిఐ ఆలీపూర్ కోర్టులో ఉన్న కేసును ఆ కోర్టు నుండి ఇతరచోట్ల కు తరలించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది.

**యంటిఆర్: రెండో విధమైన దాడి ప్రజల జీవనా ధారాలపై జరుగుతున్నదని మీరు చెప్పారు?**

**యస్‌కెయం:** మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసిన తర్వాత కూలీలకు కూలి ఇవ్వటం లేదు. నిధులున్నప్పటికీ కూలీలకు పనులు ఇవ్వటం లేదు. కొన్ని సందర్భాలలో రాజకీయ విధేయతల ప్రాతి పదికగా పనులను తిరస్కరిస్తున్నారు. అధికార పార్టీ అనుయాయులు కాని వారికి పనులు ఇవ్వటం లేదు. చేసిన పనికి ఇవ్వాల్సిన వేతనాలను ఆరునెలలు, కొన్ని సందర్భాలలో సంవత్సరం పాటు చెల్లించకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సేకరణ ధరలను రైతులకు చెల్లించటం లేదు. ఉత్పత్తిని సేకరించటానికి అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. వ్యవసాయరంగ పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నది. ఈ ప్రభుత్వానికి ముందు 34 సంవత్సరాల వామపక్ష సంఘటన పరిపాలనలో జరగని రైతుల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వ పాలనలో జరుగుతున్నాయి.

**యంటిఆర్: ప్రజల జీవనాధారాలకు సంబంధిం చిన అంశాలు కేవలం గ్రామీణ ప్రాంతానికి మాత్రమే పరిమితమైనవా?**

**యస్‌కెయం:** లేదు. సాంప్రదాయక పరిశ్రమలున్న రంగాలలో (ఉదాహరణకు టి, జూట్ లాంటి పరిశ్రమలు) ఇతర పరిశ్రమలలోనూ ఈ మధ్యకాలంలో మూసివేతలు పెరుగుతున్నాయి. కొత్త పరిశ్రమలను ప్రారంభించటంలో విఫల మౌతున్నారు. పారిశ్రామిక రంగంలో అధికార పార్టీ గూండాయిజం వలన, ఫ్యాక్టరీలు మూతపడటం వలన కార్మికులు పనులు కోల్పోతున్నారు. ఏడు జూట్ మిల్లులను తిరిగి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ఈ రోజు పత్రికల్లో వచ్చింది. అధికారపార్టీ గూండాలు వారు చెల్లించలేనంత మొత్తాన్ని యజమానుల నుండి డిమాండు చేయటంతో ఈ ఫ్యాక్టరీలను నడపటం గిట్టుబాటుకాక యజమానులు మూసివేశారు. చివరకు ఫ్యాక్టరీలను తిరిగి ప్రారంభించమని ముఖ్యమంత్రి యజమానులను కోరింది. పరిస్థితిలో తాత్కాలికంగా వచ్చిన మార్పు ప్రతిరోజూ, ప్రతిచోటా ఏం జరుగుతున్నదనే విషయాలను తెలియజేయదు. ఈ అంశంలో ఆమె వట్టి మాటలు మాత్రమే చెబుతున్నది. వాస్తవ పరిస్థితిలో ఏ మార్పులేదు. ఈ విధంగా పెద్దమొత్తాలు బలవంతంగా చెల్లిం చాల్సి రావటంతో తాము వ్యాపారాలు చేయలేమని వ్యాపారవర్గాలు ఫిర్యాదులు చేయటం ప్రారంభించాయి. మేము ప్రభుత్వంలో ఉండగా ప్రవేశపెట్టిన బీమా పథకాలను సక్రమంగా అమలు చేయటం లేదు. ఇందుకు ప్రభుత్వం చెల్లిస్తానని అంగీకరించిన ప్రీమియం మొత్తాన్ని చెల్లించటం లేదు. గత నాలుగు సంవత్సరాలలో 69-70 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించలేదు.( ఇందులో గణనీయమైన భాగం పంటల బీమాకు సంబంధించినది.) ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డిఏ బకాయిలను చెల్లించటం లేదు. వారి వేతనా లలో 48 శాతం-ఇప్పటి వరకు వినినంత మొత్తం-చెల్లించకుండా ఉన్నాయి. వేతనాలు చెల్లించటంలో విఫలం కావటం పది లక్షల మందిని ప్రభావితం చేస్తున్నది.

**యంటిఆర్: దాడికి గురవుతున్న మూడవ అంశం సెక్యులరిజం అని మీరు చెప్పారు?**

**యస్‌కెయం:** దేశం చీలిపోయిన తర్వాత రాష్ట్రంలో తీవ్రమైన మత ఉద్రిక్తతలు ఎప్పుడూ తలెత్తలేదు. వామపక్ష సంఘటన పాలించిన 34 సంవత్సరాల కాలంలో దేశంలో ఏ ప్రాంతంలో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తినా రాష్ట్రంలో అటువంటి పరిస్థితిని నివారించేందుకు వెంటనే సైన్యాన్ని మోహరించటం, రాజకీయ పరమైన చర్యలు తీసుకొనేవారం. ఉదాహరణకు ఇందిరాగాంధి హత్య తర్వాత దేశవ్యాపితంగా సిక్కు వ్యతిరేక ఘర్షణలు జరుగుతున్నప్పుడు పశ్చిమబెంగాల్‌లో అటువంటి కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత కూడా ప్రభుత్వం దృఢంగా లౌకిక దృక్పథంతో వ్యవహరించటంతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మతపరమైన హింసా కాండను నివారించగలిగింది. మతపరమైన హింసాకాండకు వ్యతిరేకంగా ప్రజలను సైద్ధాంతికంగా, నిర్మాణపరంగా సమీకరించగల మా రాజకీయ శక్తిసామర్థ్యాలు మతోన్మాదశక్తులు బెంగాల్లో తలెత్తటానికి అవకాశాలు లేకుండా చేశాయి. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టి హిందూ మతోన్మాదాన్ని రెచ్చ గొట్టటం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టి సరిహద్దు అవతలి వైపునుండి పనిచేస్తున్న మతోన్మాద సంస్థ జమాతుల్ ముజాహిదీన్‌కు మద్దతిస్తుండటంతో రాష్ట్రంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతున్నది. బంగ్లాదేశ్‌లోని ప్రభుత్వం తీవ్రవాదుల్ని పట్టుకోవాలని ప్రయత్నం చేస్తుండగా వారు ఇక్కడి అధికారపార్టి, అధికార యంత్రాంగం నుండి రక్షణ పొందుతున్నారు. ఖగ్రాగర్‌లో జరిగిన సంఘటనలకు సంబంధించి విచారణ జరిపిన సంస్థలు తీవ్రవాదులకు రక్షణ కల్పించిన రాజకీయ నాయకులను పట్టుకోలేక పోయాయి. వాస్తవానికి అధికార యంత్రాంగం వాటిని తిరస్కరించటంతో పాటు ఖగ్రాగర్‌లో జరిగిన పేలుళ్ళకు సంబంధించిన సమాచారాన్ని ధ్వంసం చేశారు. అధికార పార్టికి సంబంధం చిన ఏ ఒక్కరిపైనా కేసు నమోదు చేయలేదు. పరస్పర వ్యతిరేకమైన విధానాలను అనుసరిస్తూ రాష్ట్రంలోని ప్రజలను మతపరంగా చీల్చాలనే నిశ్శబ్ద అవగాహనతో కేంద్రంలోనూ, రాష్ట్రం లోనూ అధికారంలో ఉన్న పార్టీలు వ్యవహరి స్తున్నాయి. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు మతోన్మాదశక్తులకు మద్దత్తుగా ఈ వైపో ఆవైపో నిలబడని రాష్ట్రంలో ప్రస్తుత సమయంలో ఇటువంటి వైఖరి తీవ్రమైన ప్రమాదానికి దారితీస్తుంది. ప్రజల్ని మత పరంగా విభజించి, వామపక్ష, లౌకికశక్తులను అప్రాముఖ్యంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. 1970వ దశాబ్దంలో అర్ధ ఫాసిస్టు బీభత్సం అమలు జరిపినపుడుగాని, ఎమర్జెన్సీ రోజుల్లోగానీ పశ్చిమబెంగాల్లో ఈ విధమైన మతోద్రిక్తతలను చూడలేదు.

**యంటిఆర్: 1970వ దశాబ్దంలో జరిగిన అర్ధఫాసిస్టు బీభత్సానికి, ప్రస్తుత పరిస్థితికి మధ్య**

> “ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు మతోన్మాద శక్తులకు మద్దత్తుగా ఈ వైపో ఆవైపో నిలబడని రాష్ట్రంలో ప్రస్తుత సమయంలో ఇటువంటి వైఖరి తీవ్రమైన ప్రమాదానికి దారితీస్తుంది. ప్రజల్ని మత పరంగా విభజించి, వామపక్ష, లౌకికి శక్తులను అప్రాముఖ్యంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.”



టి.ఎం.సి. గూండాల దాడిలో సర్వం కోల్పోయి విలపిస్తున్న మహిళ

మీరు ఏ విధమైన వ్యత్యాసాన్ని చూస్తున్నారు?

**యస్‌కెయం:** ఈ రెండు సమయాలలో జరిగిన రాజకీయ అణచివేతల మధ్య అనేక వ్యత్యాసాలున్నాయి. 1970వ దశాబ్దం ప్రత్యేకమైన సమయం. అపుడు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. చరిత్ర యధాతథంగా పునరావృతం కాదు. అపుడు జరిగిన దాడి సిపియం, వామపక్షాలు వేగంగా పెరుగుతున్న దశలో జరిగింది. ఎన్నికల పని తీరుకు సంబంధించి 1967లో 40 మందికి పైగా, 1969లో 80 మందికిపైగా, 1971లో 110 మందికిపైగా శాసనసభలో మా సభ్యులున్నారు. 1972లో ఎన్నికలలో రిగ్గింగ్ చేసినప్పటికీ, మేము వేగంగా పెరుగుతున్న దశలో మామీద తీవ్రదాడి జరిగింది. 1972 ఎన్నికల తర్వాత ఐదు సంవత్సరాల పాటు రాష్ట్ర అసెంబ్లీని మేము బహిష్కరించాం. ఆ కాలంలో మేము పార్లమెంటరి యేతర కార్యకలాపాలకు పరిమితమయ్యాం. అంతకు ముందు శాసనసభలో మాకు 114 స్థానాలుండగా ఆ ఎన్నికలలో 14స్థానాలు మాత్రమే గెలిచాం. 1972లో జరిగిన ఎన్నికలలో రిగ్గింగ్ అనేది నూతన పద్ధతిలో రాజకీయ పరిభాషలో చేరింది. 1977లో ఎన్నికలు జరిగినపుడు వామపక్ష సంఘటన మూడింట రెండొంతుల మెజారిటిని సాధించింది. ఎక్కువమంది ప్రజలు మాకు మద్దత్తు ఇవ్వటంతో మా ప్రభుత్వం 34 సంవత్సరాల పాటు అధికారంలో ఉంది. అన్ని ఎన్నికలలోనూ 40 నుండి 50 శాతం మంది ప్రజలు మాకు మద్దత్తు తెలిపారు. 2009, 2011లో జరిగిన ఎన్నికలలో వామపక్షాల ఓట్లు తగ్గుతున్నాయని స్పష్టమైంది. 1972 ఎన్నికలలో జరిగినట్లుగా 2009, 2011 ఎన్నికలలో రిగ్గింగ్ జరగలేదు. ఈ రెండు ఎన్నికలలో అధికార పార్టికి ప్రజలు మద్దత్తునిచ్చారు. స్పష్టంగా చెప్పుకోవాలంటే 1970లలో వలె 2009, 2011లో మాది పెరుగుతున్న పార్టి కాదు.

**యంటిఆర్: ఇతర వ్యత్యాసాలున్నాయా? హత్యలకు గురవుతున్నవారి సంఖ్య, హత్యలు జరుగుతున్న పద్ధతులకు సంబంధించి ఏమైనా వ్యత్యాసాలున్నాయా?**

**యస్‌కెయం:** దాడులు చేస్తున్న పద్ధతులు మారాయి. కాబట్టి ఇపుడు జరుగుతున్న నష్టాలను, విధ్వంసాన్ని అప్పుడు జరిగినవాటితో పోల్చలేం. మరణాలు తక్కువగా ఉన్నా దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. మరణాల సంఖ్యతో పోలిస్తే పెద్దసంఖ్యలో వికలాంగులను చేసే విధంగా దాడులు చేసే పద్ధతుల్లో మార్పులు చేశారు. 1970లలో కన్నా విస్తృతంగానూ, తీవ్రంగానూ దాడులు జరుగుతున్నాయి. అర్ధఫాసిస్టు భయానక దాడులు కొన్ని జిల్లాలలోని పట్టణప్రాంతాలు, ఎంపిక చేసిన గ్రామీణ ప్రాంతాలలో జరిగాయి. ప్రస్తుత రాజకీయ అణచివేత ఒకటి, రెండు జిల్లాలను మినహాయించి అన్ని జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలలో కేంద్రీకరించబడింది. పద్ధతులు భిన్నంగా ఉన్నా, అప్పటి కన్నా తీవ్రమైనా అణచివేత జరుగుతున్నది. అంతర్జాతీయ పరిస్థితులు కూడా భిన్నంగా ఉన్నాయి. వియత్నాం యుద్ధంలో విజయం సాధించి, జాతీయ విముక్తి సంఘటన సైగాన్‌తో సహా దక్షిణ వియత్నాం అంతటిని స్వాధీనం చేసుకున్నది. ఈ రోజు ఉన్న మాదిరిగా అంతర్జాతీయ సమాజంపై సామ్రాజ్యవాదం ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఆనాడు లేదు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటం జరుగుతున్న కాలం అది. ప్రధానమంత్రి ఇందిరాగాంధి సోవియట్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పోరాటంలో ఐక్యత నెలకొనటానికి దారితీసింది.

**యంటిర్: రాష్ట్ర లౌకికవాద దృక్పధాన్ని గురించి మీరు ప్రస్తావించారు?**

**యస్‌కెయం:** అవును. ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతున్నప్పటికీ మతోన్మాదశక్తులు వేరూనుకోలేదు. సరిహద్దుకు ఏవైపున ఉన్నప్పటికీ బెంగాల్ ప్రజానీకం ఐక్యంగా విమోచన కోసం పోరాడుతున్న శక్తులకు మద్దత్తునిచ్చారు. హిందువులు, ముస్లీంలు కూడా రజాకార్లు ప్రజలకు శత్రువులనే అభిప్రాయంతో ఉన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. ప్రస్తుతం మతోన్మాదశక్తులుగా ఉన్న గత రజాకార్లు సరిహద్దు దాటివచ్చి ఇక్కడ రక్షణ పొందగలుగుతున్నారు.

**యంటిఆర్: నూతన తరాన్ని ఎదుర్కొంటున్న రాజకీయ పోరాటాలు, కర్తవ్యాలు ఏమిటి?**

**యస్‌కెయం:** ప్రస్తుత తరం అతిముఖ్యమైన నూతన అనుభవాల్ని పొందుతూ పయనించాల్సి ఉంది. మా తరానికి అర్ధఫాసిస్టు నిర్బంధాన్ని ఎదురొంటూ, అత్యవసర పరిస్థితిలో పనిచేసిన అనుభం ఉంది. అంతర్జాతీయంగా వర్గశక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా ఉన్న పరిస్థితిలో, ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాల ప్రభావం జాతీయ పరిస్థితులను ప్రభావితం చేస్తున్న పరిస్థితులలో, అస్థిత్వవాద రాజకీయాలు, ఆధునికానంతరవాద ప్రతీఘాతుక సిద్ధాంతాలు ప్రపంచవ్యాపితంగా విస్తృతంగా ప్రచారం చేయబడుతున్న పరిస్థితులలో పనిచేస్తూ నూతన తరం అనుభవాలు సంపాదించాల్సి ఉన్నది. ఆ విధంగా పరిస్థితులలో తీవ్రమైన మార్పులొచ్చాయి. ఈ అన్ని సవాళ్ళను ఒకేసారి ఎదుర్కొన్న అనుభవం మా తరానికి లేదు. యువతరం ఒకే సమ యంలో

బహుముఖ దాడులను ఎదుర్కొంటు న్నది. అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రస్థాయిలో జరిగే పోరాటంలో ప్రతిదశ లోనూ కష్టమైన, మరింత చిక్కైన పరిస్థితులు ఎదురౌతాయి. మా జీవితకాలంలో మేము పొందిన అనుభవాల కన్నా వారు ఎక్కువ అనుభవాలను పొందు తారనే విశ్వాసం నాకు ఉన్నది.

**యంటిఆర్: ఈ విధమైన పరిస్థితులలో వామపక్షాలు పునరుజ్జీవం పొందటానికి ఉన్న అవకాశాలేమిటి?**

**యస్‌కెఆర్:** ఈ ప్రశ్నకు సంబంధించిన అంతర్జాతీయ అంశాల లోతుపాతుల్లోకి నేనుపోను. దేశంలో ప్రజాస్వామ్య, సోషలిస్టు విధానాన్ని నెలకొల్పటం అంతర్జాతీయ పరిణామాలతో ముడిపడి ఉంటుంది. ఇతర దేశాలు ఏ విధంగా ఆ విధానాలను అమలు చేస్తున్నాయో పరిశీలిస్తూ, ఇతరుల అనుభవాల నుండి నేర్చుకుంటూ ముందుకు పోవాలి. అంతర్జాతీయంగా, దేశంలోనూ వామపక్షశక్తులు జయప్రదంగా పునరుజ్జీవం పొందటానికి భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నేను నమ్ముతున్నాను.

**యంటిఆర్: ప్రత్యేకంగా బెంగాల్‌ను గురించి మీరేమి చెబుతారు?**

**యస్‌కెయం:** 2008 పంచాయతి ఎన్నికల తర్వాత మా ప్రజాపునాది దెబ్బతింటున్నదని మేం మొదటగా గమనించాం. తర్వాత జరిగిన ఎన్నికలలో కొన్ని మార్పులున్నప్పటికీ అప్పటి నుండి రాష్ట్రంలో బలాబలాలలో మౌలికమైన మార్పులేమీ రాలేదని మేం భావిస్తున్నాం. దాని ప్రజాపునాది కొంత దెబ్బతిన్నప్పటికీ పాలక పార్టీకి ఇప్పటికీ మెజార్టి ప్రజల మద్దత్తు ఉంది. వారు మెజారిటి ఓట్లు కోల్పోనప్పటికి, ఎన్నికలలో తమకు వచ్చే మెజారిటి ఓట్లు తగ్గుతుండటంతో రాష్ట్రంలో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరిగితే తమ ఓట్లు గణనీయంగాతగ్గుతాయని, వామపక్షాల ఓట్లు పెరుగుతాయనే భయంతో ప్రస్తుతం వారు బలప్రయోగానికి పాల్పడుతూ, ఎన్నికలలో రిగ్గింగ్ చేయటానికి పూనుకుంటున్నారు. ఆ విధంగా ఓట్ల విభజనను వక్రీకరించటానికి పూనుకున్నారు. వామపక్షాలు బలంగా ఉండి, కొంత ప్రతిఘటన ఇవ్వగలిగిన ప్రాంతాలలో వారు ప్రత్యేకించి భయపడుతున్నారు.

**యంటిఆర్: ఇందుకు సంబంధించిన సానుకూల పరిణామాలు ఎలా ఉన్నాయి?**

**యస్‌కెయం:** బూర్జువా ప్రెస్‌కు బాగా ఇష్టంగా ఉన్న "వామపక్షాలు ఇప్పటికీ రక్తమోడుతూనే ఉన్నాయి'' అన్న పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగదని స్పష్టమౌతున్నది. మునిసిపల్ ఎన్నికల ఫలితాలను గనుక చూస్తే ప్రజామద్దత్తు కోల్పోవటాన్ని వామపక్షాలు నిరోధించాయని స్పష్టమౌతున్నది. టియంసి పాల్పడుతున్న భయానక చర్యలను ఎదుర్కోవటం, తిప్పికొట్టటం సాధ్యమేనని సిలిగురితో పాటు ఇతరచోట్ల జరిగిన పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. నాలుగు సంవత్సరాల తర్వాత ఇది సానుకూలమైన పరిణామం.

**“ మునిసిపల్ ఎన్నికల ఫలితాలు మావైఖరి సరైనదని నిరూపించాయి. టియంసికి బిజెపియే ప్రత్యామ్నాయంగా అవిర్భవిస్తుందనే భయం సరైనది కాదని మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ఏ మాత్రం సందేహం లేకుండా నిరూపించాయి. బిజెపికున్న మద్దత్తు గణనీయంగా తగ్గిపోయిందని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ”**

**యంటిఆర్: బెంగాల్లో బిజెపి అభివృద్ధి అవుతుందనే భయం ఉన్నదా?**

**యస్‌కెఆర్:** ముఖ్యమైన ఈ అంశానికి సంబంధించి మునిసిపల్ ఎన్నికల ఫలితాలలో స్పష్టత వచ్చింది. సంవత్సరం క్రితం వరకు బెంగాల్‌లో టియంసికి నిజమైన ప్రత్యామ్నాయం బిజెపి మాత్రమేనని ప్రచారం జరిగింది. వామపక్షాలకు ప్రత్యామ్నాయం లేదని అపుడు మేం స్పష్టంగా చెప్పాం. మునిసిపల్ ఎన్నికల ఫలితాలు మావైఖరి సరైనదని నిరూపించాయి. టియంసికి బిజెపియే ప్రత్యామ్నాయంగా అవిర్భవిస్తుందనే భయం సరైనది కాదని మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ఏ మాత్రం సందేహం లేకుండా నిరూపించాయి. బిజెపికున్న మద్దత్తు గణనీయంగా తగ్గిపోయిందని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు ఓట్లను సాధించటంలో వామపక్షాల తర్వాతే ఉంటాయనే వాస్తవం నిరూపించబడటం మరో ముఖ్యమైన అంశం. ఈ విషయాలు స్పష్టమైనప్పటికీ పరిస్థితి చాలా సంక్లిష్టంగా ఉంది. బిజెపి ఓట్లు తగ్గిపోయాయని నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు. ప్రజల ఐక్యతకు, లౌకికతత్వానికి మతోన్మాదశక్తులు తీవ్ర ప్రమాదంగా ఉన్నాయని మరచిపోరాదు. ఈ ప్రమాదాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయరాదు. మతోన్మాదం యొక్క ప్రమాదాన్ని కేవలం ఓట్లలో వారి భాగస్వామ్యాన్ని బట్టే అంచనా వేయరాదు. రాష్ట్రం యొక్క లౌకికవాద దృక్పధానికి తీవ్రనష్టాన్ని కలిగించగల శక్తి మతోన్మాదానికి ఉంది.

**యంటిఆర్: నూతనంగా సంభవిస్తున్న ఈ పరిణామాలపై మీరెటువంటి నిర్ణయానికి వస్తునారు?**

**యస్‌కెయం:** అనేక సమస్యలున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులలో వామపక్షాలు ముందుకు పోవటానికి, మరింతగా పెరగటానికి అవకాశాలున్నాయని మేము భావిస్తున్నాం. ప్రజల స్థితిని బట్టి, గత మునిసిపల్ ఎన్నికలలో దాడులను జయప్రదంగా తిప్పికొట్టటాన్ని బట్టి ఇటువంటి నిర్ణయానికి వస్తున్నాం. స్థానిక అధికార యంత్రాంగంతో కుమ్మక్కై టియంసియే ఈ దాడులను ప్రారంభించింది. (రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిస్సహాయతతో విజ్ఞప్తులు చేసింది.) ఎక్కడికక్కడ ప్రజలు స్వచ్ఛందంగా ప్రతిఘటన ప్రారంభించారని, దీనిలో మహిళలు ముందున్నారని స్పష్టమౌతున్నది. ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, ప్రజల జీవనాధారాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవటం కోసం జరిగే పోరాటంలో వామపక్షాలే నిజమైన ప్రత్యామ్నాయంగా నిరూపించుకోవటానికి అనువైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానికంగా విస్తృతమైన, నిర్మాణాత్మకమైన పోరాటాలపై కేంద్రీకరించాలని, ప్రజలను, వామపక్షాలను ఐక్యం చేయాలని, ప్రజాస్వామ్య, లౌకికశక్తులతో కలిసివచ్చే పార్టీలను, ప్రజలను కలుపుకు రావటానికి, యాదృచ్ఛికంగా వస్తున్న పోరాటాలపై పూర్తిగా ఆధారపడటం కాకుండా నిర్మాణాత్మకంగా పోరాటాలను పెంపొందింపజేయటం మా ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాం. భౌతిక పరిస్థితులు వ్యక్తుల ఆకాంక్షలతో నిమిత్తం లేకుండా ఉంటాయి. ఆ పరిస్థితిని అవకాశంగా తీసుకొని ముందుకు పోవటానికి, చిక్కులను అధిగమించటానికి వ్యక్తులు కృషి చేయాలి. అది మన శక్తిపైనా, ప్రయత్నాలపైనా ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటంలో వామపక్షాలు, వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయాన్ని అందించగలవు. ❋

**విద్యుత్‌రంగం**

# ప్రజలపై అక్రమంగా భారాలు మోపుతున్న విద్యుత్ పంపిణీ కంపెనీలు

*ఎం. వేణుగోపాలరావు*



రచయిత విద్యుత్‌రంగ నిపుణులు

**ఆం**ధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ 2009-10 నుండి 2013-14 వరకు అయిదేళ్ళ రెండవ నియంత్రిత కాలానికి రూ.7209 కోట్ల మొత్తాన్ని ట్రూ అప్ క్లెయిముల కింద విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ అనుమతిని కోరుతూ పిటిషన్లను దాఖలు చేశాయి. నియంత్రిత అయిదేళ్ళ కాలంలో కమిషన్ అనుమతించిన ఆదాయ, వ్యయాలలో వచ్చిన తేడా మొత్తాన్ని సర్దుబాటు చేయటం ట్రూ అప్. అంటే, పంపిణీ కంపెనీలకు కమిషన్ అనుమతించిన దానికన్నా ఆదాయం ఎక్కువ వస్తే అదనపు మొత్తాన్ని వినియోగదారులకు రాయితీగా నెలసరి విద్యుత్ బిల్లుల నుండి కమిషన్ నిర్ణయించిన మేరకు సర్దుబాటు చేయాలి. పంపిణీ కంపెనీలకు వ్యయం ఎక్కువై, ఆదాయం తగ్గితే ఆ లోటు మొత్తాన్ని పంపిణీ కంపెనీలు కమిషన్ అనుమతించిన విధంగా వినియోగదారుల నుండి వసూలు చేసుకోవాలి. అయితే, నిబంధనల మేరకు పంపిణీ కంపెనీలు అదుపు చేయలేని అంశాలకు సంబంధించిన ఆదాయ వ్యయాలలో తేడా మొత్తాన్ని మాత్రమే ట్రూ అప్ కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతి ఇవ్వాలి. పై నియంత్రిత కాలానికి ఎస్‌పిడిసిఎల్ రూ.866 కోట్ల మొత్తాన్ని పంపిణీ వ్యాపారం కింద, రూ.5185 కోట్ల మొత్తాన్ని చిల్లర సరఫరా వ్యాపారం కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతిని కోరింది. ఇపిడిసిఎల్ ఈ రెండు వ్యాపారాల కింద వరుసగా రూ.478 కోట్లు, రూ.680 కోట్ల మొత్తాన్ని అలా వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతిని కోరింది. నియంత్రిత అయిదేళ్ళ కాలంలో కమిషన్ అనుమతించిన విద్యుత్ ఛార్జీల పెంపు, ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు (ఎఫ్ఎస్ఎ) భారాలకు ట్రూ అప్ క్లెయిములు అదనం.

**ఎస్‌పిడిసిఎల్ క్లెయిములు**

చిల్లర సరఫరా వ్యాపారానికి సంబంధించి, అయిదేళ్ళ కాలంలో కమిషన్ 96,322 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోలుకు అనుమతించగా, తాను 89,262 మి.యూ.ను మాత్రమే కొనుగోలు చేసినట్లు ఎస్‌పిడిసిఎల్ తెలిపింది. అయితే, విద్యుత్ కొనుగోలు 7060 మి.యూ. మేరకు తగ్గినప్పటికి, విద్యుత్ కొనుగోలు వ్యయం కమిషన్ అనుమతించిన రూ.27,176 కోట్ల నుండి రూ.30,070 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. అంటే, అదనంగా రూ.2894 కోట్ల వ్యయం జరిగినట్లు చూపింది. అదేవిధంగా, మీటరుతో కొలిచిన విద్యుత్ విక్రయాలు 61,004 మి.యూ.గా ఉండాలని కమిషన్ నిర్ణయించగా, వాస్తవంగా 56,696 మి.యూ. మేరకే అలా సాధించగలిగినట్లు ఎస్‌పిడిసిఎల్ తెలిపింది. 4308 మి.యూ. మేరకు మీటరుతో కొలిచిన విక్రయాలు చేయలేకపోయినందున రూ.2186 కోట్ల మేరకు రెవెన్యూ నష్టం వాటిల్లిందని తెలిపింది. వివిధ కేటగిరీల వినియోగదారులకు విక్రయించే విద్యుత్ మిశ్రమం (సేల్స్ మిక్స్)లో వచ్చిన తేడా వల్ల, పారిశ్రామిక, వాణిజ్య, రైల్వే వినియోగదారులకు చేసిన విద్యుత్ విక్రయాలు కమిషన్ అనుమతించిన (మొత్తం విద్యుత్ విక్రయాలలో) 42.32 శాతం నుండి 41.03 శాతానికి, అంటే 1.28 శాతం మేరకు తగ్గి, రూ.1045 కోట్ల మేరకు రెవెన్యూ నష్టం వాటిల్లిందని ఎస్‌పిడిసిఎల్ తెలిపింది. నియంత్రిత కాలంలో కమిషన్ అనుమతించిన ఎఫ్ఎస్ఎలో రూ.2215 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకోగా, విద్యుత్ కొనుగోలు వ్యయంలో ఏర్పడిన తేడా కింద ఇంకా రూ.2804 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకోవాల్సి ఉందని ఎస్‌పిడిసిఎల్ వాదన.

**ఇపిడిసిఎల్ క్లెయిములు**

ఇపిడిసిఎల్ క్లెయిముల ప్రకారం, నియంత్రిత కాలంలో కమిషన్ 67,461 మి.యూ. మేరకు విద్యుత్ కొనుగోళ్ళను అనుమతించగా, వాస్తవంగా కొనుగోలు చేసింది 64,610 మి.యూ. కొనుగోళ్ళు 2851 మి.యూ. మేరకు తగ్గినా, కొనుగోలు వ్యయం కమిషన్ అనుమతించిన రూ.19,278 కోట్ల నుండి రూ.21,096 కోట్లకు, అంటే రూ.1818 కోట్ల మేరకు అదనంగా పెరిగింది. కమిషన్ నిర్ణయించిన మీటరుతో కొలిచిన విక్రయాలు 51,122 మి.యూ.కు గాను, వాస్తవంగా అలా విక్రయించింది 47,054 మి.యూ. మాత్రమే. ఆ విక్రయాలు 4068 మి.యూ. మేరకు తగ్గటం వల్ల ఇపిడిసిఎల్‌కు రూ.1945 కోట్ల నష్టం వాటిల్లింది. అయితే, పారిశ్రామిక, వాణిజ్య, రైల్వే వినియోగదారులకు 50 శాతం విక్రయాలు చేయాలని కమిషన్ అనుమతించగా, ఇపిడిసిఎల్ 52 శాతం మేరకు అలా విక్రయించగలిగింది. దీనివల్ల ఆదాయంలో రూ.1676 కోట్ల మేరకు తేడా వచ్చింది. కమిషన్ ఎఫ్ఎస్ఎ కింద

అనుమతించిన మొత్తంలో రూ.1778 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకోగా, విద్యుత్ కొనుగోళ్ళ వ్యయంలో తేడా కింద ఇంకా రూ.1082 కోట్ల మేరకు తాను పొందాల్సి ఉందని, ఇది 'అనుమతించని ఎఫ్ఎస్ఎ' అని ఇపిడిసిఎల్ పేర్కొంది.

కమిషన్ అనుమతించిన ఆదాయ వ్యయాలలో అనేక కారణాల వల్ల ఆచరణలో హెచ్చుతగ్గులు చోటు చేసుకోవచ్చు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పిపిఎ) కింద విద్యుత్ లభ్యత, కొనుగోలు రేట్లు, విద్యుత్ ఉత్పత్తికి సరఫరా జరిగే బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను కేటాయింపుల మేరకు సరఫరా చేయించటంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, వాటి కొరత వల్ల ఖరీదైన విదేశీ బొగ్గు, ఆర్ఎల్ఎన్జి వంటి ఇంధనాల కొనుగోలు, డాలరుతో రూపాయి మారకపు విలువ పడిపోవటం, విద్యుత్ కొరతను ఎదుర్కొనేందుకు స్వేచ్ఛా మార్కెట్లో స్వల్పకాలిక ప్రాతిపదికపై విద్యుత్‌ను కొనుగోలు చేయటం, కమిషన్, విద్యుత్‌పై అప్పిలేట్ ట్రిబ్యునల్ వంటివి ఇచ్చిన వినియోగదారుల వ్యతిరేక, డెవలపర్ల అనుకూల ఉత్తర్వులు, ప్రభుత్వాల విధానాలు, ఉద్యోగుల వేతన సవరణల వల్ల అయ్యే అదనపు వ్యయం, గతంలో ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులతో చేసుకున్న పిపిఎలలోని లోపాలను సరిదిద్దక పోవటం, కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులలో నిర్ణయించిన వివిధ అంశాలలో అంతర్గత సామర్థ్యం మెరుగుదల లక్ష్యాలను సాధించటంలో పంపిణీ కంపెనీల వైఫల్యం, వివిధ వ్యవహారాలలో పథకాల అమలులో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, పన్నులలో మార్పులు, రవాణా వ్యయం పెరుగుదల, తదితర కారణాల వల్ల ఆదాయవ్యయాలలో హెచ్చుతగ్గులు వస్తాయి. కమిషన్ అనుమతించిన విధంగా కాకుండా క్రాస్ సబ్సిడీ లభించే పారిశ్రామిక, వాణిజ్య, గృహ వినియోగదారులలో ఎగువ శ్లాబ్‌ల వినియోగదారులకు విక్రయించాల్సిన విద్యుత్ పరిమాణం తగ్గి, క్రాస్ సబ్సిడీ, ప్రభుత్వ సబ్సిడీ పొందే వినియోగదారులకు సరఫరా చేసిన విద్యుత్ పరిమాణం పెరిగినా, పంపిణీ కంపెనీల ఆదాయం తగ్గుతుంది. అదేవిధంగా, వీటిలో అనుమతించదగినవేవి, తిరస్కరించాల్సినవి ఏవి అనేది కమిషన్ విచారణ జరిపి నిర్ణయించాలి. అక్రమాలను, పొరపాట్లను సరిదిద్దేందుకు, పునరావృతం కాకుండా ఉండేందుకు కమిషన్ ఆదేశాలు జారీచేయాలి.

"అదేవిధంగా, వీటిలో అనుమతించదగినవేవి, తిరస్కరించాల్సినవి ఏవి అనేది కమిషన్ విచారణ జరిపి నిర్ణయించాలి. అక్రమాలను, పొరపాట్లను సరిదిద్దేందుకు, పునరావృతం కాకుండా ఉండేందుకు కమిషన్ ఆదేశాలు జారీచేయాలి."



ఎపిఇఆర్‌సి విచారణ సందర్భంగా నిరసనకారులపై జులుం ప్రదర్శిస్తున్న పోలీసులు

**ఎఫ్ఎస్ఎ క్లెయిములు**

అయిదేళ్ళ నియంత్రిత కాలంలో 2009-10లో, 2010-11లో మొదటి త్రైమాసికంలో ఎఫ్ఎస్ఎ కింద కమిషన్ అనుమతించిన మొత్తాలలో న్యాయస్థానం ఉత్తర్వు వల్ల రూ.408 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకోలేకపోయినట్లు ఎస్‌పిడిసిఎల్, రూ.302 కోట్ల మొత్తాన్ని వసూలు చేసుకోలేకపోయినట్లు ఇపిడిసిఎల్ తెలిపాయి. ఆ మొత్తాలను ఇప్పుడు ట్రూ అప్ కింద అనుమతించాలని చేసిన క్లెయిములలో చేర్చాయి. ఆ మొత్తాలను సంబంధిత వినియోగదారుల నుండి వసూలు చేయకుండా న్యాయస్థానం ఉత్తర్వులు కొనసాగుతుంటే, వాటిని ట్రూ అప్ కింద వసూలు చేసుకొనటం కోర్టు ధిక్కారం అవుతుంది. ఆ మొత్తాలు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన పారిశ్రామిక వినియోగదారుల వంటి వారికి సంబంధించినవైతే, ట్రూ అప్ కింద ఆ మొత్తాలను వినియోగదారులందరి నుండి వసూలు చేసుకొనేందుకు కూడా పంపిణీ కంపెనీలను అనుమతించరాదు. అయిదేళ్ళ నియంత్రిత కాలంలో మొదటి నాలుగు సంవత్సరాలకు సంబంధించి పంపిణీ కంపెనీల ఎఫ్ఎస్ఎ క్లెయిములపై కమిషన్ బహిరంగ విచారణలు జరిపి, పాల్గొన్న వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఉత్తర్వులిచ్చింది. ఆనాడు ఎఫ్ఎస్ఎ క్లెయిములలో కమిషన్ అనుమతించని మొత్తాలను ఇప్పుడు ట్రూ అప్ కింద అనుమతించాలనటం కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వమ్ముచేయాలనటమే. ఎఫ్ఎస్ఎను లెక్కించటంలో, మీటరుతో కొలిచిన విద్యుత్ విక్రయాలలో మార్పును మాత్రమే కమిషన్ పరిగణించిందని. వ్యవసాయ విక్రయాలలో మార్పును, నష్టాలను పరిగణించలేదని పంపిణీ కంపెనీల వాదన. వార్షిక ఛార్జీల ఉత్తర్వులలో కమిషన్ అనుమతించిన దానికి భిన్నంగా విద్యుత్ విక్రయాల మిశ్రమంలో తేడాలు వస్తే, తద్వారా పంపిణీ కంపెనీల ఆదాయాలలో తేడా వస్తే

> “వ్యవసాయానికి కమిషన్ అనుమతించిన దానికన్నా ఎక్కువగా విద్యుత్ సరఫరా చేసినట్లు పంపిణీ కంపెనీలు చేసే క్లెయిములు ప్రశ్నార్థకమైనవి. అలా అదనంగా సరఫరా చేసినా, అందుకైన అదనపు మొత్తాన్ని వ్యవసాయా నికి ఉచిత విద్యుత్ విధానం కింద ప్రభుత్వమే అదనపు సబ్సిడీ ఇచ్చి సర్దుబాటు చేయాలి.”

అందుకు వాటి, ప్రభుత్వ నిర్ణయాలే కారణమవుతాయి. క్రాస్ సబ్సిడీనిచ్చే పారిశ్రామిక, వాణిజ్య, రైల్వే వినియోగదారులకు చేసిన విద్యుత్ విక్రయాలు నియంత్రిత కాలంలో ఇపిడిసిఎల్‌లో పెరగగా, ఎస్‌పిడిసిఎల్‌లో తగ్గటాన్ని ఈ సందర్భంగా గమనించాలి. వ్యవసాయానికి కమిషన్ అనుమతించిన దానికన్నా ఎక్కువగా విద్యుత్ సరఫరా చేసినట్లు పంపిణీ కంపెనీలు చేసే క్లెయిములు ప్రశ్నార్థక మైనవి. అలా అదనంగా సరఫరా చేసినా, అందుకైన అదనపు మొత్తాన్ని వ్యవసాయానికి ఉచిత విద్యుత్ విధానం కింద ప్రభుత్వమే అదనపు సబ్సిడీ ఇచ్చి సర్దుబాటు చేయాలి.

లైను నష్టాలకు సంబంధించి, కమిషన్ నిర్ణయించిన లక్ష్యాలను సాధించటంలో పంపిణీ కంపెనీలు విఫలమైనప్పుడు ఆ నష్టాలను అవే భరించాలి. 2013-14 నుండి ఎఫ్ఎస్ఎ విధానాన్నికమిషన్ రద్దు చేసింది. అందువల్ల, నియంత్రిత కాలంలో ఒక్క 2013-14 సంవత్సరానికి సంబంధించిన క్లెయిములను మాత్రమే ఏ మేరకు అనుమతించాలనేది కమిషన్ ఇప్పుడు పరిగణించాలి. ఇందుకు, పంపిణీ కంపెనీలు సమర్పించిన కమిషన్ అనుమతించిన సగటు యూనిట్ విద్యుత్ కొనుగోలు రేటు, పంపిణీ కంపెనీలు ఇప్పుడు చూపుతున్న సవరించిన సగటు రేటు ఆధారంగా ఆ అదనపు కొనుగోళ్ళు అనుమతించదగినవా అనేది నిర్ణయించటం సాధ్యం కాదు. అదనపు కొనుగోళ్ళకు పంపిణీ కంపెనీలు కమిషన్ అనుమతి పొందాయా, పొందితే కమిషన్ నిర్ణయించిన పోటీ బిడ్డింగు విధానాన్ని అనుసరించాయా, కొనుగోలుకు అనుమతించిన పరిమాణాలకు, గరిష్ట కొనుగోలు రేటుకు పరిమితమయ్యాయా, ఎవరి నుంచి, ఏ కాలంలో, ఎంత రేటుకు అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేశాయి అనే వివరాలను పంపిణీ కంపెనీలు సమర్పించాలి. కమిషన్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఏ మేరకు వాటిని అనుమతించాలనేది నిర్ణయించాలి. అదేవిధంగా, విదేశీ బొగ్గు దిగుమతులకు అనుసరించిన పద్ధతులలో అక్రమాలు జరిగాయని, అధికారంలో ఉన్నవారు ముడుపులు దండుకున్నారని తీవ్రారోపణలు వచ్చాయి. గతంలో విచారణల సందర్భంగా వీటిని కమిషన్ దృష్టికి తెచ్చాము. వీటిని కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించి సముచిత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

**నెట్‌వర్క్ ఖర్చులు, ఇతర ఖర్చులు**

నెట్‌వర్క్ ఖర్చులు నియంత్రిత కాలంలో కమిషన్ అనుమతించిన రూ.6952 కోట్ల నుండి రూ.7031 కోట్లకు పెరిగాయని ఎస్‌పిడిసిఎల్, రూ.4560 కోట్ల నుండి రూ.4595 కోట్లకు పెరిగాయని ఇపిడిసిఎల్ చూపాయి. ప్రసార ఛార్జీలను లెక్కగట్టే విధానాన్ని భారత పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పిజిసిఐఎల్) మార్చడం వల్ల ఆ సంస్థకు చెల్లించాల్సిన ఛార్జీలు ఎస్‌పిడిసిఎల్‌కు రూ.407 కోట్ల నుండి రూ.528 కోట్లకు, ఇపిడిసిఎల్‌కు రూ.305 కోట్ల నుండి రూ.392 కోట్లకు పెరిగినట్లు చూపాయి. అయితే, పిజిసిఐఎల్ ప్రసార ఛార్జీలను లెక్కగట్టే విధానాన్ని మార్చి ఇలా ఛార్జీలను పెంచటాన్ని పంపిణీ కంపెనీలు సముచిత స్థాయిలలో సవాలు చేశాయా అనేది వివరించలేదు.

ఇతర ఖర్చులు కమిషన్ అనుమతించిన రూ.306 కోట్ల నుండి రూ.422 కోట్లకు పెరిగినట్లు ఎస్‌పిడిసిఎల్ చూపగా, ఇపిడిసిఎల్ తనకు ఈఖర్చులు రూ.252 కోట్ల నుండి రూ.247 కోట్లకు తగ్గినట్లు తెలిపింది. హెచ్‌టి వినియోగదారులకు 2009-10, 2010-11లో రూ.48.83 కోట్లు ప్రోత్సాహకం కింద చెల్లించినట్లు (ఇతరుల నుండి కాకుండా పంపిణీ కంపెనీ నుండి ఆ కాలంలో విద్యుత్ తీసుకున్నందుకు), మొండి, సందేహాదస్పదమైన బకాయిలను రూ.52.55 కోట్ల మేరకు మాఫీ చేసినట్లు ఎస్‌పిడిసిఎల్ చూపింది. ఇపిడిసిఎల్ అలాంటి క్లెయిములను చేయకపోవటం గమనార్హం. పై రెండు సంవత్సరాలలో హెచ్‌టి వినియోగదారులకు ప్రోత్సాహకం చెల్లింపు అనుమతించదగినదా అనేది కమిషన్ పరిశీలించాలి. ఆనాడు ఈ ప్రోత్సాహక పథకం అమలులో హెచ్‌టి పరిశ్రమలకు అధికంగా ప్రోత్సాహకాలను చెల్లించారన్న ఆరోపణలను గతంలో కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించిన దాఖలాలు లేవు. సంబంధిత వినియోగదారుల నుండి బకాయిలను వసూలు చేయడంలో ఎస్‌పిడిసిఎల్ వైఫల్యానికి, ఆ మొత్తాలను ఇతర వినియోగదారుల నుండి ట్రూ అప్ పేరుతో వసూలు చేయటమంటే అన్యాయంగా ఆ వినియోగదారులను శిక్షించటమే. బకాయిల మాఫీని, అదికూడా కమిషన్ ముందు అనుమతి లేకుండా, అనుమతించేందుకు కమిషన్ ఎలాంటి విధానాన్ని గాని, నిబంధనలను గాని జారీ చేయలేదు. ఈ కారణాల వల్ల, ఈ బకాయిల మాఫీని అనుమతించరాదు.

**పంపిణీ వ్యాపారం**

నియంత్రిత కాలంలో పంపిణీ వ్యాపారంలో పనిచేయించి, నిర్వహించే (ఓఅండ్ఎం) వ్యయం కమిషన్ అనుమతించిన రూ.2574 కోట్ల నుండి రూ.3782 కోట్లకు (రూ.1209 కోట్లు ఎక్కువగా) పెరిగినట్లు ఎస్‌పిడిసిఎల్ చూపగా, ఈ వ్యయం రూ.1987 కోట్ల నుండి రూ.2524 కోట్లకు (రూ.537 కోట్లు ఎక్కువగా) పెరిగినట్లు ఇపిడిసిఎల్ తెలిపింది. వేతన సవరణ, ఉద్యోగి సంబంధిత ఖర్చులు కమిషన్ అనుమతించిన రూ.2067 కోట్ల నుండి రూ.3068 కోట్లకు పెరిగినట్లు (రూ.1001 కోట్లు అదనం) ఎస్‌పిడిసిఎల్ చూపగా, రూ.1614 కోట్ల నుండి రూ.2086 కోట్లకు (రూ.471 కోట్లు అదనం) పెరిగినట్లు ఇపిడిసిఎల్ తెలిపింది. ఈ వ్యయం కమిషన్ అనుమతించిన దానికన్నా ఇపిడిసిఎల్‌లో దాదాపు 27 శాతం మేరకు పెరగగా, ఎస్‌పిడిసిఎల్‌లో దాదాపు 50 శాతం పెరిగింది. అదేవిధంగా, మరమ్మతులు, నిర్వహణ వ్యయం కమిషన్ అనుమతించిన దానికన్నా రూ.162 కోట్ల మేరకు పెరిగినట్లు ఎస్‌పిడిసిఎల్, రూ.89 కోట్ల మేరకు పెరిగినట్లు ఇపిడిసిఎల్ చూపాయి. ప్రైవేటు సంస్థల నిర్వహణకు అప్పగించిన సబ్ స్టేషన్లు అయిదేళ్ళ కాలంలో ఎస్‌పిడిసిఎల్‌లో 738 నుండి 1133కు పెరగగా, ఇపిడిసిఎల్‌లో 402 నుండి 520కి పెరిగాయి.

సబ్ స్టేషన్ నిర్వహణకు నెలసరి వ్యయం ఎస్‌పిడిసిఎల్‌లో 2009-10లో రూ.3.25 లక్షల నుండి 2012-13లో రూ.7.04 లక్షలకు, 2013-14లో రూ.6.44 లక్షలకు చేరాయి. ఇపిడిసిఎల్‌లో ఈ నెలసరి నిర్వహణ వ్యయం 2009-10లో, 2010-11లో రూ.2.8 లక్షల నుండి 2012-13లో రూ.4.6 లక్షలకు, 2013-14లో రూ.4.9 లక్షలకు పెరిగింది. నియంత్రిత కాలంలో ఛార్జీల ఏతర ఆదాయం కమిషన్ అనుమతించిన రూ.439 కోట్ల నుండి రూ.306 కోట్లకు ఎస్‌పిడిసిఎల్‌లో పడిపోగా, ఇది ఇపిడిసిఎల్‌లో రూ.67 కోట్ల నుండి 243 కోట్లకు పెరిగింది. ఇపిడిసిఎల్‌తో పోల్చితే, నియంత్రిత కాలంలో ఎస్‌పిడిసిఎల్ ఛార్జీల ఏతర ఆదాయం గణనీయంగా తగ్గగా, ఇతర వ్యయం చాలా అధికంగా పెరిగినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంశాల వారిగా వ్యయం వివరాలను పంపిణీ కంపెనీలు ఇవ్వనందున, వాటి సమర్ధనీయతను ఇలా సాపేక్షికంగా పరిశీలించటం సాధ్యం కాదు. ఏమైనా, సబ్ స్టేషన్ల నెలసరి నిర్వహణ వ్యయం ఇపిడిసిఎల్‌లో కన్నా ఎస్‌పిడిసిఎల్‌లో చాలా అధికంగా ఉండటం సమర్ధనీయం కాదు. ఈ వ్యత్యాసాలను, వ్యయం సమర్ధనీయతను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించి, సముచిత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

**ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక (ఎఫ్ఆర్‌పి)**

2015-16 ఆర్థిక సంవత్సరానికి పంపిణీ కంపెనీల వార్షిక ఆదాయ అవసరాలు, ఛార్జీల పెంపుదల ప్రతిపాదనలపై ఈ రచయిత లేవనెత్తిన అంశాలకు సమాధానమిస్తూ, ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక కింద తన అప్పులలో రూ.2240.20 కోట్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుదని, ఆ మేరకు తాను వివిధ బ్యాంకులకు, ఎపిట్రాన్స్‌కోకు, ఎపిజెన్‌కోకు, ఎపిఎస్‌పిడిసిఎల్ పిఎఫ్ ట్రస్టుకు జారీ చేసిన బాండ్లకు ప్రభుత్వం వచ్చే అయిదేళ్ళలో దశల వారీగా ప్రత్యేక సెక్యూరిటీలను జారీ చేసి వాటిపై వడ్డీని కూడా భరిస్తుందని ఎస్‌పిడిసిఎల్ వివరించింది. అదేవిధంగా, తన అప్పులలో రూ.1805.95 కోట్ల మేరకు జారీ చేసిన బాండ్లను ప్రభుత్వం అయిదేళ్ళ తరువాత వడ్డీతో సహా భరిస్తుందని ఇపిడిసిఎల్ తెలిపింది. అయితే, ఈ మొత్తాలను తమ ట్రూ అప్ క్లెయిముల మొత్తాల నుండి మినహాయించినట్లు రెండు పంపిణీ కంపెనీలు తమ పిటిషన్లలో ఎటువంటి ప్రస్తావన చేయలేదు. అందువల్ల, రెండు కంపెనీల ఎఫ్ఆర్‌పి మొత్తం రూ.4045.50 కోట్లను వాటి ట్రూఅప్ క్లెయిముల నుండి కమిషన్ తగ్గించాలి. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎఫ్ఆర్‌పి కింద ఇంత భారీ మొత్తాలను పొందుతూ, మరోపక్క అదే మొత్తాలను వినియోగదారుల నుండి ట్రూ అప్ కింద వసూలు చేసుకునేందుకు రెండుసార్లు క్లెయిము చేయడానికి పంపిణీ కంపెనీలను కమిషన్ అనుమతించరాదు.

> ❝ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎఫ్ఆర్‌పి కింద ఇంత భారీ మొత్తాలను పొందుతూ, మరోపక్క అదే మొత్తాలను వినియోగదారుల నుండి ట్రూ అప్ కింద వసూలు చేసుకునేందుకు రెండుసార్లు క్లెయిము చేయ దానికి పంపిణీ కంపెనీలను కమిషన్ అనుమతించరాదు.❞



విచారణ నిర్వహిస్తున్న ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్, సభ్యులు

**బహుళ సంవత్సర ఛార్జీలు (ఎంవైటి) నివారించదగిన వడ్డీ భారం**

పంపిణీ కంపెనీలు చేసిన ట్రూ అప్ క్లెయిముల మొత్తంలో, చిల్లర సరఫరా వ్యాపారం కింద చూపిన నికర లోటు రూ. 3927 కోట్లపై ఏడాదికి 12 శాతం వడ్డీ రూ.1258 కోట్లు ఉన్నట్లు ఎస్‌పిడిసిఎల్ తెలిపింది. పంపిణీ వ్యాపారం నికర లోటు 681 కోట్లలో వడ్డీ రూ.186 కోట్లు ఉన్నట్లు తెలిపింది. అదేవిధంగా, ఇపిడిసిఎల్ చిల్లర సరఫరా వ్యాపారం నికర లోటు రూ.476 కోట్లపై వడ్డీ రూ.204 కోట్లుగా, పంపిణీ వ్యాపారం నికర లోటు రూ.378 కోట్లపై వడ్డీ రూ.99 కోట్లు ఉన్నట్లు చూపింది. అంటే, ఈ లోటు నిమిత్తం తీసుకున్న స్వల్పకాలిక రుణాలపై చెల్లిస్తున్న ఈ వడ్డీని కారీయింగ్ కాస్ట్‌గా వినియోగదారుల నుండి ట్రూ అప్ కింద వసూలు చేసుకునేందుకు అనుమతించాలని పంపిణీ కంపెనీలు కమిషన్‌ను కోరాయి. ఈ మొత్తం వడ్డీ భారం రూ.1747 కోట్లు. సంస్కరణల పేరుతో ఢిల్లీ నుండి రుద్దిన ఎంవైటి విధానాన్ని అనుసరిస్తున్న దుష్ఫలితమే ఈ నివారించదగిన వడ్డీ భారం. విద్యుత్ రంగంలో సంస్కరణలను ఎంత తలతిక్కగా సంస్కరణవాదులు నిర్ణయిస్తున్నారనే దానికి ఇది ఒక ఉదాహరణ. ఎఫ్ఎస్ఎ విధానం ఉద్దేశం కమిషన్ అనుమతించిన విద్యుత్ కొనుగోలు వ్యయంలో వచ్చే తేడాలను త్వరగా సర్దుబాటు చేయడం. కాగా, కమిషన్ అనుమతించిన ఆదాయవ్యయాలలో వచ్చే తేడాలను అయిదేళ్ళ నియంత్రిత కాలం తరువాత అలాంటి సర్దుబాటు చేయాలనే ఎంవైటి విధానం ఎఫ్ఎస్ఎకు విరుద్ధమైనది. ఎంవైటి విధానం ప్రకారం నియంత్రిత కాలం చివర ఇలాంటి తేడాలను సర్దుబాటు చేయటం వల్ల ఎంతో కాలం కొనసాగే వడ్డీ భారంతో సహా అంగీకారయోగ్యం కానంతగా అధిక భారం పంపిణీ కంపెనీలపై

> **“ కమిషన్ జారీచేసిన నియమాలు, నిర్ణయించిన పరిమితులను విద్యుత్ సంస్థలు ఉల్లంఘిస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఎంవైటి విధానం వల్ల వాటిని సకాలంలో గుర్తించి, సరిదిద్ది, నియంత్రిత కాలంలో తిరిగి అలాంటి పొరపాట్లు జరగకుండా చూసేందుకు అవకాశం లేకుండా పోతున్నది. ”**

(ట్రాన్స్‌కోపై కూడా) పడుతుందని కమిషన్ గతంలో పేర్కొంది. ఎంవైటీ వల్ల పంపిణీ కంపెనీలకు ఎలాంటి ప్రయోజనం చేకూరక పోగా, వినియోగదారులపై పేరుకుపోయిన భారాలతో పాటు నివారించదగిన వడ్డీ భారం పడుతున్నాయి.

అయిదేళ్ళ కాలానికి విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ సామర్థ్యాలను చేర్చడం, వాటి అంచనాల ఆధారంగా ఛార్జీలను నిర్ణయించడంలో విద్యుత్ సంస్థలు, కమిషన్ తీసుకున్న నిర్ణయాలలో పొరపాటుపడ్డాయని రెండవ నియంత్రిత కాలం అనుభవం నిర్ధారించింది. ప్రతి ఏడాది వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలను కమిషన్‌కు సమర్పిస్తూ, ఎంవైటి లక్ష్యాలను ఎందుకు సాధించలేవో, తాము ఎటువంటి అనిశ్చితులను ఎదుర్కొంటున్నాయో పంపిణీ కంపెనీలు వివరిస్తూనే ఉన్నాయి. పంపిణీ వ్యాపారానికి సంబంధించి అయిదేళ్ళ నియంత్రిత కాలానికి అంచనాలను సమర్పిస్తున్నా, విద్యుత్ సంస్థలకు నిర్ణీత లక్ష్యాల ఆధారంగా అవి సాధించిన ఫలితాలపై ప్రోత్సాహకాలను అనుమతించడం, వినియోగదారులకు నియంత్రణ అనిశ్చితిని తగ్గించటం అనే ఎంవైటి విధానం ఏర్పాటులోని లక్ష్యాలు నెరవేరటం లేదని కూడా అనుభవం నిర్ధారించింది. వివిధ కేటగిరీల వినియోగదారుల డిమాండు, విద్యుత్ విక్రయాల మిశ్రమం, కొనుగోలుకు లభ్యమయ్యే విద్యుత్ పరిమాణం, దాని ఖరీదు, ముఖ్యంగా అస్థిర వ్యయం, థర్మల్, జల విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాజెక్టుల నిర్ణీత అమలు కాలం, ప్రాజెక్టులకు ఇంధనాల సరఫరా, ఇంధనాల ధరలు, డాలరుతో రూపాయి మారకపు విలువ, దిగుమతి చేసుకునే బొగ్గు, ఆర్ఎల్ఎన్‌జి వంటి ఇంధనాలు, పన్నులు, రవాణా ఛార్జీలు, స్వల్పకాలిక ప్రాతిపదికపై స్వేచ్ఛా మార్కెట్లో విద్యుత్ కొనుగోలు, కాస్ట్ ఆఫ్ సర్వీసు (ఉత్పత్తి స్థానం నుండి వినియోగ స్థానం వరకు విద్యుత్ సరఫరాకు అయ్యే అన్ని ఖర్చులు కలిపి యూనిట్ విద్యుత్‌కు అయ్యే సగటు మొత్తం), ప్రభుత్వం నుండి సబ్సిడీ అవసరం, క్రాస్ సబ్సిడీ, న్యాయపరమైన వివాదాలు, కమిషన్, అప్పిలేట్ ట్రిబ్యునల్ వంటివి ఇస్తున్న వినియోగదారుల వ్యతిరేక, డెవలపర్ల అనుకూల ఉత్తర్వులు, తదితరాల వల్ల వచ్చే తేడాల అనిశ్చితులు ఎప్పటికప్పుడు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కమిషన్ జారీచేసిన నియమాలు, నిర్ణయించిన పరిమితులను విద్యుత్ సంస్థలు ఉల్లంఘిస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఎంవైటి విధానం వల్ల వాటిని సకాలంలో గుర్తించి, సరిదిద్ది, నియంత్రిత కాలంలో తిరిగి అలాంటి పొరపాట్లు జరగకుండా చూసేందుకు అవకాశం లేకుండా పోతున్నది. ఎంవైటి విధానాన్ని ప్రవేశపెట్టక ముందు కూడా అయిదేళ్ళ కాలానికి విద్యుత్ సంస్థలు తమ అంతర్గత ప్రణాళికలను రూపొందించుకుంటూ వస్తూనే ఉన్నాయి. ఇలాంటి కారణాల వల్ల ఎంవైటి విధానాన్ని రద్దు చేయాలని, దాని బదులు విద్యుత్ సంస్థల వార్షిక ఎకౌంట్ల ఆడిట్ ఆధారంగా వార్షిక ట్రూ అప్‌ను పరిగణించాలని కమిషన్‌కు గతంలోనే సూచించాము. పంపిణీ కంపెనీలు ఎఫ్ఎస్ఎ క్లెయిములను సకాలంలో సమర్పించకుండా ఏళ్ళ తరబడి ఆలస్యం చేయటం, కమిషన్ సకాలంలో ఎఫ్ఎస్ఎ ఉత్తర్వులు ఇవ్వకపోవటం, దీనివల్ల వినియోగదారులకు కలుగుతున్న నివారించదగిన ఇబ్బందులు, ఎఫ్ఎస్ఎ విధానంలోని లోటుపాట్లను ఎత్తిచూపినా వాటిని సరిదిద్దేందుకు కమిషన్ పూనుకొనకపోవటం వంటి కారణాల వల్ల ఎఫ్ఎస్ఎ విధానాన్ని రద్దు చేయాలని కూడా గతంలో కమిషన్‌ను కోరాము. చివరకు కమిషన్ ఎఫ్ఎస్ఎ విధానాన్ని రద్దు చేసింది.

ట్రూ అప్ కింద పంపిణీ కంపెనీలు క్లెయిము చేసిన మొత్తాలలో అత్యధిక భాగాన్ని కమిషన్ తిరస్కరించే అవకాశం ఉంది. ఛైర్మన్ జస్టిస్ జి.భవానీ ప్రసాద్ నాయకత్వంలో విద్యుత్ నియంత్రణ కమిషన్ 2015-16 సంవత్సరానికి పంపిణీ కంపెనీల వార్షిక ఆదాయ అవసరాలు, ఛార్జీల పెంపుదల ప్రతిపాదనలపై బహిరంగ విచారణలో వచ్చిన పలు సబబైన సూచనలు, అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకుని సముచితమైన నిర్ణయాలు తీసుకున్నది. అదేవిధంగా, ట్రూ అప్ క్లెయిములపై వచ్చిన అభ్యంతరాలు, సూచనలను, ఇతర అంశాలను, ట్రూ అప్ క్లెయిములపై సెప్టెంబరు 19న జరిపే బహిరంగ విచారణలో వెలిబుచ్చే అభిప్రాయాలను కూడా కమిషన్ పరిగణించి తన అధికార పరిధిలో సముచిత నిర్ణయాలు తీసుకొంటుందని ఆశించవచ్చు. పంపిణీ కంపెనీల ట్రూ అప్ క్లెయిములపై సిపిఐఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ కార్యదర్శి పెనుమల్లి మధు, సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ, ఈ రచయితతో పాటు పలువురు కమిషన్‌కు తమ అభ్యంతరాలను, సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించారు. ❋

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

ఆర్థికరంగం

# పెట్టుబడిదారీ సంక్షోభానికి మరో సూచన మార్కెట్ల పతనం



రచయిత సిపిఐ (ఎం) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఎస్. వెంకట్రావు

గ్రీసు దేశంలో ఏర్పడిన ఆర్థిక, రాజకీయ సంక్షోభం గురించి గత నెల మార్క్సిస్టులో రాస్తూ... "ఏమైనా ఈ రోజు గ్రీసులో జరుగుతున్న పరిణామాలు ఆ దేశానికే పరిమితం కావు. నయా-ఉదారవాద విధానాల వికృత ఫలితాలు ప్రస్తుతానికి అక్కడ కేంద్రీకృతం అయినాయి అంతే! ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో చాలా దేశాలు గ్రీసు బాటలోకి వచ్చే అవకాశముంది" అని పేర్కొనడం జరిగింది. ఈ విషయం చెప్పి నెల తిరక్కుండానే మొత్తం ప్రపంచ స్టాక్‌మార్కెట్లు, కరెన్సీలు ఒక్కసారిగా పతనమై ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పెద్ద కుదుపుకు గురైంది. ఈ కుదుపు వచ్చిన సమయం ముఖ్యమైనది. పెట్టుబడిదారీ ఆర్థిక పండితులు ప్రపంచ ఆర్థిక పరిస్థితులు కుదుట పడుతున్నాయని జోస్యాలు చెబుతూ పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాస్తున్న తరుణంలో, అమెరికా నుండి ఇండియా వరకు ఆర్థికాభివృద్ధి గాడిలో పడుతున్నదని ఆనందిస్తున్న కాలంలో, అమెరికా, యూరప్ కేంద్ర బ్యాంకులు ఆర్థిక మాంద్యం తొలగిపోతోంది. ఇక వడ్డీ రేట్లు పెంచవచ్చునని భావిస్తున్న తరుణంలో, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గ్రీసును ఒక గాడిలో పెట్టగలిగామని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఈ కుదుపు వచ్చింది.

ఆగస్టు మధ్యలో చైనా కరెన్సీ యువాన్ విలువను తగ్గించింది. దాంతో ప్రపంచమంతా మార్కెట్లలో భయానక వాతావరణం ప్రారంభమైంది. సోమవారం చైనా స్టాక్ మార్కెట్లు 9 శాతం కుప్ప కూలాయి. ప్రపంచ మార్కెట్లు, కరెన్సీలు పతనమైనాయి. పటిష్టమైన ఆర్థిక పునాదులమీద ఉందని ఊదరగొడుతున్న మన ఆర్థిక వ్యవస్థకూడా కుదుపుకు లోనైంది. బోంబే స్టాక్ ఎక్స్చేంజిలో సెన్సిటివ్ ఇండెక్స్ ఒక్క రోజే 1617 పాయింట్లు పడిపోయింది. రూపాయి డాలరుతో పోలిస్తే 67 రూపాయల దగ్గరకు పతనమైంది.

అందువల్ల 2008లో ప్రారంభమైన ఆర్థిక పతనం ఆగిపోలేదు సరిగదా మరింత పతనంలోకి దిగజారుతోందని ప్రపంచ పెట్టుబడిదారీ పాలక వర్గాల్లో భయం పట్టుకుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌లాగా పనిచేస్తున్న చైనా ఆర్థిక వ్యవస్థ సమస్యల నెదుర్కొంటున్నదనే భయాలు ఫైనాన్స్ మార్కెట్లను కృంగదీస్తున్నాయి. 2008 తరువాత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో పడడంతో చైనా, భారత్ వంటి వర్ధమాన దేశాల్లో ఆర్థికాభివృద్ధి కొంతవరకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను రక్షిస్తూ వచ్చింది. చైనా నుండి లాటిన్ అమెరికా వరకు ఇప్పుడా మార్కెట్లే మాంద్యంలో పడ్డాయి. గత ఏడాది వరకు 8 నుండి పది శాతం వరకు అభివృద్ధి చవి చూసిన చైనా జిడిపి పెరుగుదల ఈ ఏడాది 7.4 శాతానికి తగ్గింది. నిజానికి చైనా ప్రభుత్వం తన అంతర్గత సర్దుబాట్లలో భాగంగా జిడిపి అభివృద్ధి రేటును కావాలనే తగ్గించుకుంది. భారత దేశంలో జిడిపి 7.5 శాతం దాటుతుందనీ, రానున్న ఏడాది 8 శాతం దాటుతుందనీ మన నేతలు, ఆర్థిక పండితులు వాదిస్తూ వచ్చారు. ఆర్థికాభివృద్ధిలో త్వరలో చైనాను మించిపోతామని చెప్పారు. ఇదంతా తమ విధానాల ఘనకార్యమని చెప్పారు. కానీ భారత్ అభివృద్ధి 7 శాతం ఉంటుందని తాజా లెక్కలు చెబుతున్నాయి. లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లోని ఇతర వర్ధమాన దేశాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇక అభివృద్ధి చెందిన జపాన్, యూరప్ ఆర్థిక వ్యవస్థలు మాంద్యం నుండి కోలుకోలేదు. అమెరికా కోలుకుంటోంది అని చెబుతున్నా అది ఒడిదుడుకులతో ఉందని భావిస్తున్నారు. వీటన్నిటి ఫలితంగా ప్రాథమిక సరుకులైన చమురు, సహజవాయువు, రాగి, ఇనుము, ఇతర ఖనిజాలు వంటి వాటి ధరలు పడిపోయాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతోంది.

2008 తరువాత చైనా ఆర్థిక వ్యవస్థ 10 శాతం అభివృద్ధితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌లా పనిచేసి నడిపించింది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించింది. ఉత్పత్తి కేంద్రంగా మారింది. వస్తువులను ప్రపంచానికంతటికీ ఎగుమతి చేసింది. కానీ ఇప్పుడు ఆ దేశమే సమస్యల నెదుర్కొంటోంది. అది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్‌లో పడిందంటున్నారు. వార్షిక సగటు ఆదాయం 10 నుండి 14 వేల డాలర్లకు చేరుకున్న దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలంటారు. అప్పుడు అక్కడి కార్మికుల వేతనాలు పెరుగుతాయి. అందువల్ల గతంలో లాగా చౌకగా వస్తువుల ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు. అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మకాల పోటీలో వెనకబడిపోవడం జరుగుతుంది. ఎగుమతులు తగ్గుతాయి. అందువల్ల విదేశీ

**"కానీ అమెరికా మాంద్యం నుండి బయట పడుతోందన్న వాదనల్లో ఎంత డొల్లతనం ఉందో గత నెల మార్కెట్ పతనాలు తెలియజేశాయి. న్యూయార్క్‌ప్రాంతంలో ఉ త్పత్తి గణనీయంగా పడిపోయిందని అమెరికా కేంద్ర బ్యాంకు - ఫెడరల్ రిజర్వు గత నెల చివర ప్రకటించింది. అమెరికాలో కార్మికులను పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్న వాల్‌మార్ట్ లాభాలు గణనీయంగా పడిపోయాయి."**

పెట్టుబడులు కూడా బయటకు – చౌకగా కార్మికులు దొరికే ప్రదేశాలకు పారిపోతాయని చెబుతున్నారు. ఒకవైపు వస్తువుల ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ కృశించి పోతుండడంతో చైనా ఎగుమతులు తగ్గాయి. దాంతో ఎగుమతులు నిలుపుకోడానికి అది తన కరెన్సీ విలువను తగ్గించుకుంది. అది మొత్తం ప్రపంచాన్నే ఒక కుదుపు కుదిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను రక్షించే నాథుడు కనిపించడం లేదు. చైనా స్థానాన్ని ఆక్రమిం చాలని భారత పాలక వర్గాలు ఆశిస్తున్నాయి. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా పోషించిన స్థానంలోకి భారత్ రాగలదని ఆశిస్తున్నాయి. అందుకే మరిన్ని సంస్కరణలు ప్రవేశపెట్టి విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని యోచిస్తున్నాయి. కానీ భారత మార్కెట్లలో లాభదాయకత పెద్దగా లేకపోవడం, మార్కెట్‌పై నమ్మకాలు లేకపోవడం, అమెరికా వడ్డీ రేట్లు పెంచవచ్చునన్న ఆశలు..వీటి వల్ల విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత్ మార్కెట్లవైపు పెద్దగా చూడ్డం లేదు.

అందువల్ల ఈ రోజున "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ లైఫ్ బోట్లు లేని ఓడ ప్రయాణంలా" ఉ ందని హెచ్‌ఎస్‌బిసి బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త స్టీఫెన్ కింగ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూడు ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఈ ఏడాది ప్రారంభంలో ఆయన చెప్పారు. అవి: 1. స్టాక్ మార్కెట్ల అధోపతనం, 2 పెన్షన్ ఫండ్లు, బీమా సంస్థలు దివాళా తీసి తమ క్లయింట్లకు డబ్బు చెల్లించలేని స్థితికి రావడం. 3. చైనాలో మాంద్య ఏర్పడి అది అమెరికానూ, మొత్తం ప్రపంచాన్ని మాంద్యంలోకి లాగడం.

పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు "షాక్ అబ్జార్బర్‌గా ఉన్న చైనా ఆ స్థితిని కోల్పోతే ఇక ప్రపంచాన్ని ఆదుకునే దిక్కే ఉండదని స్టీఫెన్ కింగ్ చెబుతున్నారు. నేడు ప్రపంచంలో ఏ దేశమూ అప్పు లేకుండా లేదు. రోజురోజుకీ ప్రభుత్వాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. 2008 సంక్షోభం తరువాత దివాళా తీసిన ఆర్థిక సంస్థలను రక్షించడానికి బెయిలవుట్ ప్యాకేజీలు ప్రకటించిన ఆయా దేశాల ప్రభుత్వాలు తాము మరింత అప్పుల్లో కూరుకుపోయాయి. ఉ దాహరణకు, ఈ రోజు ప్రపంచ జిడిపి సుమారు 70 ట్రిలియన్ డాలర్లు (70 లక్షల కోట్ల డాలర్లు) కాగా అప్పు 200 ట్రిలియన్ డాలర్లు. అంటే ఉత్పత్తికన్నా అప్పు మూడు రెట్లు ఎక్కువన్న మాట. చైనా అప్పు జిడిపిలో 40%, భారత్ 50% ఉంటే అమెరికా అప్పు 107 శాతం ఉ ంది. ఇటీవల దివాళా తీసిన గ్రీసు అప్పు 200శాతం పైనే ఉంది. ఐర్లండ్, సైప్రస్‌లాంటి దేశాలు అప్పులతో దివాళా తీయగా స్పెయిన్, పోర్చుగీసు వంటి దేశాలు దివాళా అంచులకు చేరాయి.

అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అప్పుల్లో ఉండడం, వడ్డీ రేట్లు దాదాపు సున్నాకు చేరడం, 4 ట్రిలియన్ డాలర్ల వాణిజ్య లోటులో ఉండడం వల్ల దానికి మరో సంక్షోభాన్ని ఎదుర్కొనే సత్తా లేదని చెబుతున్నారు. "వచ్చే సంక్షోభాన్ని ఎదుర్కొనే మందుగుండు అమెరికా దగ్గర లేదు" అని గత నెల వాల్ స్ట్రీట్ జర్నల్ ఒక వ్యాసంలో పేర్కొంది.

ఇలాంటి సున్నితమైన పరిస్థితిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఉంది కాబట్టే గత నెల చైనా యువాన్ విలువను కేవలం 2.6 శాతం తగ్గించడంతోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భయకంపితమైంది. అమెరికాతో సహా చాలా దేశాలు తమ కరెన్సీ విలువలు తగ్గించుకున్నాయి. మరోసారి కరెన్సీ యుద్ధం ప్రారంభమవ బోతోందన్న భయం పెట్టుబడిదారీ ప్రపం చంలో రాజ్యమేలింది. అయితే చైనా కేవలం తన ఎక్స్ఛేంజ్ రేట్లలో కొద్దిపాటి సవరణలు చేస్తున్నానే గాని కరెన్సీ విలువ తగ్గింపుకు పాల్పడ్డం లేదని హామీ ఇవ్వడంతో మొత్తం ప్రపంచ కరెన్సీ మార్కెట్లు, స్టాక్ మార్కెట్లు కుదుట పడ్డాయి.

కానీ అమెరికా మాంద్యం నుండి బయట పడుతోందన్న వాదనల్లో ఎంత డొల్లతనం ఉ ందో గత నెల మార్కెట్ పతనాలు తెలియజేశాయి. న్యూయార్క్ ప్రాంతంలో ఉ త్పత్తి గణనీయంగా పడిపోయిందని అమెరికా కేంద్ర బ్యాంకు – ఫెడరల్ రిజర్వు గత నెల చివర ప్రకటించింది. అమెరికాలో కార్మికులను పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్న వాల్‌మార్ట్ లాభాలు గణనీయంగా పడిపోయాయి. ఆర్థిక సంక్షోభ భారాలను కార్మికుల మీదకు నెట్టి తాము బయట పడి పోవడానికి ప్రధాన మైన అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు ఇటీవల పెద్ద ఎత్తున మెర్జర్లకు పాల్పడుతూ కార్మికులను వేల సంఖ్యలో ఉద్యోగాల నుండి తొలగిస్తున్నాయి. గత రెండు మూడు మాసాల కాలంలోనే బడా బహుళజాతి కార్పొరేషన్లయిన క్రాఫ్ట్, మోటోరోలా, లెనొవొ, ట్రైసన్, హెటిసిలు పెద్ద ఎత్తున కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో కంపెనీల మెర్జర్ల ఫలితంగా కార్మికులను తొలగించాయి. ప్రపంచ కార్మికుల్లో 5 శాతం మందిని నియమించే అమెరికాకు చెందిన ఆహార ప్రాసెసింగ్ కంపెనీ క్రాఫ్ట్, హెచ్.జె. హీంజ్ కా తో విలీనమైన ఫలితంగా గత నెల 2,500 మంది కార్మికులను తొలగించింది. చికాగో దగ్గరలోని బ్రాంచ్ నుండి మరో 700 మందిని తొలగించటానికి సిద్ధమైనారు. రానున్న కాలంలో మరిన్ని వేల మందిని తొలగిస్తారని చెబుతున్నారు. లెనొవొ కంపెనీ ఇటీవల 3,200 మందిని తొలగించింది. త్వరలో మరింత మందిని తొలగించబోతోందని చెబుతున్నారు. హెటిసి కంపెనీ ప్రపంచ వ్యాపితంగా తన కార్మికుల్లో 15శాతాన్ని తొలగిస్తున్నట్లు ప్రకటిం చింది. తాను 2003లో చేజిక్కించుకున్న నోకియా కంపెనీ నుండి 7,800 మందిని తొలగిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ రంగంలోనే కాకుండా గనులు, ఇంధనం తదితర రంగాల్లో అనేక వేల మంది కార్మికులు తొలగింపులకు గురి అవుతున్నారు. అదే సమయంలో ఈ కంపెనీలు మెర్జర్ల ద్వారా లక్షల కోట్ల డాలర్లు వెనకేసుకుంటున్నాయి. కంపెనీలను లాభల్లో ఉంచినందుకు సిఇఓలు లక్షల డాలర్లలో వేతనాలు పొందుతున్నారు. కానీ కార్మికులు మాత్రం నిరుద్యోగులుగా రోడ్లమీద పడి దుర్భర జీవనాన్ని అనుభవి

స్తున్నారు.

మరోవైపు అన్ని దేశాల్లోనూ కార్మికుల సంక్షేమం, వేతనాల్లో విచ్చలవిడిగా కోతలు విధిస్తున్నారు. ప్రయివేటు ఫైనాన్స్ సంస్థలను రక్షించేందుకు బెయిలవుట్ ప్యాకేజీలు ప్రకటించిన ప్రభుత్వాలు దాని వల్ల తడిసి మోపెడైన అప్పుల నుండి బయట పడేందుకు పొదుపు చర్యలకు పాల్పడుతున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు దేశాలకు అప్పులిచ్చే ముందు పొదుపు చర్యలను షరతుగా విధిస్తున్నాయి. ఫలితంగా కార్మికుల వేతనాలు, వారి జీవన ప్రమాణాలు మరింత కుంచించుకు పోతున్నాయి. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు వేతనాల కుదింపు, సంక్షేమంలో కోత కార్మికుల కొనుగోలు శక్తిని గణనీయంగా తగ్గించి వేస్తున్నాయి. వారికి అప్పులిచ్చి ఆర్థిక వ్యవస్థను చురుకుగా నడిపే శక్తి, అవకాశాలు ప్రపంచ దేశాలకు లేవు. దీని ఫలితమేమంటే రానున్న కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింతగా మాంద్యాన్ని ఎదుర్కొంటుందే తప్ప పునరుద్ధరణ జరగడం కష్టమని నిపుణులు భావిస్తున్నారు. ఒకవైపు నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతుంటే కార్పొరేట్ యజమానులు మరింత ధనికులవు తున్నారు. వాళ్ల వల్ల ప్రపంచానికి ఆర్థిక సంక్షోభం వచ్చింది. కానీ సంక్షోభం నుండి బయటపడే బెయిలవుట్ ప్యాకేజీల వల్ల వాళ్లే లాభం పొందారు. ప్రభుత్వాలు ప్రకటించే పొదుపు విధానాలు కార్పొరేట్ లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచాయి. నేడు మాంద్యం ఏర్పడిన పరిస్థితుల్లో కార్పొరేట్ పెట్టుబడి ఉత్పత్తి శక్తుల పెంపుదలకు ఉపయోగిస్తే, పరిశోధనా అభివృద్ధి మీద పెట్టుబడి పెడితే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ వారు ఆ పని చేయకపోగా డబ్బు నంతటినీ మెర్జర్లకూ, స్టాకులు తిరిగి కొనుక్కోడానికీ ఖర్చు చేస్తున్నారు. అందువల్ల సిఇఒల వేతనాలు, కంపెనీల లాభాలు పెరిగి ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక అసమానతలు విపరీతంగా విస్తరించాయి.

అందువల్ల 2008లో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం సమసిపోలేదు సరికదా ఎక్కడ ఎప్పుడు బద్దలవుతుందోనని అంతర్జాతీయ పెట్టుబడిదారీ పాలక వర్గాలు క్షణక్షణం భయపడుతున్నాయి. అందుకే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎక్కడ చిన్న సమస్య వచ్చినా మార్కెట్లు కుదేలవుతున్నాయి.

### చైనాపై ప్రచారం

గత నెల మార్కెట్ల పతనం వెనుక ఒక విశేషమేమంటే మొత్తం కార్పొరేట్ మీడియా చైనాపై దుష్ప్రచారానికి దీన్ని పెద్ద ఎత్తున వాడుకున్నది. ఒక విషయమేమంటే చైనా నేడు తీవ్రమైన ఆర్థిక సమస్యల నెదుర్కొంటున్నదని ఆ దేశాధ్యక్షుడు సీ జిన్‌పింగ్ స్వయంగా అంగీకరించారు. 2012లో తాను అధికారం చేపట్టిన తరువాత ఎన్నడూ తమ దేశం ఇంతటి గడ్డు పరిస్థితిని ఎదుర్కోలేదని ఆయన చెప్పారు. అయితే చైనా ఈ పరిస్థితులను ఖచ్చితంగా అధిగమించగలదని కూడా ఆయన చెప్పారు. దానికి తగ్గట్లే చైనా స్టాక్ మార్కెట్ పతనానికి కారణాలు తెలుసుకుంటోంది. వదంతులకు పాల్పడి మార్కెట్ల పతనానికి కారకులైనవారిపై చర్యలకు ఉపక్రమించింది.

> “ఫలితంగా కార్మికుల వేతనాలు, వారి జీవన ప్రమాణాలు మరింత కుంచించుకు పోతున్నాయి. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు వేతనాల కుదింపు, సంక్షేమంలో కోత కార్మికుల కొనుగోలు శక్తిని గణనీయంగా తగ్గించి వేస్తున్నాయి. వారికి అప్పులిచ్చి ఆర్థిక వ్యవస్థను చురుకుగా నడిపే శక్తి, అవకాశాలు ప్రపంచ దేశాలకు లేవు.”



పడిపోతున్న స్టాక్ ఇండెక్స్‌లను చూస్తున్న మదుపుదారులు

కానీ అనేక పశ్చిమ దేశాల మీడియా కామెంటరీలు దీనికి భిన్నంగా ఉన్నాయి. చైనా స్టాక్ మార్కెట్ పతనాన్ని ఉపయోగించుకుని వారు తమ తమ మనసుల్లోని కోరికలన్నిటినీ బయటపెట్టేశారు. వాటిలో మొదటిది, ఈ సంక్షోభం తట్టుకోలేక చైనా సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలిపోతుంది. రెండు చైనాలో మాంద్యం, స్టాక్ మార్కెట్ల పతనం వల్ల ఏర్పడిన అసంతృప్తి వల్ల పార్టీ నాయకత్వానికి ముప్పుగా పరిణమిస్తుంది. అలా జరక్కుండా ఉండాలంటే చైనా సంపూర్ణ రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు సిద్ధం కావాలి. ఒక రకంగా చెప్పాలంటే చైనా కూలిపోవాలనేది వారి కోరిక. కానీ అసలు విషయం ఏమంటే ఈ నాడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చైనా ఒక ఇంజన్‌లా పనిచేస్తోంది. భారత్‌గానీ, మరో దేశం గానీ దాని స్థానాన్ని ఆక్రమిస్తాయని భావించిన వారి ఆశలు ఆవిరులైనాయి. అందుకని ఆ ఇంజనే దెబ్బ తింటే మొత్తంప్రపంచ ఆర్థికవ్యవస్థ నడక ఆగిపోతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో ఈ సంక్షోభం యుద్ధంతో మాత్రమే పరిష్కారం అవుతుంది. ఎందుకంటే కుదించుకుపోతున్న మార్కెట్ల కోసం ఇప్పుడు ప్రారంభమైన పోటీలు, కరెన్సీ యుద్ధాలకు ఈ వ్యవస్థలో భరత వాక్యం పలికేది యుద్ధమే. ఒకదానితో ఒకటి పెనవేసుకు పోయిన నేటి గ్లోబలీకరణ ప్రపంచంలో వ్యవస్థీకృతంగా వచ్చిన సంక్షోభం వ్యవస్థ మార్పుతో మాత్రమే అంతమవుతుంది.

# కార్మిక సమస్యలు - యజమానుల కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

**- టి.కె. రాజలక్ష్మి**

ఒక సంవత్సరకాలం ఆలస్యంగా జరిగిన 46వ జాతీయ లేబర్ కాన్ఫరెన్స్ అసలు విషయం జోలికి పోకుండా, భాషా చాతుర్యంతో, కనికట్టు పదాల ఉపన్యాసాలతో కొనసాగింది. గత జాతీయ సదస్సులు సూచించిన వాటిని కూడా ఇంతవరకు అమలు జరపని నేపథ్యంలో ఈ 46 జాతీయ లేబర్ కాన్ఫరెన్స్ జరిగింది.

ప్రధాని నరేంద్రమోడీ చేత ప్రారంభించ బడిన రెండురోజుల 46వ జాతీయ కార్మిక సదస్సు, కార్మికసంఘాలన్నింటినీ తీవ్రంగా నిరాశపరిచింది. కార్మికసంఘాలకు ఉన్న అపోహలను తొలగించటానికి, ఆందోళనలకు ఈ సదస్సు పరిష్కారం చూపుతుందని అందరూ భావించారు. కాని, అటువంటిదేమీ జరగక పోగా, సూక్తులు, సామెతలు, నీతులు బోధించ టంతో సాగిపోయింది. జాతీయ కార్మిక సదస్సు జరపటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహణాతీరు, ముందస్తు సంప్రదింపులు, సలహాలన్నింటితోనూ తీవ్రమైన లోపాలు ఉ ండటంతోపాటు, ప్రధాని ప్రసంగించిన తీరుతెన్నులు పరిశీలిస్తే, రానున్న రోజులలో ద్వైపాక్షిక ఒప్పందాలు ఉండబోవని, ప్రభుత్వం ఇకనుండి తృతీయపార్టీగా ఎటువంటి పాత్ర పోషించబోదని, తద్వారా త్రైపాక్షిక ఒప్పందాల అమలు బాధ్యత నుండి వైదొలగుతుందని స్పష్టంగా అర్థమయింది. అంతేకాదు, ఇకముందు ద్వైపాక్షిక చర్చలే ప్రధానమని, ఆ బాధ్యత యాజమాన్య ప్రతినిధులు, కార్మికవర్గ ప్రతినిధులు చూసుకోవాలని తేల్చిచెప్పింది.

వాస్తవానికి ఈ 46వ కార్మిక సదస్సు గత ఏడాదే జరగాల్సి ఉంది. కానీ, ఎవరికీ అంతుచిక్కని కారణాలతో అది వాయిదాపడింది. రాజస్థాన్‌లోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం సదస్సు సూచనలతో ప్రమేయం లేకుండానే అక్కడ కార్మిక చట్టాలలో తీవ్రమైన మార్పులు చేసింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా కార్మిక చట్టాలలో సవరణలు తేవాలని ప్రయత్నించింది. కార్మికసంఘాల వ్యతిరేకత ఎలా ఉన్నా, పార్లమెంట్‌లో కొన్ని సవరణలను ప్రతిపాదించి ఆమోదింప చేసుకుంది. అన్ని జాతీయ కార్మికసంఘాలు, అటు రాజస్థాన్‌లో, ఇటు కేంద్రంలో జరిగిన సవరణలను ఉమ్మడిగా, గట్టిగా వ్యతిరేకించాయి. అయినా కేంద్రం ఇంతవరకు వారి నిరసనలను పట్టించుకున్న పాపాన పోలేదు.

రానున్న కొద్ది నెలల కాలంలో కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, హడావిడిగా ఈ సమావేశం ఏర్పాటు చేసి, భాషా చాతుర్యంతో కార్మికసంఘాలను తప్పుదోవ పట్టించడానికే ఈ ప్రయత్నం జరిగిందని కొంతమందికి సందేహం కలిగింది. అదే సందర్భంలో పారిశ్రామికవేత్తలకు తప్పుడు సంకేతాలు పోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, కార్మికసంఘాలతో మాటామంతీ కలిపే ప్రయత్నం చేసిందనేది సుస్పష్టం. ఈ సదస్సు జరిగే కొన్ని వారాల ముందే కేంద్ర ప్రభుత్వం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నాయకత్వంలో ఒక మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సరిగ్గా సదస్సు జరిగే ముందు కార్మికసంఘాలతో సమావేశమైంది. భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఏర్జేష్ ఉపాధ్యాయ ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ, మేము ఇప్పటికే అన్ని విషయాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాము. కొత్తగా చెప్పేదేమీ లేదు. ఆర్థికశాఖామంత్రిగారు ఏమి చెబుతారో అని వెళ్ళాము. ఆయన ఆసక్తికరంగానే స్పందించారు అని తెలిపారు.

కాని జాతీయ కార్మిక సదస్సు జరగటానికి రెండురోజుల ముందే ప్రధానితో భేటీ అయిన కార్మికసంఘాల నాయకుల సమావేశం దీనికన్నా ప్రాధాన్యత సంతరించుకుంది. దానినే "ఛాయ్ పే చర్చా" లేదా "టీ త్రాగుతూ సంభాషణ" అని ఒక ట్రేడ్ యూనియన్ నాయకుడన్నారు. ఇది అనూహ్యమైన పరిణామం. వాస్తవానికి కార్మికసంఘాల నాయకులందరూ ఖచ్చితంగా సంఘటిత, అసంఘటిత కార్మికవర్గానికి సంబంధించిన అంశాలపై ప్రధానమంత్రి ఏదో ఒక సానుకూల వార్త అందిస్తారని ఆశించారు. ఆ తర్వాత జరిగిన సదస్సులోనూ అటువంటిదేమీ జరగలేదు.

నిజానికి, జాతీయ కార్మిక సదస్సు త్వరలో జరగబోతుందన్న సంగతి, కార్మికసంఘాల నాయకులకి అంతర్జాతీయ లేబర్ కాన్ఫరెన్స్‌లో (జూన్ చివరిలో) తెలిసింది. అది కూడా కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ అనధికారికంగా, అనుకోకుండా చేసిన పొరపాటు వ్యాఖ్యల వల్ల, ప్రధాని కార్మిక సదస్సుకి తేదీని అంగీకరించారని తెలిసింది. ఇంత జరిగినా సదస్సు యొక్క అధికారిక సమాచారం మటుకు కార్మికసంఘాలకు జులై 10వ తేదీన మాత్రమే తెలిసింది. జాతీయ కార్మిక సదస్సు నిర్వహణను, ఎజెండాను చూసే "స్టాండింగ్ లేబర్ కమిటీ" ఈ సమాచారం అందించింది. కేవలం పదిరోజుల ముందు సమాచారం ఇవ్వటం వలన కార్మికసంఘాలకు తాము విన్నవించుకోవలసిన, చర్చకు పెట్టాలనుకున్న అంశాలపై నోట్‌ను తయారుచేసి అందరికీ పంపిణీ చేయటానికి సరిపడా సమయం దొరకలేదు. సాధారణంగా యజమానుల నుండి, కార్మికవర్గ ప్రతినిధుల నుండి విధాన పత్రాలు అందిన తర్వాతే ఎజెండా తయారు చేయబడుతుంది. ఈసారి అలా జరగలేదు. కేవలం మేము కూడా ఏదో చేస్తున్నామని అనేటట్టుగా ప్రభుత్వం ఈ సమావేశం ఏర్పాటు చేసింది. 2014 జనవరిలో స్టాండింగ్ లేబర్ కమిటీ ఏ ఎజెండా తయారు చేసిందో, అదే

ఎజెండాని యధాతథంగా ప్రవేశపెట్టారని సి.ఐ.టి.యు. జాతీయ కార్యదర్శి కె. హేమలత విమర్శించారు. ఆర్థికమంత్రితో, అలాగే ప్రధానమంత్రితో జరిగిన టీ సంభాషణలలో ఆమె కూడా పాల్గొన్నారు. కాని వారిద్దరి దగ్గరనుండి ఎటువంటి కార్మికవర్గ అనుకూల సంకేతాలు, సూచనలు రాలేదని ఆవిడ ఆవేదన వ్యక్తంచేశారు. 45వ జాతీయ కార్మిక సదస్సులో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, మాటవరసకైనా కార్మికుల సమస్యల పట్ల కొంత సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేశారని, కార్మికసంఘాల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని అంగీకరించారని మరి కొంతమంది కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఇప్పటి ప్రధానమంత్రి, తన ఉపన్యాసంలో ఇప్పటి తరం కార్మికులు త్యాగాలు చెయ్యాలని, అలా చేస్తేనే భవిష్యత్తు తరాల కార్మికులు లాభపడ తారని పేర్కొనటం విడ్డూరంగా ఉందని ఒక కార్మిక సంఘం నాయకుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

> **“పారిశ్రామిక సంస్థల యొక్క శ్రేయస్సుకు, పారిశ్రామికవేత్తల యొక్కశ్రేయస్సుకు మధ్య ఉన్న బంధాన్ని కార్మికవర్గ నాయకత్వం అర్థం చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ మాట కేవలం కార్మికులకు, కార్మిక నాయకులకు మధ్య బేధాభిప్రాయాలు పెంచేలా ఉందని వారందరూ భావించారు.”**



కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరిస్తున్న కార్మికసంఘాలు

సదస్సులో ప్రధానమంత్రి ఉపన్యాసం కూడా తనదైన శైలిలో మడిభాషతో, నీతి సూత్రాలతో, ఉత్తేజపూరితంగానే సాగింది. త్రైపాక్షిక కమిటీని ఆయన పొగుడుతూ, అది“శ్రమ సన్సద్” అని, లేదా కార్మికవర్గానికి పార్లమెంటు లాంటిదని సెలవిచ్చారు. 75 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ త్రైపాక్షిక విధానాన్ని ఆయన పొగడ్తలతో ముంచెత్తారు. పారిశ్రామిక వర్గం, ప్రభుత్వం, కార్మికవర్గం (అదే వరుసలో) మధించుతున్న అమృతం వల్లనే దేశం అభివృద్ధి పథంలోకి దూసుకుపోబో తుందని సెలవిచ్చారు. కాని గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల పన్నెండు న్యాయబద్ధమైన డిమాండ్లను గురించి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కార్మికవర్గ ప్రతినిధులకు ఎటువంటి భరోసానివ్వలేదు. ప్రభుత్వం నిరంతరం కార్మికవర్గంతో చర్చలు జరుపుతూనే ఉందని ఆశ్చర్యకరంగా ఆయన ప్రకటించారు. అది పచ్చి అబద్ధం. ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలం తర్వాతే కార్మికసంఘాల నాయకులతో కలిసి జరిపిన మొట్టమొదటి సమావేశమిదే. ఆయన ఉపన్యాసంలో పేర్కొన్న మరొక అంశం కూడా కార్మికసంఘాల నాయకులకు అంతగా మింగుడు పడలేదు. “పారిశ్రామిక సంస్థల యొక్క శ్రేయస్సుకు, పారిశ్రామికవేత్తల యొక్క శ్రేయస్సుకు మధ్య ఉన్న బంధాన్ని కార్మికవర్గ నాయకత్వం అర్థం చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ మాట కేవలం కార్మికులకు, కార్మిక నాయకులకు మధ్య బేధాభిప్రాయాలు పెంచేలా ఉందని వారందరూ భావించారు. కాకతాళీయంగానేమో తెలియదుగానీ, ప్రధానమంత్రి గారు, అలాగే బి.ఎం.ఎస్. జాతీయ అధ్యక్షుడు రాజనాథ్‌రాయ్, ఇద్దరూ 1942 – 1946 మధ్యకాలంలో వైస్రాయ్ ప్రభుత్వంలో కార్మికశాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కనీస వేతనచట్టం తేవటానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. లేబర్ ఇన్‌స్పెక్టర్లను ఏర్పాటు చేసిన మొట్టమొదటి కార్మికశాఖ మంత్రి ఆయన అని రాయ్ పొడిగారు.

చాలామంది కార్మికసంఘాల నాయకులు సమావేశం అయిన తరువాత ప్రధానమంత్రి ఉపన్యాసాన్ని విమర్శించటం స్పష్టంగా కనిపించింది. వాస్తవానికి ఆయన ప్రసంగంలో ఎక్కువభాగం పారిశ్రామికవేత్తల ప్రతినిధులకు బాగా నచ్చింది. ఉపాధి పెరగటానికి ఎప్రెంటిన్ షిప్ విధానం చాలా ఉన్నతమైన పద్ధతి అని ఆయన పేర్కొనటాన్ని కార్మికసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అంతర్జాతీయ అనుభవాలను కూడా ఉదహరిస్తూ ప్రధానమంత్రి చైనాలో రెండు కోట్లమంది, జపాన్‌లో ఒక కోటి మంది, చిన్న దేశమైన జర్మనీలో కూడా 30 లక్షలమంది ఎప్రెంటిస్‌లు ఉన్నారని, కాని భారతదేశంలో కేవలం మూడు లక్షల మందే ఉండటం సరి కాదని తెలిపారు. ఈ దేశాలన్నింటిలోను కార్మిక చట్టాలు కఠినంగా అమలు చేస్తారని, భారత దేశంలో కనీస వేతనాలు కూడా అమలు చేసే పరిస్థితి లేదనే అంశాన్ని ఆయన చెప్పకుండా వదిలేశారు.

కార్మిక సంఘాలు అప్రెంటిస్ చట్టంలో కొన్ని ముఖ్యాంశాలపై తీవ్రంగా అభ్యంతరం తెలిపినప్పటికీ, ఆ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదింపబడింది. పారిశ్రామికవర్గం మటుకు దీనిని స్వాగతించింది. ఈ రకమైన పరిస్థితి ఉంది కాబట్టే గత సంవత్సరకాలంగా త్రైపాక్షిక ఒప్పందాలు, లేదా చర్చల ద్వారా వచ్చే ఏకాభిప్రాయ స్ఫూర్తిని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, అందుకనే ఫ్యాక్టరీల చట్టంలో సవరణలు, అప్రెంటిస్ చట్టంలో సవరణలు లేదా లేబర్ కోడ్ ఏర్పాటు వంటి అంశాలపై కార్మిక సంఘాలు గట్టిగా నిరసన తెలియజేస్తూనే ఉన్నాయి. ఈ సదస్సులో మాట్లాడుతూ బి.ఎం.ఎస్. జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ రాయ్,

**"స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ, జాతీయ అక్షరాస్యత మరియు విద్యాశాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించలేమని తెలిపాయని, అందుకే ప్రభుత్వం ఏమీ చేయలేకపోతుందని సెలవిచ్చారు."**

ప్రభుత్వం తప్పుడు విధానాలు అనుసరి స్తోందని, నేరుగా కార్మికవర్గంపై దాడులు చేస్తోందని, దాని ఫలితం సామాన్య ప్రజానీకం కూడా అనుభవిస్తారని హెచ్చరించారు.

43వ, 44వ, 45వ జాతీయ కార్మిక సదస్సులు చేసిన సూచనలను నిర్లక్ష్యం చేయటమే ప్రభుత్వం చేస్తున్న పెద్ద తప్పు అని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాలను పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా మార్చటం, ఏకపక్షంగా అప్రెంటీస్ చట్టాన్ని మార్చివేయటం, ఎటువంటి అభ్యంతరాలు లేకుండా రాజస్థాన్ ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్చేలా చేయటం సరికాదని చెప్పారు. దీనిని చూసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు (అన్ని బి.జె.పి. పాలిత రాష్ట్రాలే) కూడా అదే బాటలో పయనించాలని నిర్ణయించటం, ఇన్స్పెక్టర్లను తొలగించి, యజమానుల స్వీయ ప్రకటిత సర్టిఫికెట్‌లను ఆమోదించాలని నిర్ణయించటం ఘోర తప్పిదాలని పేర్కొన్నారు.

అంతర్జాతీయ కార్మిక సదస్సు ఒప్పందాలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నారని, జెనీవాలో జరిగిన 104వ సదస్సులో ఈ అంశాన్ని లేవనెత్తానని ఆయన తెలిపారు. అలాగే అంతర్జాతీయ కన్వెన్షన్‌లో ఒప్పందమైన నాలుగు అంశాలను భారత ప్రభుత్వం అంగీకరించ లేదని, అవి కార్మికసంఘాల 12 డిమాండ్ల తీర్మానాన్ని ఆమోదించకపోవడం, కనీస వేతనం పదిహేను వేల రూపాయలను నేటికి అంగీకరించకపోవటం, సామాజిక సంక్షేమ చట్టాలలో కార్మికులకు వ్యతిరేకంగా మార్పులు తేవడం, కార్మిక చట్టాలకు మార్పులు తేవటానికి ఆర్థికమంత్రిత్వ శాఖకు అనుమతివ్వటం అని ఆయన చెప్పారు. రాజస్థాన్ ప్రభుత్వం ఫ్యాక్టరీల చట్టానికి చేసిన సవరణలను కూడా రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

43, 44, 45వ జాతీయ కార్మిక సదస్సులు ఏకాభిప్రాయంతో సూచించిన అంశాలను కూడా నేటికీ ప్రభుత్వం అమలు చేయకపోవటం కార్మికసంఘాల ఆగ్రహానికి కారణమైంది. ఈ సదస్సులో మొదటి ఎజెండా గతంలో సాధించిన ఏకాభిప్రాయ సూచనలు అమలు చేయటం. అవి కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు, స్కీము వర్కర్స్ సమస్యలు మరియు త్రైపాక్షిక చర్చా విధానం. ఇందులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశం స్కీము వర్కర్ల సమస్యలు. దానిపై 45వ సదస్సులో స్కీము వర్కర్లను గౌరవ వేతనంతో పనిచేసే ఉద్యోగులుగా ఉంచకూడ దని, కార్మికులుగా గుర్తించాలని, వారికి అన్ని సామాజిక సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ప్రభుత్వం ప్రకటించిన నూతన బీమా పథకం కూడా వారికి అందించాలని ఏకాభిప్రాయంతో సూచించారు. కాని ప్రభుత్వం ఇచ్చిన కార్యాచరణ నివేదికలో వింతైన, పనికిమాలిన వాదన ఒకటి ముందుకు తెచ్చింది. స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ అక్షరాస్యత మరియు విద్యా శాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించలేమని తెలిపాయని, అందుకే ప్రభుత్వం ఏమీ చేయలేకపోతుందని సెలవిచ్చారు.

వారి తర్కం ఏమిటంటే, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు గౌరవ వేతనంతో నియమింపబడ్డారని, వారి పని సామర్థ్యాన్ని బట్టి ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయని, అలాగే మధ్యాహ్న భోజన కార్మికులను కేవలం కొన్ని గంటల పాటు పని చేయటానికి (భోజనం తయారీ మరియు వడ్డన) మాత్రమే తీసుకున్నాం కాబట్టి, జాతీయ కార్మిక సదస్సు సూచనలను తాము అంగీకరించలేమని ప్రకటించాయి. అన్నిటికన్నా బాధాకరమైన అంశమేమిటంటే సాక్షాత్తూ ప్రభుత్వమే వీరిని గౌరవ వేతన శ్రామికులుగా వర్గీకరణ చేయటం. నిజంగా ప్రభుత్వం తలచుకుంటే స్కీము వర్కర్లను గౌరవ వేతన శ్రామికులుగా కాక నేరుగా కార్మికులుగా తీసుకునే విధానాన్ని ఎంచుకోవచ్చు. ఎందుకంటే వీరంతా ఈ దేశ భవిష్యత్తుని నిర్దేశించే పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్యారంగాల్లో పని చేస్తున్నారు. కాని ప్రభుత్వం వీరిపట్ల ద్వేష భావంతో ఉంది. "త్రైపాక్షిక చర్చల ద్వారా వచ్చిన సారాంశం, ఏకాభిప్రాయాన్ని అమలు చేయకపోతే, ఇక ఈ త్రైపాక్షిక చర్చలే దండగ" అని సిఐటియు కార్యదర్శి డా॥ హేమలత అన్నారు.

### కనీస వేతనాల సమస్య

1957లో జరిగిన 15వ జాతీయ కార్మిక సదస్సు కనీస వేతనాలు నిర్ణయించటానికి కావలసిన సూత్రాలను ప్రతిపాదించింది. దానిని 44వ జాతీయ కార్మిక సదస్సు ఆమోదించింది. కాని ప్రభుత్వం ఈ ఫార్ములాని అంగీకరించ కుండా అట్టడుగు స్థాయి కార్మికుడి కనీస వేతనం రూ. 160గా నిర్ణయించింది. ఇది కార్మిక సంఘాల కనీస డిమాండు అయిన రూ. 15,000 కన్నా చాలా తక్కువ. ఇది వారి డిమాండులో మూడోవంతు కూడా లేదు. వాస్తవానికి, 15వ జాతీయ కార్మిక సదస్సు సూచించిన కనీస వేతనం సూత్రం ప్రకారం ఈ రోజున్న ధరలు, ద్రవ్యోల్బణం గమనంలో తీసుకుంటే కనీస వేతనం రూ. 20,000 ఉండాలి. అటువంటిది రూ. 160 అనేది దగా అని కార్మిక నేతలు మండిపడ్డారు. అందుకనే ఈ మొత్తం తంతు చూసిన కార్మిక సంఘాలు న్యాయబద్ధంగానే తమ నిరసనను తెలిపాయి. అందువలనే ఈ రెండురోజుల సదస్సు ముగిసేముందు, 43, 44, 45వ సదస్సుల సూచనల అమలు కమిటీ ఇలా పేర్కొంది. "కాంట్రాక్టు కార్మికులు, స్కీము వర్కర్లు, కనీస వేతనాలు మరియు త్రైపాక్షిక విధానంపై సూచనలను ప్రభుత్వం అమలు చేయడం లేదు. ఇవి అమలు జరిగేటట్లు ప్రభుత్వం స్పష్టమైన నిర్దిష్టమైన పద్ధతులను రూపొందించాలని, స్ఫూర్తితోను, నిజాయితీతోను వ్యవహరించాలని అవసరమైనప్పుడల్లా సమీక్షలు నిర్వహించాలని బలంగా కోరుతున్నాము."

పేమెంట్ ఆఫ్ బోనస్ యాక్ట్‌పై ఈ సదస్సులో ఎటువంటి ఏకాభిప్రాయం కుదరలేదు. కార్మికసంఘాలన్నీ ఈ చట్టంలో ఉన్న కనీస అర్హత సీలింగ్, లెక్కకట్టే విధానంలో ఉన్న సీలింగ్, అత్యధికంగా ఇచ్చే బోనస్ సీలింగ్ తదితరాలన్నింటినీ తొలగించాలని డిమాండ్ చేయగా, యాజమాన్య ప్రతినిధులు వాటిని నిర్ద్వంద్వంగా

(మిగతా 35వ పేజీలో)

మతోన్మాదం

# హిందూత్వ వాదుల దాడులకు మేం లొంగం

- అనుపమ కటకం


రచయిత రాజకీయ విశ్లేషకురాలు

***2002 గుజరాత్ మారణకాండకు బాధ్యులైన 120 మందికి శిక్షలు పడేలాచేసి, న్యాయం కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న తీస్తా సెతల్వాద్‌తో 'ఫ్రంట్‌లైన్' కోసం అనుపమ కటకం చేసిన ఇంటర్వ్యూను పాఠకులకు అందిస్తున్నాం.***

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తి తీస్తా సెతల్వాద్. జ్వలించే కార్యకర్తగా, న్యాయవాదిగా 2002 గుజరాత్ అల్లర్ల బాధితులకు న్యాయమందించడం కోసం నిర్విరామంగా కృషిచేస్తున్న తీస్తా సెతల్వాద్ ఇటీవలి నెలలలో తీవ్రమైన కక్షసాధింపుకు, ప్రభుత్వ వేటకు గురౌతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రధాన నిందితుడిగా ఉన్న "జకియా జాఫ్రి కేసు"కు సంబంధించిన వాదనలు గుజరాత్ హైకోర్టులో తుదిస్థాయికి చేరటంతో తనపై దాడులు ఉధృతమౌతున్నాయని తీస్తా సెతల్వాద్ విశ్వసిస్తున్నారు. ఇటీవలి కాలంలో సంభవించిన భయంకరమైన మతహింసలో తనపై పడ్డ మచ్చను తుడిచేసుకొని ప్రధానమంత్రి అయినప్పటికీ, 2002 మత మారణకాండలో ఆయన భాగస్వామ్యాన్ని కనుమరుగు కాకుండా చేయటంలో తీస్తా సెతల్వాద్ నిర్వహిస్తున్న పాత్ర నరేంద్రమోడీకి కంటగింపుగానే ఉంది. తనను హింసించటం ద్వారా మత ఘర్షణల కేసుల్ని నీరుకార్చడానికి బాహాటంగా ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపిస్తున్నారు.

మత సామరస్యం కోసం కృషి చేస్తున్న ఒక ప్రభుత్వేతర సంస్థ అయిన 'సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సిజెపి)"ను ఆమె, ఆమె భర్త జావేద్ ఆనంద్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఆ దంపతులపైన గుజరాత్ పోలీస్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)లు అనేక అభియోగాల్ని మోపాయి.

ఇతర అంశాలతో పాటు మత ఘర్షణల సాక్ష్యులను ట్యూటర్ చేస్తున్నారని, గుల్బర్గ్ సొసైటీ బాధితుల కోసం సేకరించిన నిధుల్ని దుర్వినియోగం చేస్తున్నారని, విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలు వారిపై బనాయింపబడ్డాయి.

జులై నెల తొలిరోజుల్లో నిధుల దుర్వినియోగం కేసులో సిబిఐ ఆమె ఇంటిని, ఆఫీసును సోదా చేసింది. ఫిబ్రవరి నెలలో ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఆమె, ఆమె భర్త ఆనంద్‌ను అరెస్టు చేయటానికి ప్రయత్నించారు. ఆమె ముంబై హైకోర్టు నుండి ముందస్తు బెయిలు పొందింది. ఇది సుదీర్ఘమైన, కష్టతరమైన పోరాటమని ఆమెకు తెలుసు. మోడీ ప్రధాన మంత్రి హోదాలో కేంద్ర ఏజెన్సీల సహకారంతో తనను బాధించగలడని ఆమె అంటుంది.

మత ఘర్షణలు జరిగిన 13 సంవత్సరాల నుండి తీస్తా సెతల్వాద్, ఆనంద్ కలిసి 68 కేసుల్లో పోరాడి 120 మందికి శిక్షలు పడేటట్లు కృషి చేశారు. ఆమె ఎదుర్కొంటున్న నిర్బంధం పెరగటంతోపాటు, ఆమెకు వివిధ వర్గాల నుండి మద్దతు వెల్లువెత్తుతున్నది. న్యాయం కోసం నినదిస్తూ చేసే ఏ నిరసనైనా, పోరాటమైనా జాతి వ్యతిరేకంగా పరిగణింపబడుతున్న ఈ రోజుల్లో పౌర బృందాలు, కార్యకర్తలు, రాజకీయ నాయకులు, మాజీ బ్యూరోక్రాట్లు ఆమె తరఫున బహిరంగంగా మాట్లాడుతున్నారు.

ఎన్ని ఇబ్బందులెదురైనా తన బాటను విడనాడేది లేదని ఆమె వ్యక్తం చేసిన కృతనిశ్చయాన్ని ఆమె మాటలలోనే చూద్దాం.

**జనవరి 2014లో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) దాఖలు చేసినప్పటి నుండి మీరు నిరంతరం అరెస్టు, బెదిరింపులను ఎదుర్కొన్నారు. మీ అకౌంట్స్ స్తంభింపచేశారు. మిమ్మల్ని లక్ష్యంగా చేసుకోవటంలో ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటి?**

గుల్బర్గ్ సొసైటీ ఊచకోతలో బ్రతికి బైటపడ్డవారు తమ వ్యక్తిగత ఆస్తుల్ని సముచిత ధరకు అమ్ముకోలేని కారణంగా 2007-08లో గుల్బర్గ్ సొసైటీలో ఒక మెమోరియల్ నిర్మాణం కోసం నిధుల్ని సమీకరించటానికి ప్రయత్నించాలని సమిష్టిగా నిర్ణయింపబడింది. సబ్రంగ్ ట్రస్ట్-సిజెపికి చెందిన మేము రూ. 4.6 లక్షల నిధుల్ని సమీకరించాం. 2012లో సొసైటీ సభ్యులకు ప్రాజెక్టు సాధ్యంకాదని చెప్పాల్సి వచ్చింది. ఏ విధమైన ఒప్పందంపై సంతకాలు చేయబడలేదు. ఏ రకమైన ఆస్తి లేదా దస్తావేజుల చేతులు మారలేదు. ఏ రకమైన కిరాయి కుదర్చబడలేదు. డబ్బులు చేతులు మారలేదు. భారతదేశ సంతతికి చెందిన ఒకరితో సహా, భారతీయులందరూ కలిసి రూ.4.6 లక్షల విరాళాలు అందజేశారు. ఆ సొమ్ము ఇంకా వినియోగింపబడకుండా అట్లానే ఉంది.

2013జనవరిలో మొట్టమొదటగా ఫిర్యాదు చేయబడింది. 2014 జనవరిలో ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయబడింది. ఆ తర్వాత ఒకటిన్నర సంవత్సరమైనా ఇంతవరకు చార్జిషీట్ దాఖలు చేయలేదు. మా దృష్టిలో ప్రథమ సమాచార నివేదిక ద్వేషపూరితంగా ప్రేరేపింపబడింది. దీన్ని ఫిరోజ్ సయీద్ ఖాన్‌చే దాఖలు చేయించారు. ఫిరోజ్ సయిద్ ఖాన్ గుల్బర్గ్ కేసులో ప్రత్యక్ష సాక్షి సోదరుడు , సొసైటీ నివాసి. కానీ ఊచకోత జరిగిన సందర్భంలో సంఘటన స్థలంలో ఆయన లేడు. సి.జె.పి. మాజీ ఉద్యోగిని అధికార వర్గాలు

**❝ గుజరాత్ ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని పెంచుతూ పనికట్టుకొని మమ్మల్ని అపఖ్యాతి పాల్జేస్తున్నది. క్రైమ్ బ్రాంచ్ పరిశోధనాధికారి 2015 ఫిబ్రవరిలో మా ఇంటిముందు ప్రదర్శించిన పూర్తిస్థాయి తమాషా ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది. క్రైమ్ బ్రాంచ్ తన అఫిడవిట్‌లో పేర్కొన్న వాదనలకు వేటికీ డాక్యుమెంటరీ బుజువులు లేవు. ❞**

ప్రణాళికాబద్ధంగా వినియోగించుకొన్నారు. ఆయన నాపై ఐదు కేసులు బనాయించారు. ఆయన క్రైమ్ బ్రాంచ్ సాక్షి కూడ.

గుజరాత్ ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని పెంచుతూ పనికట్టుకొని మమ్మల్ని అపఖ్యాతి పాల్జేస్తున్నది. క్రైమ్ బ్రాంచ్ పరిశోధనాధికారి 2015 ఫిబ్రవరిలో మా ఇంటిముందు ప్రదర్శించిన పూర్తిస్థాయి తమాషా ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది. క్రైమ్ బ్రాంచ్ తన అఫిడవిట్‌లో పేర్కొన్న వాదనలకు వేటికీ డాక్యుమెంటరీ బుజువులు లేవు. ఇంతవరకు ఏ విధమైన అభియోగ పత్రం (ఛార్జిషీట్) దాఖలు చేయబడలేదు. ట్రస్ట్ నిధులు కాకుండా మా డబ్బును మేమెలా ఖర్చు పెడుతున్నామో తెలుసుకొని, మాపై అసభ్యకర ప్రచారానికి పూపుకొని, మా వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవాలనుకునే కుటిల యత్నమిది. తీవ్రవాద వ్యతిరేక స్క్వాడ్ ముఖ్య నేత హేమంత్ కర్కరేను ఇదే విధంగా హింసించి, 2008 నవంబరు 28న భయంకరంగా చంపేశారు.

మమ్మల్ని న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి, భారత రాజ్యాంగాన్ని సమున్నతంగా నిలబెడుతూ, ప్రభుత్వం యొక్క సైద్ధాంతిక చట్రాన్ని సవాలు చేస్తున్న మా ప్రయత్నాలను విరమించుకునేలా చేయటమే వాళ్ళ ఉద్దేశ్యంగా ఉంది.

**సి.బి.ఐ. మిమ్మల్ని 2013 జనవరి నుండి విచారిస్తూనే ఉంది. ఇటీవల వారు మిమ్మల్ని "జాతికే ముప్పు"గా అభివర్ణిస్తున్నారు?**

మత సామరస్యం, శాంతికోసం కృషిచేసే వారంతా "జాతికి ముప్పు" కల్గించేవారనుకుంటే మేమూ అటువంటి వారమే. మా పోరాటం, ఆరాటమంతా బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని నిలబెట్టడమే. మన రాజ్యాంగ మౌలిక విలువల్ని నిలబెట్టడం కోసమే మేము కృషి చేస్తున్నాం. జాతి మమ్మల్ని ముప్పు కలిగించే వారిగా చూడటం లేదు. వారసత్వంగా రాజ్యాంగ వ్యతిరేక ప్రాపంచిక దృక్పథం కల్గిన ఆర్.ఎస్.ఎస్. సారథ్యంలోని పాలకులకు మాత్రం మేము ముప్పుగా కనబడుతున్నాం. విచ్ఛిన్నకర, ద్వేష రాజకీయాలను విశ్వసిస్తున్న వారికి మేము ముప్పుగానే ఉన్నాం. ఈ శక్తులెన్నడూ స్వాతంత్ర్యం కోసం పోరాడలేదు. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఉన్నతమైన నిబద్ధతా నియమాలతో వారికి సంబంధం లేదు.

**మీపై మోపబడ్డ అభియోగాలేమిటి? మీరు ప్రతి అంశంలోనూ సహకరించామని చెప్తున్నారు. కాని వాళ్ళు దాడిచేసి మీ ఇంటిని/ఆఫీస్‌ను సోదా చేశారు. న్యాయపరమైన దృక్కోణంలో ఆలోచిస్తే, ఇవన్నీ చేయటానికి వారికి అధికారం ఉందా?**

దాడులు, సోదాలతో వారు న్యాయ ప్రక్రియను అతిక్రమించారు. సోదా వారంట్‌ను పొందటంలో పోలీసులు అనుసరించిన పద్ధతుల్ని మేము దాన్ని జారీచేసిన మేజిస్ట్రేట్ ముందు సవాలు చేశాము. (సోదాలు జరిపిన 2 రోజుల తర్వాత జులై 17న వారంట్ జారీచేశారు) మిమ్మల్ని తప్పుదోవ పట్టించారని మేజిస్ట్రేట్‌కు చెప్పాము. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 192–193కు అనుగుణంగా సి.బి.ఐ. ఎటువంటి చర్యలు అమలు చేయలేదు. రాజ్యాంగ హక్కుల పూర్తి ఉల్లంఘన జరిగిందని మేము నమ్ముతున్నాం. మా అభ్యర్ధనపై ఒక నోటీస్ ఇవ్వబడింది. ఆగస్టులో దానిపై విచారణ జరుగుతుంది. మా మీద అనేక అభియోగాలు మోపబడ్డాయి. వాటన్నింటినీ ఖండిస్తూ సమాధానాలిచ్చాం. సాధ్యమైనంత వరకు సహకరిస్తూనే ఉన్నాం. దాదాపు 24,000 పేజీల పత్రాల్ని మేము సి.బి.ఐ.కి అందించాం.

సంస్థాపక పత్రాలను బట్టి సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్, "సబ్రంగ్ ట్రస్ట్"ల ఆశయాలు ఆదర్శాలు విశాల ప్రాతిపదికన విస్తృతమైన కార్యకలాపాలు నిర్వహించగలిగేటట్లుగా ఉన్నాయి. అయినప్పటికీ 2002లో సి.జె.పి. స్థాపన నుండి సామూహిక నేరాలకు బలైన బాధితులకు న్యాయ సహాయం అందించడం దాని ముఖ్య కర్తవ్యంగా ఉంది. స్కూళ్ళలో ఖోజ్ (బహుళ జన భారతానికి విద్యనందించే వేదిక) కార్యకలాపాలకు, ఘర్షణల నివారణ మరియు శాంతిస్థాపనలపై సబ్రంగ్ ట్రస్ట్ ప్రధానంగా కేంద్రీకరిస్తున్నది. గుల్బర్గ్ మెమోరియల్ విషయంలో నేను ఇంతకు ముందు చెప్పినట్లు నిధులు వసూలు చేయబడ్డాయి. కాని కేవలం రూ.4.6 లక్షలు మాత్రం వసూలైనందున ప్రాజెక్ట్ సాధన సాధ్యంకాదని సొసైటీ సభ్యులకు తెలియజేశాం. ఆ డబ్బు కదలించకుండా అట్లానే ఉంది. న్యాయ సహాయానికి నిధులు వసూలు చేయటం, కార్యక్రమాలు నిర్వహించటానికి సంబంధించి, గుజరాత్ మారణహోమం బాధితులకు న్యాయ సహాయం అందించటం కోసం సి.జె.పి. భారతదేశంలోనే అపూర్వమైన పాత్రను నిర్వహించింది. పాలనా వ్యవస్థ శతృపూరితంగా ఉన్నప్పటికీ, విచారణ సందర్భంగా బాధితులకు రక్షణను, స్థైర్యాన్ని కల్పిస్తూ 120 మంది నిందితులకు శిక్షలు పడేటట్లు చేయటం ప్రధానమైంది.

నాకు, జావేద్ ఆనంద్‌కు చెల్లించిన డబ్బుకు సంబంధించిన లావాదేవీలన్నీ 'ఫోర్డ్ ఫౌండేషన్', 'ఐక్యరాజ్యసమితి హింసా బాధితుల ఐచ్ఛిక నిధి'ల బడ్జెట్ ప్రతిపాదనలకు, అంగీకారాలకు ఖచ్చితంగా లోబడే ఉన్నాయి. సి.జె.పి., సబ్రంగ్ ట్రస్ట్ తిరిగి చెల్లించిన మా వంతు ఖర్చులు ఆ ట్రస్టీలు వివిధ సందర్భాలలో ఆమోదించిన తీర్మానాలకు అనుగుణంగా ఉన్నాయి. జావేద్, నేనూ ఆ సమయాల్లోనే తీసుకొన్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నాము. మాకు చెల్లించిన పరిహారాల నుండి మాకు మేము ఖర్చు చేసుకుంటున్నామన్న ఆరోపణ వ్యాఖ్యానించటానికే తగనిది.

సబ్రంగ్ ట్రస్ట్ కళాఖండాల వేలం ద్వారా సమీకరించిన నిధులు ప్రారంభంలో చెప్పిన విధంగా మౌలిక కార్యక్రమాలు నిర్వహించటానికి ఉద్దేశింపబడ్డాయి. ఇందుకోసం వసూలు చేసిన నిధుల్ని బాధితులకు ఆర్థిక సహాయం కోసం వినియోగిస్తామని ఎన్నడూ చెప్పి ఉండలేదు. మేము చేస్తున్న కృషిపై అత్యంత గౌరవం ఉన్నందున సుప్రసిద్ధ కళాకారులందరూ ఈ ప్రయత్నాలకు ఉదారంగా మద్దతునిచ్చారు.

సి.జె.పి. నిర్వహించిన న్యాయ సహాయ కృషికి లెక్కలు లేవన్న ఆరోపణను పరిశీలిస్తే, సి.జె.పి. నిర్వహించిన న్యాయ సహాయ కృషి, అపూర్వరీతిలో సాధించిన విజయాలు గుజరాత్ పోలీసులకు తప్ప దేశంలోనూ విదేశాలలోని

ప్రతి ఒక్కరికీ తెలుసు. సి.జె.పి. వార్షిక ఖర్చులో 80–90 శాతం ఖర్చులు న్యాయ సహాయానికి, గుజరాత్‌లో సి.జె.పి. క్షేత్రస్థాయి ఆఫీస్ కార్యకలాపాలకు సంబంధించి ఉన్నట్లు ఇన్ కమ్ ట్యాక్స్, ఛారిటీ కమీషనర్, హోమ్ మంత్రిత్వశాఖల అధికారులకు సమర్పించిన ఆడిట్ చేసిన సి.జె.పి. వార్షిక అకౌంట్స్ తెలియజేస్తున్నాయి.

**నిధుల సమీకరణ, ఫోర్డ్ ఫౌండేషన్‌తో మీకున్న సంబంధాలను గురించి వివరించగలరా?**

స్పష్టంగా నిర్వచించుకున్న కార్యకలాపాల పొందిక ద్వారా కుల, మతతత్వాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సబ్రంగ్ కమ్యూనికేషన్స్, "కమ్యూనలిజం కంబాట్" అనే మాసపత్రిక ప్రచురణకు 2004, 2006లలో ఫోర్డ్ ఫౌండేషన్‌తో కన్సల్టెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కమ్యూనలిజం కంబాట్ పత్రికతో కాని, సంపాదక/ యాజమాన్య బాధ్యతల నిర్వహణకు జావేద్ ఆనంద్‌కు, తీస్తా సెతల్వాద్‌కు చెల్లించే పరిహారాలతో ఈ ఒప్పందానికి ఎటువంటి సంబంధం లేదు. న్యాయ నిపుణుల సలహా పొందిన తర్వాతే సబ్రంగ్ కమ్యూనికేషన్స్ కన్సల్టెన్సీ ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందం విదేశీ విరాళాల చట్టం సెక్షన్ 4 నుండి మినహాయింపబడటం వల్ల, దీని క్రింద స్వీకరించే కన్సల్టెన్సీ ఫీజు విరాళం క్రింద గాని, గ్రాంటు క్రింద గాని పరిగణింపబడకపోవడం వలన చట్ట ఉల్లంఘన క్రిందకు రాదు.

**ఈ పరిణామాలు మీ సంస్థకు, మీ కృషికి ఎలాంటి నష్టాన్ని కలిగించాయి?**

కొనసాగుతున్న ఒత్తిడితో పాటు ఈ పరిణామాలు మా విరాళాల దాతలను భయ భ్రాంతుల్ని చేశాయి. అయినప్పటికీ మా మద్దతుదారులు పెరిగారు. పాలకవర్గం బహిరంగంగా మమ్మల్ని ఆహ్వానింపతగని వారుగా వర్గీకరిస్తూ సందేశాన్ని పంపింది. దాన్ని చాలామంది మౌనంగా స్వీకరించి, మాకు దూరంగా ఉంటున్నారు. దానర్థం వాళ్ళు మమ్మల్ని ఏ మాత్రం నమ్మడం లేదని కాదు. వాళ్ళని వాళ్ళు రక్షించుకుంటున్నారు.

**లక్ష్యం చేయబడింది మీరు, జావేద్. మీ సంస్థే కాదు... గ్రీన్ పీస్, అణు వ్యతిరేక కార్యకర్తలు, మానవ హక్కుల కార్యకర్తలు కూడా పాలకవర్గ దాడులకు గురౌతున్నారు?**

అది వాస్తవం. ఇతరులపై కంటే మాపై దాడులు తీవ్రమైనవైనా, ప్రజాతంత్ర నిరసనను అణచివేయాలనే విస్తృత ధోరణిలో అదొక

> **"1983 నెల్లి ఊచకోతలో గాని, 1984 సిక్కుల మారణహోమంలోగాని, 1992-93 బొంబాయి హింసలోగాని మనం న్యాయాన్ని చూడగలిగామా? పటేల్ తెగకు సంబంధించిన కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులతో సహా 120 మందిని శిక్షింప గలిగిన మా ప్రయత్నం చారిత్రాత్మకమైనది."**


కమ్యూనలిజం కంబాట్ సంస్థ నాయకులు తీస్తాసెతల్వాద్, జావేద్ ఆనంద్

భాగంగా ఉంది. మతోన్మాదానికి, ద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న వారిని ఒక ప్రక్క లక్ష్యంగా చేసుకుంటున్నారు. మరో పక్క ఫాసిస్ట్ తరహా అభివృద్ధి నమూనాను, ప్రజా వనరులను అయినవారికి కట్టబెట్టే ధోరణులను ఎదుర్కొనే వారిని అమానుషంగా మట్టుబెడుతున్నారు. ఈ ఆగడాల్ని తీవ్రంగా ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైంది.

**సి.బి.ఐ. చర్యలు న్యాయ సాధనకు అవరోధంగా ఉన్నాయని మీరు మీడియా సమావేశంలో చెప్పారు. వివరించగలరా?**

మేము చట్టానికి అతీతులమని అనుకోము. కానీ సక్రమమైన న్యాయ ప్రక్రియ కోసం ఒత్తిడి చేస్తాం. దుర్బుద్ధితో, దురుద్దేశ్యకరమైన దర్యాప్తులను ప్రశ్నించే హక్కును ఉంచుకుంటూ మేము ఎప్పుడూ సహకరిస్తూనే ఉన్నాము. గుజరాత్ క్రైమ్ బ్రాంచ్ దాఖలు చేసిన ప్రథమ సమాచార నివేదికలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డామని ఆరోపించారు. లిఖితపూర్వకమైన సాక్ష్యాలను పరిశీలించి సి.బి.ఐ.చే దర్యాప్తు చేయించుకోవచ్చు. అటువంటప్పుడు పోలీస్ కస్టడీలోనే మమ్మల్ని విచారించాలని వారు కోరటంలో అర్థమేమిటి?

మేము ఏ చట్టాలను ఉల్లంఘించలేదు. మేమిక్కడ సహకరించేందుకు ఉన్నాము. మొట్టమొదట గుజరాత్ అధికారులు, ఇప్పుడు కేంద్రం, హోం మంత్రిత్వశాఖ, సి.బి.ఐ.ల త్రయం మా వ్యక్తిగత స్వేచ్ఛలను పరిరక్షించుకోవాల్సిన స్థితిలో మమ్మల్ని ఉంచుతున్నాయి. గత 20 నెలలు ఈ విధంగానే గడిచిపోయాయి. నేరస్తులకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన 'క్లీన్‌చిట్'ను సవాలు చేసినందువల్ల, మేజిస్ట్రేట్ ఆమోదం పొందిన జకియా జఫ్రి రివిజన్ కేసు వాదనల సందర్భంగా గుజరాత్ హైకోర్టులో నా ప్రమేయాన్ని, నా వ్యక్తిగత హాజరును అడ్డుకునేందుకు ఇటీవల సి.బి.ఐ. మాపై చేసిన అసాధారణమైన దాడి ఉద్దేశింపబడింది. సి.బి.ఐ. పంజరంలో చిలకలా వ్యవహరిస్తున్నది. రోజువారీ విచారణలతో మమ్మల్ని కట్టి వేసి, జకియా జాఫ్రి కేసులో మా కృషిని నివారించేందుకు ప్రయత్నిస్తున్నారు.

నిరాఘాటంగా జరిగే సామూహిక మతతత్వ నేరాలకు భారతదేశంలో శిక్షలు లేవని పేట్రేగుతున్న దుష్టసంస్కృతికి, భారతదేశ సుప్రీంకోర్టు నిరంతర పర్యవేక్షణలో, చట్టబద్ధ సంస్థల మద్దతుతో, సి.జె.పి. సమిష్టి కృషితో వెన్ను విరవబడింది. 1983 నెల్లి ఊచకోతలో గాని, 1984 సిక్కుల మారణహోమంలోగాని, 1992–93 బొంబాయి హింసలోగాని మనం

**"పార్లమెంట్‌లో 292 స్థానాలున్నప్పటికీ ప్రజాస్వామ్యంలో ఈ ప్రభుత్వం విశిష్టమైనది కాదని మనం గుర్తుంచుకోవాలి. భారత రాజ్యాంగమే అంతిమంగా విశిష్టమైనది. సమానత, సుపరిపాలనతో కూడిన రాజ్యాంగ సూత్రాలకు ఎన్నికలతో ఒనగూడిన అధికారం యొక్క ఆటవిక ప్రదర్శన ఎన్నడూ ప్రత్యామ్నాయం కాజాలదు."**

న్యాయాన్ని చూడగలిగామా? పటేల్ తెగకు సంబంధించిన కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులతో సహా 120 మందిని శిక్షింప గలిగిన మా ప్రయత్నం చారిత్రాత్మకమైనది. ఈ విజయాలను మొరటుగా తలక్రిందులు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**జకియా జాఫ్రి కేసు తుదిదశలో ఉన్నది. మీపై జరిగిన దాడి సందర్భం కాకతాళీయమా?**

ఇది కాకతాళీయం కాదు. మేము మొట్టమొదట 2006లో ఫిర్యాదును దాఖలు చేసినప్పుడు జకియా జాఫ్రి ఎదుర్కొన్న పరిణామాలకు సాక్షిగా నిలిచి, హంతకుల దుశ్చర్యలకు నివ్వెరపోయిన ఒక మహిళ గుల్బర్గ్ ఊచకోత జరిగిన తర్వాత రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లోనే గడిపింది. 'అహమ్మదాబాద్ కాల్తుంటే పోలీసులు సెలవులో ఉన్నట్లుందని' ఆమె నాతో అన్న మాటలు నాకు గుర్తున్నాయి. జరిగిన దుశ్చర్యలు ఉద్దేశ్యపూర్వకంగా, బాహాటంగా చేసినవనే భావన ఆమె మనస్సులో నాటుకొని ఉంది. క్రిమినల్ కేసు దాఖలు చేయటానికి ఆ భావన ఒక్కటే సరిపోదు. ఇప్పుడు ఆ దుశ్చర్యలను ఋజువు చేయటానికి తిరుగులేని సాక్ష్యాలు కలిగి ఉన్నాము.

మన దేశంలో గోద్రా ఎక్కడైనా జరిగి వుంటే, దానికి ప్రతీకారంగా మూడు, నాలుగు దాడులు జరిగి ఉండేవని నిస్సందేహంగా చెప్పగలను. కానీ పాలనావ్యవస్థ నిర్వహించాల్సిన పాత్ర ఏమిటి? ప్రశాంతంగా, శాంతియుతంగా ఉండమని, ప్రతీకారాలకు, రక్తపాతానికి పాల్పడవద్దనే స్పష్టమైన అభ్యర్థనలు ఏమైనా ఉన్నాయా? ఇదే మేము చెప్తుంది. దీని చుట్టూనే మేము కేసును నిర్మించాము.

నా వాదనలే ప్రజాక్షేత్రంలోకి తిరిగి వస్తాయని మేము ఆశిస్తున్నాం. కాని అది పాలకులకు రుచించదు. "మీరు పిలుచుకొనే "క్లీన్‌చిట్"పై మీకంత విశ్వాసముంటే, గుజరాత్ హైకోర్టులో విచారణలో ఉన్న క్రిమినల్ రివిజన్ అప్లికేషన్ (205/2014) మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతుంద"ని మేము పాలకవర్గాన్ని ప్రశ్నిస్తున్నాం. మీరు అభద్రతతో ఉన్నారా?

**న్యాయాన్వేషణ, కార్యశీలతలు బాహాటంగా అణచివేతకు గురౌతున్నాయా? నిర్భయమైన కార్యశూరతకు మీరు ప్రతీకలౌతున్నారా?**

అదే అనుకుంటుంటే, ఆ పిలుపును వినయంగా స్వీకరిస్తాను. న్యాయం కోసం పోరాడే శక్తులకు మేము చెప్పేదేమంటే, "మేము లొంగం." మన ప్రజాస్వామ్యాన్ని ఫాసిస్ట్ తరహా శక్తులకు పాదాక్రాంతం కానివ్వమని పూరించే శంఖారావమిది.

ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అత్యవసర పరిస్థితి నాటి కన్నా భయానకంగా ఉన్నాయి. భారత రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని అశ్రిత కార్పొరేట్ సారధ్య హిందూ రాజ్యంగా మార్చాలన్న స్పష్టమైన అజెండా తయారైంది. పార్లమెంట్‌లో 292 స్థానాలున్నప్పటికీ ప్రజాస్వామ్యంలో ఈ ప్రభుత్వం విశిష్టమైనది కాదని మనం గుర్తుంచుకోవాలి. భారత రాజ్యాంగమే అంతిమంగా విశిష్టమైనది. సమానత, సుపరిపాలనతో కూడిన రాజ్యాంగ సూత్రాలకు ఎన్నికలతో ఒనగూడిన అధికారం యొక్క ఆటవిక ప్రదర్శన ఎన్నడూ ప్రత్యామ్నాయం కాజాలదు. జాతీయంగా కేవలం 31 శాతం ప్రజలే ఈ నియంతృత్వ పాలనా వ్యవస్థను సమర్థిస్తున్నారన్న వాస్తవాన్ని మనం నిరంతరం గమనంలో ఉంచుకోవాలి.

**గత కొన్ని నెలల నుండి మీకు మద్దతు వెల్లువెత్తుతున్నది. కొంతకాలం పాటు మిమ్మల్ని ఎలక్ట్రానిక్ మీడియా పట్టించుకోలేదు?**

వెల్లువెత్తుతున్న ప్రజా మద్దత్తుకు కృతజ్ఞులమై ఉంటాము. దీనిద్వారా మా శక్తియుక్తులు పునరుజ్జీవనమౌతున్నాయి. అనేక ప్రజా సమూహాలు, సంఘాలు, రాజకీయ పార్టీలు మమ్మల్ని నికరంగా సమర్థిస్తున్నాయి. మీడియా మమ్మల్ని పూర్తిగా పక్కకు తోసేసింది. నష్టం జరిగిపోయిన తర్వాతనైనా ప్రతిస్పందనలను ప్రచురిస్తూ పత్రికా రంగం కొద్దిమేరకు మెరుగ్గా ఉన్నా, ఎలక్ట్రానిక్ మీడియా, పాలకవర్గ సారథ్యంలో ఏకపక్షంగా కక్షసాధింపు వేటను కొనసాగించింది. ఆ పరిణామాల్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలన్నా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. సమతుల్యం లేని వార్తాప్రసారాలు, ఋజువులు లేని ఆరోపణలు, ఏకపక్ష కథనాలతో కార్పొరేట్ సారధ్యంలోని మీడియా పాలకవర్గాలకిచ్చిన మూర్ఖమైన మద్దతుకు మేము బలిపశువులమయ్యాం.

**మీరు ఏ విధమైన న్యాయంకోసం పోరాడుతున్నారు?**

మేము చేసేది వ్యక్తిగత పోరాటం కాదు. సామూహిక నేరాలకు జవాబుదారీతనం కోరుతూ చేస్తున్న పోరాటమిది. గోద్రా ఉదంతం జరిగిన మొదటి 72 గంటలే కాకుండా వారాలు, నెలలపాటు, రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలింది. అధికారంలో ఉన్న ప్రభుత్వం చట్టపరంగా జవాబుదారీ అయి, 2002 మే వరకు గుజరాత్ అట్టుడికిపోతూ ఉంది.

కె.పి.ఎస్. గిల్‌ను మొదటి ఎన్డీయే ప్రభుత్వం పంపేవరకు జరిగిన పరిణామాలు, ప్రజాన్యాయం కోసం జరిగిన పోరాటాలు కావా? రాష్ట్ర నిఘా విభాగం తీవ్రమైన హెచ్చరికలు చేసినా స్పందించని పోలీస్, పోలీస్ కంట్రోల్ రూం, పరిపాలనా వ్యవస్థల వైఫల్యాలను, మద్దతు కోసం ఇచ్చిన సందేశాలను తిరస్కరించిన సీనియర్ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినప్పుడు – ఇవన్నీ పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకోసం చేసే చట్టపరమైన చర్యలు కావా? 28.5.2002న మేము చూయించిన జకియా జాఫ్రి దర్యాప్తు పత్రాలలో భాగమైన, అహ్మదాబాద్ పోలీస్ బ్రిగేడ్ ఇచ్చిన 47 సందేశాల్ని బాహాటంగా, ఉద్దేశ్యపూర్వకంగా త్రోసిపుచ్చినప్పుడు, తప్పొప్పులకు బాధ్యులైన పోలీస్ కమిషనర్ పి.పి. పాండే, అడిషనల్ పోలీస్ కమిషనర్ శివానంద్ ఝూల వైఖరి మనకు ఏం చెప్తుంది? జవాబుదారీతనం కోసం చేసే ఈ పోరాటాన్ని విరమించాలా?? మళ్ళీ ఎప్పుడూ చేయకూడదా?

**మీరు, మీ భర్త గడుపుతున్న కష్టతరమైన రోజుల నుండి మీరు, మీ భర్త బటయపడి, రక్షణ పొందమని మీ శ్రేయోభిలాషులు మిమ్మల్ని ఎప్పుడైనా కోరారా? మీరలా చేస్తే ఏమౌతుందో ఆలోచించారా?**

ఇప్పటివరకు మా కాళ్ళమీద మేమే నిలబడి, తీవ్రమైన వ్యక్తిగత నష్టానికి ఓర్చి పోరాటం చేస్తున్నాము. మమ్మల్ని నిలబెట్టిన ఈ స్థైర్యం వీడదని ఆశిస్తున్నాము.

అనువాదం: **కొండముది లక్ష్మీప్రసాద్**

**పుస్తక పరిచయం**

# స్టాలిన్‌ను గురించిన సమగ్ర విశ్లేషణ

## "స్టాలిన్ యుగం" పుస్తక పరిచయం

**- ఎం. నిర్మల్ కుమార్**

ప్రపంచ చరిత్రలో స్టాలిన్ పాత్ర ఓ చెరగని సంతకం లాంటిది. మానవజాతికి దిశా నిర్దేశం చేసి ప్రభావవంతంగా మార్గదర్శకత్వం వహించిన నాయకుల్లో స్టాలిన్ ఒకడు. మంచికో చెడుకో స్టాలిన్ చర్చించబడినట్లుగా మరే ప్రపంచ నాయకుడు చర్చించబడలేదు. కొందరు స్టాలిన్‌ను 'ప్రజాస్వామ్యం, స్వేచ్ఛవంటి ఆధునిక భావాల పొడగిట్టని" నియంతంటారు. మరో హిట్లర్ అంటారు. విద్యాలయాల చరిత్ర పుస్తకాలలో ఎక్కువ భాగం స్టాలిన్‌ను నియంతనే ప్రచారం చేశారు. ధనస్వామ్య వర్గాల కొమ్ముగాసే పాశ్చాత్య దేశాల మీడియా స్టాలిన్ గూర్చి పెద్దఎత్తున దుష్ప్రచారం చేసింది. ఇప్పటికీ చేస్తూనే ఉంది. ఒకప్పుడు స్టాలిన్‌ను మహానేతగా పూజించిన రష్యా ఆ తర్వాత పరమ దుర్మార్గుడని ముద్రవేసి అవమానించింది. స్టాలిన్ మరణానంతరం ఆయన విగ్రహాలు కూల్చబడ్డాయి. ఆయన చిత్రపటాలు, రచనలు గ్రంథాలయాల నుండి తొలగించబడ్డాయి. స్టాలిన్‌ను సమర్థించేవారిపై దాడులు జరిగాయి. మరోవైపు ఇప్పటికీ స్టాలిన్‌ను గొప్ప నాయకునిగా, మార్క్సిస్టు మహోపాధ్యాయునిగా భావించే శక్తులూ ఉన్నాయి. అతని రచనల నుండి, జీవిత పోరాటం నుండి స్ఫూర్తి పొందుతూ సామాజిక మార్పుకోసం పనిచేస్తున్న శక్తులూ ప్రపంచ వ్యాప్తంగా పుష్కలంగా ఉన్నాయి.

దోపిడి (భూస్వామ్య– పెట్టుబడిదారీ) వర్గాలకూ, శ్రామిక వర్గాలకూ మధ్య సహజంగానే శత్రు వైరుధ్యం ఉంటుంది. తమ తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణకోసం ఈ రెండు వర్గాలూ ఘర్షణ పడుతూ ఉంటాయి. ఈ వర్గాలకు నాయకత్వం వహించేవారు కూడా ఈ వర్గపోరాటంలో భాగమవుతారు. శ్రామికవర్గ నాయకత్వం పట్ల సహజంగానే ధనస్వామ్య వర్గాలకు శతృభావం ఉంటుంది. అందుచేతనే ఈ నాయకుల గురించీ, వీరి నాయకత్వాన నడిచే ఉద్యమాల గురించి ధనస్వామ్య శక్తులు దుష్ప్రచారం చేస్తాయి. అందులో భాగంగానే స్టాలిన్ కూడా విలన్‌గా చిత్రీకరించబడ్డాడు. కానీ విషాదమేమిటంటే స్టాలిన్‌పై కేవలం ధనస్వామ్య శక్తులు మాత్రమే కాకుండా సోషలిస్టులమని, కమ్యూనిస్టులమని చెప్పుకొనే శక్తులు కూడా దాడిచేశాయి. కొన్ని కమ్యూనిస్టు పార్టీలు స్టాలిన్ వ్యతిరేకతను తమ విధానంగా తీసుకున్నాయి. హొవార్డ్ ఫాస్ట్, ఇల్యా ఇహ్రెన్‌బర్గ్ వంటి విప్లవ రచయితలు కూడా స్టాలిన్‌ను విలన్‌గా చిత్రించారు. ఒకానొక సమయంలో అతివాద, మితవాదులనే తేడా లేకుండా స్టాలిన్‌పై మూకుమ్మడి దాడి చేశారు. ఈ పరిణామాలన్నింటికీ కారణం కృశ్చేవ్. రష్యా కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో కృశ్చేవ్ ఓ ప్రత్యేక నివేదిక ప్రవేశపెట్టాడు. స్టాలిన్‌ను అనేక కోణాలలో విమర్శిస్తూ తయారు చేసిన నివేదిక అది. ఈ నివేదిక ఇటు కమ్యూనిస్టు ప్రపంచాన్ని ఆందోళనకు, ఆవేదనకు గురి చేయగా, అటు పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి, ఆనందానికి గురిచేసింది. అప్పటికే స్టాలిన్ పెట్టుబడిదారీ మీడియా దాడికి గురవుతున్నాడు. కృశ్చేవ్ నివేదిక ఈ వర్గాలకు వరంలా లభించింది. ఈ నివేదిక ఆధారంగా స్టాలిన్‌ను విమర్శిసూ ఎన్నో పుస్తకాలు ప్రచురిం చారు. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను, కమ్యూనిస్టుపార్టీలను ప్రభావితం చేశాయి. రష్యా కమ్యూనిస్టుపార్టీని గుడ్డిగా అనుసరించే పార్టీలు స్టాలిన్ పట్ల వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి. కృశ్చేవ్ చెప్పిందల్లా గుడ్డిగా నమ్మి తలూపేవారే తప్ప, అతని నివేదికలోని అంశాలను పరిశోధించి నిజానిజాలను వెలికితీసే సాహసం ఎవ్వరూ చేయలేకపోయారు. కృశ్చేవ్ నివేదికలోని అశాస్త్రీయ సూత్రీకరణలను అర్థం చేసుకున్న వారు సైతం ఏం చేసేందుకు పాలుపోక మిన్నకుండిపోయారు.

అట్లాంటి నిరాశామయ వాతావరణంలో కారుచీకట్లో కాంతిరేఖలాగాఓ అమెరికన్ యువతి ముందుకొచ్చింది. ఆమే అన్నా లూయీస్ట్రాంగ్. వృత్తిరీత్యా రచయిత్రి, పాత్రికేయురాలు. ప్రారంభంలో ఈమె కూడా కృశ్చేవ్ ప్రభావంలోనే ఉంది. ఈమెకూ స్టాలిన్ చర్యలు ప్రారంభంలో దుర్మార్గంగా కన్పించాయి. ఈమె కూడా స్టాలిన్ కాలంలో నిర్బంధానికి గురయ్యింది. అయితే ఈమెలోని నిజాయితీ, నిర్భీతిలు స్టాలిన్ పరిపాలనా కాలాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు పురిగొల్పాయి. అప్పటికే అనేక దేశాలలో రాజకీయాలను అధ్యయనం చేసిన అనుభవాలు ఇందుకు దోహదం చేశాయి. ఈమెకు 1921 నుండి రష్యాతో అనుబంధం ఉంది. స్టాలిన్ పాలనలో కొంతకాలం ఈమె నిర్బంధించబడింది. అయినా నిష్పక్షపాతంగా స్టాలిన్ కాలాన్ని విశ్లేషించింది. ఆ విశ్లేషణల ఫలితమే స్టాలిన్ యుగం పుస్తకం. ఈమె కమ్యూనిస్టు కాదు. అయితే రష్యాలో జరుగుతున్న సోషలిస్టు పరిణామాల పట్ల ఈమెకు అమితమైన ఆసక్తి. కష్టజీవుల అభ్యున్నతి కోసం రష్యాలో బోల్షివిక్కులు చేస్తున్న కృషిని ఈమె దగ్గరుండి పరిశీలించింది. ఈమె రష్యా నుండి మాస్కో న్యూస్ అనే పత్రికను నడిపింది. అమెరికా మరియు ఇతర పాశ్చాత్య దేశాలలో రష్యా గురించి ఎక్కువగా కట్టుకథలే ప్రచారం అయ్యేవి. కిరాయి రచయితలు ఉన్నవి, లేనివి కల్పించి వ్రాసేవారు. అన్నా లూయీస్ట్రాంగ్ యొక్క మాస్కో న్యూస్ వార్తలు ప్రామాణికంగా ఉండేవి.

> **"స్టాలిన్, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన రష్యా ప్రజలు గొప్ప అద్భుతాన్ని ఆవిష్కరించారు. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1928-32) నాలుగు సంవత్సరాలలోనే పారిశ్రామికోత్పత్తి రెట్టింపయ్యింది. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1933-37) పారిశ్రామికోత్పత్తి 120 శాతం పెరిగింది."**

రష్యాలో జరిగిన హింసా, నిర్బంధాలను గురించి కూడా ఈమె వాస్తవాలు తెలియ చేసేది. పాత్రికేయ వృత్తి పవిత్రతను, ప్రమాణా లను చివరి వరకు పాటించిన రచయితగా ఈమెకు పేరుంది. ఈమె సాహితీ శైలి, ప్రామాణికతలు ఎందరో పాఠకుల్ని మెప్పించేవి. అమెరికా, యూరప్ దేశాల్లోని పాఠకులు ఈమె రాతల కోసం ఎదురుచూసేవారు.

1917 అక్టోబర్ మహా విప్లవం విజయ వంతమై బోల్షివిక్కులు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక దేశంలో సోషలిజం సాధ్యమే నని, అందుకోసం ప్రయత్నిద్దామని లెనిన్ ప్రతిపాదిస్తాడు. ఆనాటి అగ్ర నాయకులు ట్రాట్స్కీ, కామినోవ్, జినోవీవ్‌లు ఈ ప్రతిపాద నను తిరస్కరిస్తారు. రష్యన్ సమాజం సోషలి జానికి సిద్ధం కాలేదని వాదిస్తారు. స్టాలిన్, స్వెర్దవోవ్‌లు లెనిన్‌ను బలపర్చుతారు. రష్యాలో లెనిన్ నాయకత్వాన సోషలిస్టు సమాజ నిర్మా ణం కోసం పూనుకుంటారు. జర్మనీతో జరిగిన బ్రెస్ట్ లిటోవ్‌స్కీ సంధి, 14 పెట్టుబడిదారీ దేశాల దాడి వల్ల రష్యా బాగా బలహీనపడుతుంది. వీటికి తోడు వరుస కరువులు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆనాటి రష్యా సమాజం మధ్యయుగాలనాటి వ్యవసాయ పద్ధతులు, సాంప్రదాయ సంకెళ్ళ నుండి బయటపడని రైతులు, నైపుణ్యంలేని కార్మికులతో నిండివుంది. పంటలు లేవు. ముడి సరుకులు లేవు. యంత్రా లు లేవు. అధికారం లభించిన కొద్దికాలానికే లెనిన్ చనిపోయాడు. ఇట్లాంటి పరిస్థితులలో స్టాలిన్ అధికారం స్వీకరిస్తాడు. అధికారం చేపట్టడం కంటే దానిని నిలబెట్టుకోవడమే కష్టమైంది. భౌతిక పరిస్థితులు ఎంత అధ్వా న్నంగా ఉన్నా, వాటిని మార్చగలమన్న దృఢ సంకల్పాన్ని స్టాలిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ ప్రదర్శించింది. ఇదే సంకల్పాన్ని కార్మికవర్గం నాయకత్వాన రష్యన్ ప్రజలూ స్వీకరించారు. మానవ జాతి చరిత్రలోనే మొదటిసారిగా ప్రణాళికాబద్ధంగా ఒక దేశాన్ని పునర్నిర్మించడం ప్రారంభించారు. పంచవర్ష ప్రణాళికలనే భావనను ప్రవేశపెట్టారు.

రంగాలవారీగా, ప్రాంతాలవారీగా ప్రజల యొక్క అవసరాలను సర్వేల ద్వారా గుర్తించారు. సాధించాల్సిన లక్ష్యాలను పంచవర్ష ప్రణాళి కలుగా రూపొందించారు. అందుకనుగుణంగా పరిశ్రమలు, రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులను నిర్మించుకున్నారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్టాలిన్, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వాన రష్యా ప్రజలు గొప్ప అద్భుతాన్ని ఆవిష్కరించారు. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1928-32) నాలుగు సంవత్సరాలలోనే పారిశ్రామికోత్పత్తి రెట్టింపయ్యింది. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1933-37) పారిశ్రామికోత్పత్తి 120 శాతం పెరిగింది. మూడో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1938-42) 100 శాతం పెరిగింది. ప్రణాళికా రచనలో, నిర్మాణ కార్యక్రమాల్లో అత్యుత్సాహంతో ప్రజలు భాగస్వాములయారు. 'ఈ దేశం నాది... ఈ వ్యవస్థ నాది" అనే భావం ప్రజల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. ప్రజల్లో సోషలిస్టు చైతన్యం మేల్కొంది. తమకు తాము నిరూపించుకోవాలనే మహా సంకల్పాన్ని రష్యా శ్రామిక వర్గం ప్రదర్శించింది.

కాంట్రాక్టు పద్ధతిపై పంచవర్ష ప్రణాళికలకు తోడ్పడేందుకు వచ్చిన అమెరికన్ నిపుణులు ప్రారంభంలో "అసలివి ప్రణాళికలే కావు" అన్నారు. కానీ వీటి విజయాలు వీరిని దిమ్మ తిరిగేటట్లు చేశాయి. తుర్కుమెనిస్తాన్-సైబీరియా రైల్వే లైను నిర్మాణం, ప్రపంచంలోనే అతిపెద్దదైన స్టాలిన్ గ్రాడ్ ట్రాక్టర్ల ఫ్యాక్టరీ, కుజ్‌నెట్‌స్కీ, యూరల్స్ ఉక్కు ఫ్యాక్టరీల నిర్మా ణం వంటి విజయాలు పాశ్చాత్య దేశాలను ఆశ్చర్యపర్చాయి. రచయిత స్వయంగా ఈ నాలుగు ప్రాజెక్టులను మొదటి నుంచి చివరి దాకా పరిశీలించింది. మాస్కో న్యూస్‌లో ఈమె రాసే వార్తలు రష్యాలో ఏం జరుగుతుందో మిగిలిన ప్రపంచానికి వెల్లడించేవి. స్టాలిన్ గ్రాడ్ ఫ్యాక్టరీలో తయారైన మొదటి 60 ట్రాక్టర్ల ఇంజన్లు పనికిరాకుండా పోయాయి. కానీ ఇదే ఫ్యాక్టరీ మొదటి సంవత్సరం 5000 ట్రాక్టర్లను విజయవంతంగా అందించింది. ఆనాటి వారి సాంకేతిక స్థాయితో పోల్చితే ఇది నమ్మలేని ఘన విజయం. అమెరికా ఇంజనీర్లు "రష్యాలో పని పనిలా సాగటం లేదు. యుద్ధంలా సాగుతోంది" అని వ్యాఖ్యానించారు. "ప్రజల సమిష్టి శక్తి ఎన్ని అద్భుతాలను సృష్టిస్తుందో మేము కళ్ళారా చూస్తున్నాము" అన్నారు. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో రష్యా పారిశ్రామికాభివృద్ధితో పోల్చితే యూరప్ పారిశ్రామికాభివృద్ధి రేటు పేలవంగా ఉందని మాస్కో న్యూస్ రిపోర్ట్ చేసింది. ఒక్క పారిశ్రామిక రంగమే కాదు ప్రతి రంగమూ అతి తక్కువ కాలంలోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందింది. ఒకప్పటి ప్రవాస గ్రామం కుజనెట్‌స్కీ పూలతోటల పెంపకంతో ప్రపంచ ప్రసిద్ధ మాగ్నెట్-మౌంటెన్‌తో పోటీపడే స్థాయికి ఎదిగింది. 1935 నాటికి సోషలిజానికి అవసరమైన ఆర్థిక పునాది చేకూరిందని సోవియట్ రష్యా ప్రకటించింది.

1930-34 మధ్యకాలంలో సమిష్టి వ్యవసాయమనే ప్రయోగం ప్రారంభమైంది. ఒక కోటి నలభై లక్షల చిన్న-చిన్న భూకమతాలు కల్సిపోయి రెండులక్షల పెద్ద వ్యవసాయ క్షేత్రాలుగా మారాయి. వ్యవసాయంలో యంత్రాలు ప్రవేశించాయి. అనేక గ్రామాలు సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా ఏకమయ్యాయి. కొన్ని గ్రామాలు కల్సి 'సహకార మార్కెట్టు' సొసైటీలను ఏర్పరుచుకున్నాయి. ఒకప్పుడు రష్యా ఆకలితో నకనకలాడేది. అనేక సంవత్సరాలపాటు కరువు కాటకాలు అల్లకల్లోలం చేసేవి. తిండిగింజలపై కఠినమైన రేషనింగ్ ఉండేది. ఈ సమిష్టీకరణ-యాంత్రీకరణల ఫలితంగా వ్యవసాయోత్పత్తి రెట్టింపయింది. ఎగుమతులు చేసేస్థాయికి వ్యవసాయోత్పత్తులు పెరిగాయి. అయితే రష్యాలో జరిగిన వ్యవసాయ సమిష్టీకరణపై పెద్దఎత్తున దుమారం లేచింది. పరిశ్రమలను జాతీయం చేసినంత సులువుగా భూములను జాతీయం చేయడం కుదరదు. ఇది వేలు, లక్షల సంఖ్యలో ఉన్న ప్రజల సమస్య. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ అంశం మీద పార్టీలో పెద్దఎత్తున చర్చ జరిగింది. కులక్కుల (ధనిక రైతులు) జోలికి పోవద్దని మితవాద సెక్షన్ వాదించింది. కొన్ని సంవత్సరాల పాటు పార్టీ విధానం అటూ-ఇటూ

"1930 మార్చి 2న కేంద్రకమిటీ తరఫున స్టాలిన్ 'విజయోన్మాదం' అనే ప్రసిద్ధికెక్కిన ప్రకటనను జారీచేశారు. 'విప్లవ విజయగర్వంతో కొందరు కామ్రేడ్స్ ఉన్మత్తులయ్యారు. రైతులను బలవంతపెడుతున్నారు. ఇది పార్టీ విధానం కాదు. సమిష్టి క్షేత్ర సభ్యత్వం ఐచ్చికం" అని స్టాలిన్ ప్రకటన స్పష్టం చేసింది."

ఊగిసలాడింది. రైతుల్ని బలవంత పెట్టకూడదని రుణాలు, ట్రాక్టర్లు ఇచ్చి ఆకర్షించాలని పార్టీ నిర్ణయించింది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్ని కూడా సమిష్టి క్షేత్రాల ఆధీనంలో నడిపించాలని నిర్ణయించారు. వ్యవసాయానికి ఉపయోగపడగల పశువుల్ని కూడా క్షేత్రాల ఆస్థిగా పరిగణించాలని నిర్ణయించారు. ఈ సమిష్టి వ్యవసాయ ప్రయోగంపై కులక్కులు, మత గురువులు పెద్దఎత్తున దుష్ప్రచారం ప్రారంభించారు. క్షేత్రాలపై దాడులకు దిగి ఆస్తులను ధ్వంసం చేశారు. కమ్యూనిస్టుల హత్యలు జరిగాయి. ''సమిష్టి క్షేత్రాల్లో ఆడ-మగవాళ్ళందరూ ఒకే కంబళి క్రింద పడుకుంటారట. ఎవరి పిల్లలు వారికి దక్కుండా సంఘం సొత్తు అయిపోతారట'' అంటూ పుకార్లు పుట్టించారు. కొన్ని ప్రాంతాలలో అధికారులు, కార్యకర్తలు తొందరపాటు ప్రదర్శించారు. రైతుల్ని బెదిరించి సమిష్టి వ్యవసాయంలోకి తెచ్చారు. ఆవుల్ని, గేదెల్ని, కోళ్లను కూడా క్షేత్రాల పరిధిలోకి తెచ్చారు. ప్రజల్లో గందరగోళం చెలరేగింది.

ఇదే అదునుగా పాశ్చాత్య మీడియా స్టాలిన్‌పై దాడి మొదలుపెట్టింది. "స్టాలిన్ లక్షలాది రైతుల్ని అణిచివేస్తున్నాడని, రష్యాలో అనాగరిక-ఆటవిక పరిపాలన సాగుతుందని" విమర్శించసాగారు. "కమ్యూనిస్టులు చెప్పే సమానత్వం ఎంత మొరటుగా ఉంటుందో చూడమని'' బూర్జువా మేధావులు వ్యాసాలు వ్రాయసాగారు. ఈ పరిణామాలన్నీ పార్టీ దృష్టికెళ్ళాయి. ఈ పొరపాట్లను సరిద్దిదటానికి పార్టీ పూనుకుంది. 1930 మార్చి 2న కేంద్రకమిటీ తరఫున స్టాలిన్ 'విజయోన్మాదం' అనే ప్రసిద్ధికెక్కిన ప్రకటనను జారీచేశారు. 'విప్లవ విజయగర్వంతో కొందరు కామ్రేడ్స్ ఉన్మత్తులయ్యారు. రైతులను బలవంతపెడుతున్నారు. ఇది పార్టీ విధానం కాదు. సమిష్టి క్షేత్ర సభ్యత్వం ఐచ్చికం" అని స్టాలిన్ ప్రకటన స్పష్టం చేసింది. ఆవులు, మేకలు, పందులు, కోళ్ళ వంటివాటిని వ్యక్తిగత ఆస్తిగా వదిలేయాలని, వ్యవసాయ పశువులను, పరికరాలను మాత్రమే సమిష్టి ఆస్తిగా జమకట్టాలని స్టాలిన్ ప్రకటన స్పష్టం చేసింది. దేశంలోని అన్ని పత్రికలు ఈ ప్రకటనను ప్రచురించాయి. కోట్లాది కరపత్రాలు దేశమంతటా పంచబడ్డాయి. ఈ ప్రకటనతో కోట్లాది రైతాంగం హఠాత్తుగా స్టాలిన్‌ను మహావీరునిగా పరిగణించారు. అత్యాచారాల నుండి రక్షించే మహనీయుడని భావించారు. ఆనాటి చరిత్ర ఇలా ఉండగా ఇప్పటికీ కొందరు "సమిష్టి వ్యవసాయం పేరుతో స్టాలిన్ చేసిన దారుణాలకు అంతేలేదని" వ్యాఖ్యానిస్తుంటారు. అట్లాంటి వారు ఆనాటి చరిత్రకు సజీవసాక్షిగా ఉన్న అన్నా లూయిస్ట్రాంగ్ రచనలు చదవాలి.


మాస్కోలో పెరేడ్ చేస్తున్న రెడార్మీ

సోవియట్ రష్యా జైత్రయాత్ర ఇలా సాగుతుండగా ప్రపంచ మానవాళికి అతిపెద్ద ప్రమాదం రెండో ప్రపంచయుద్ధం రూపంలో ఎదురైంది. జర్మనీ-ఇటలీ-జపాన్‌ల కూటమి ప్రపంచ దేశాలను కబళించ మొదలు పెట్టింది. హిట్లర్ ధాటికి యూరప్ దేశాలన్నీ చితికిపోయాయి. కొన్ని రోజుల వ్యవధిలోనే దేశాలు హిట్లర్‌కు లొంగిపోయాయి. పదకొండు రోజుల్లో ఫ్రాన్స్ లొంగిపోయింది. విప్లవ రష్యా ఏర్పడిన దగ్గరనుండి దాన్ని నాశనం చేయాలని కంకణం కట్టుకున్న బ్రిటన్-అమెరికా సామ్రాజ్యవాదులు దీన్నో అవకాశంగా వాడుకోదల్చారు. హిట్లర్‌ను రష్యాపైకి ఉసిగొల్పాలని ఎత్తుగడలు పన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలు జర్మనీపై రుద్దిన వెర్సయిల్స్ సంధి అన్యాయమైంది. దీన్ని అవకాశంగా తీసుకొని హిట్లర్ జర్మనీ ప్రజల్ని జాతీయోన్మాదంతో రెచ్చగొట్టాడు. వెర్సయిల్స్ సంధిని రష్యా ఖండించింది. అయినా హిట్లర్‌ను అడ్డగించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధపడింది. రష్యా పతనాన్ని కోరుకున్న బ్రిటన్ అందుకు ముందుకు రాలేదు. బ్రిటన్ ప్రధాని చాంబర్లేన్ విధానాలు హిట్లర్ బలపడడానికి కారణమయ్యాయి. వీరి ఆలోచనల్ని పసిగట్టిన రష్యా జర్మనీతో నిరాక్రమణ సంధి చేసుకుంది.

అయితే అప్పటికే రష్యాలో ఊహించని పరిణామాలు జరుగుతాయి. 1933 ప్రాంతం నుండే జర్మనీ గూఢచార దళాలు రష్యాలో ప్రవేశించాయి. నిపుణులు, జర్నలిస్టులు, టూరిస్టులు, తదితర రూపాల్లో వీరు రష్యాలో ప్రవేశించి వివిధ రంగాల్లోకి చొచ్చుకుపోయారు. ఆయా రంగాల్లో కీలక స్థానాల్లో వున్న అధికారుల్ని, నాయకుల్ని ప్రలోభపెట్టి కొనేసే ప్రయత్నాలు పెద్దఎత్తున చేశారు. సైన్యం కూడా ఇందులో చిక్కుకుంది. చివరకు కమ్యూనిస్టుపార్టీ కూడా ఈ కుట్రకు బలైంది. 1934 డిసెంబర్ 1న లెనిన్‌గ్రాడ్ పార్టీ కార్యదర్శి సెర్గి కిరోవ్ హత్యకు గురవ్వటంతో ఈ కుట్రలకు సంబంధించిన విషయాలు బహిర్గతమవ్వటం ప్రారంభమైంది. కమ్యూనిస్టుపార్టీ సభ్యుడే ఈ హత్య చేశాడు. ఈ కేసు విచారణలో నమ్మలేని నిజాలు బహిర్గతమయ్యాయి. జర్మనీ ఏజెంట్లు కిరోవ్ సహాయకులుగా చేరిపోయారు.

> **"స్టాలిన్ మాస్కోలోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించారు. ఆ కల్లోలిత దినాల్లోనే విప్లవ వార్షికోత్సవ పెరేడ్ ఏర్పాటు చేసి ప్రజల్ని, సైన్యాన్ని ఉత్సాహపర్చాడు. అప్పటికీ మాస్కోను పట్టుకున్నట్లు హిట్లర్ ప్రకటించాడు. కానీ వారు పొలిమేరలు దాటి మాస్కోలోకి అడుగుపెట్టలేక పోయారు. మరో ముఖ్యపట్టణం లెనిన్‌గ్రాడ్‌ను రెండున్నర సంవత్సరాలపాటు ముట్టడించినా లొంగిపోలేదు."**

తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఇది ఊహించనంత పెద్ద వ్యవహారంగా ముందుకొచ్చింది. చివరికి అగ్రనాయకులు జినోవీవ్, కామినీవ్‌లు కూడా కుట్రలో పాలుపంచుకున్నట్లు తేలింది. స్టాలిన్ మీది ఈర్ష్యతో అధికార దాహంతో జర్మన్లతో చేతులు కలిపినట్లు వీరు ఒప్పుకున్నారు. ఈ ఉదంతం రష్యాను నివ్వెరపర్చింది. ఈ ద్రోహులే 1917లో లెనిన్ ఏప్రిల్ థీసిస్ ఎత్తుగడలను బహిర్గత పర్చి పార్టీ నుండి సస్పెండ్ అయ్యారు. కుక్క తోక వంకర అన్నట్లు వీరి వక్రబుద్ధి కాలంతో పాటు పెరుగుతూ చివరికి దేశద్రోహానికి పూనుకున్నారు. వీరిని విచారించి ఉరితీశారు. వీరితో పాటు 11మంది అధికారులూ ఉరితీయబడ్డారు. రాజకీయ కమిస్సార్ ముఖ్యనాయకుడు మార్షల్ గుమ్మారివ్ 1937 జూన్ 1న ఆత్మహత్య చేసుకున్నాడు. కుట్రలో అతనికీ భాగముందని తేలింది. ఇదే నెలలో 7 గురు కమాండర్లు కోర్టు మార్షల్ చేయబడి కాల్చివేయబడ్డారు. ఉక్రెయిన్‌ను స్వాధీనపర్చుతామనే హామీతో హిట్లర్ వద్ద నుండి డబ్బు పుచ్చుకున్నట్లు వీరు అంగీకరించారు. రష్యా గూఢచార పోలీసు దళం అధిపతి యగోడా కూడా ఇలాంటి నేరమే ఒప్పుకొని ఉరితీయబడ్డాడు.

ఈ కుట్ర కమ్యూనిస్టు పార్టీని ఓ కుదుపు కుదిపింది. 1934 పార్టీ మహాసభ ప్రతినిధులు 1966 మందిలో 1108 మంది అరెస్టయ్యారు. 134 మంది కేంద్ర కమిటి సభ్యుల్లో సగం మందికి పైగా కాల్చివేయబడ్డారు. శతృవు అగ్రనాయకత్వంలోకి ప్రవేశించాడు. ఎవర్ని విశ్వసించాలో, ఎవర్ని విశ్వసించకూడదో తెలియని గందరగోళం ఏర్పడింది. స్వయంగా రచయితే విదేశీ అనుమానితురాలనే కారణంగా అరెస్టయింది. ఆనాటి పరిస్థితుల్ని గూర్చిన ఒక సంభాషణను రచయిత్రి పుస్తకంలో గుర్తు చేసింది. మా సిబ్బందిలో ముగ్గుర్ని అరెస్ట్ చేయగా నేను అసమ్మతి తెలిపాను. మా సంపాదకుడు నన్ను సమాధాన పర్చాడు. 'సోషలిస్టు వ్యవస్థకు అతిపెద్ద ముప్పు ఎదురైంది. మానవజాతి ఉన్నత శిఖరాల వైపు సాగిపోవడమా? లేక బానిసత్వంలోకి జారిపోవడమా? తేల్చుకునే సమయం ఎదురైంది. ఇప్పుడు ఉదారవాదంతో వ్యవహరిస్తే నాశనమవుతాం. ఎన్ని నష్టాలు భరించయినా ఈ వ్యవస్థను రక్షించుకోవాలి. పదిమంది అమాయకులు శిక్షింపబడ్డా పర్లేదు. ఒక్క దోషీ తప్పించుకోకూడదు." ఈ ఘాటైన సూటైన సమాధానం తన నోరు మూయించిందని రచయిత్రి రాశారు.

1941 జూన్ 22 న హఠాత్తుగా హిట్లర్ సోవియట్ రష్యాపై దండయాత్ర ప్రకటించాడు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 90 లక్షల పటిష్టమైన జర్మన్ సైన్యం రష్యాపై దాడికి దిగింది. ప్రపంచ చరిత్రలోనే ఇది అతి పెద్ద సైనిక దాడి. గరిష్టంగా నాలుగు వారాల్లో రష్యా లొంగిపోతుందని అమెరికా – బ్రిటన్ యుద్ధ నిపుణులు అంచనా వేశారు. కానీ వారాలు నెలలయినా, నెలలు సంవత్సరాలయినా రష్యాను జయించటం హిట్లర్ వల్ల కాలేదు. రష్యన్ల సైనిక శిక్షణ,నిర్మాణ కౌశలం, అంకుఠిత దీక్ష అసాధ్యాన్ని సుసాధ్యం చేశాయి. సమస్త మానవాళి సోషలిస్టు రష్యా పరాక్రమం వల్ల ఫాసిస్టు భూతం కబంధ హస్తాలనుండి రక్షించబడింది.

మెరుపు దాడిలో రష్యాను ఆక్రమించుకోవాలను కున్న జర్మనీ ఎత్తుగడలు సాగలేదు. రష్యా యుద్ధ వ్యూహాలు జర్మనీని దీర్ఘకాల యుద్ధంలోకి దించాయి. మొదటిసారిగా హిట్లర్ కొత్త స్వభావం గల శతృవుతో పోరాడాల్సి వచ్చింది. ఎంతకైనా తెగించి మాతృభూమిని రక్షిచుకుంటున్న మొత్తం ప్రజలు హిట్లర్ కు ఎదురుగా మోహరించారు. ప్రతి కర్మాగారం, ప్రతి వ్యవసాయ క్షేత్రం యుద్ధరంగమై గర్జించింది. చరిత్రలో మొదటి సారిగా లక్షలాది స్త్రీలు ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగారు. సప్లయి శాఖ, ఇంధన శాఖ, వైద్యశాఖ, రవాణా శాఖలలో అంతా సోవియట్ స్త్రీలే ! బాలల సంఘాలుగా సంఘటితమైన పిల్లలు సైతం శత్రువును ముప్ప తిప్పలు పెట్టారు. జర్మన్లు ఉక్రెయిన్‌ను ఆక్రమించుకునే సరికి అక్కడి లక్షలాది రైతులు ట్రాక్టర్లు, ట్రక్కులు, పశువులు, ధాన్యం నిల్వలతో సహా తూర్పుకు తరలిపోయి అక్కడ ఉత్పత్తి ప్రారంభించినారు. ఖార్కోవ్ పట్టణాన్ని ఆక్రమించిన జర్మన్ సైనికులు యంత్రాలు కాదు గదా! కనీసం ఒక్క ఇనుప మేకు కూడా లేని ఫ్యాక్టరీలు దర్శన మిచ్చాయి. ఒకానొక సమయానికి జర్మన్లు మాస్కోపొలిమేరల్లోకి చొచ్చుకు వచ్చారు. ప్రభుత్వాన్ని తాత్కాలిక రాజధానికి క్యూబిషేక్‌కు మార్చారు. స్టాలిన్ మాస్కోలోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించారు. ఆ కల్లోలిత దినాల్లోనే విప్లవ వార్షికోత్సవ పెరేడ్ ఏర్పాటు చేసి ప్రజల్ని, సైన్యాన్ని ఉత్సాహపర్చాడు. అప్పటికీ మాస్కోను పట్టుకున్నట్లు హిట్లర్ ప్రకటించాడు. కానీ వారు పొలిమేరలు దాటి మాస్కోలోకి అడుగుపెట్టలేక పోయారు. మరో ముఖ్యపట్టణం లెనిన్‌గ్రాడ్‌ను రెండున్నర సంవత్సరాలపాటు ముట్టడించినా లొంగిపోలేదు. స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకున్నామని డజనుసార్లకు పైగా ప్రకటించారు. కానీ ఒక్కసారీ అది జరగలేదు. చివరికి 1944 వేసవి కల్లా జర్మన్లు ఓడిపోయి రష్యా వదిలి పారిపోయారు. జనరల్ ఝుకోవ్ నాయకత్వాన ఎర్రసేన హిట్లర్ సైన్యాన్ని తరుముతూ పురోగమించింది. అంతకు ముందు జర్మనీ ఆక్రమించిన దేశాలన్నింటినీ విముక్తం చేస్తూ 1945 ఏప్రియల్ కల్లా ఎర్రసైన్యం బెర్లిన్ చేరింది. సోషలిజం ఫాసిజాన్ని ఓడించింది. ''ప్రజల భాగస్వామ్యంతో నిర్మించబడే సోషలిజం అజేయమనే" మహత్తర సందేశం ప్రపంచం ముందు ఆవిష్కరించబడింది.

సమకాలికుల స్మృతుల ఆధారంగా స్టాలిన్ గుణగుణాలను చిత్రించిన అనుబంధం ఈ పుస్తకానికున్న అదనపు ఆకర్షణ. పాశ్చాత్య ప్రపంచంతో పాటు కృశ్చేవిస్టు రివిజనిస్టుల వికృత దాడివల్ల స్టాలిన్ ప్రభ మసకబారింది. ఈ నేపథ్యంలో ఈ అనుబంధం స్టాలిన్ వ్యక్తిత్వాన్ని గూర్చిన అవగాహనను మెరుగుపరుస్తుంది. సమావేశాల్లోగానీ, వ్యక్తిగత సంభాషణల్లో ఇతరులు చెప్పే దానిని స్టాలిన్ శ్రద్ధగా వింటాడని మార్షల్ ఝుకోవ్ వ్రాసారు. ఎట్లాంటి విషయాన్నయినా స్టాలిన్ తో స్వేచ్ఛగా మాట్లాడొచ్చు. చిన్న చిన్న ప్రశ్నలతో అసలు విషయాన్ని, ఖచ్చితమైన సమాచారాన్ని స్టాలిన్ రాబట్టే వాడు. హడావుడి, డాబుసరిమాటలు, అతిశయోక్తులు స్టాలిన్‌కు నచ్చవు. ఆయన సంభాషణల్లో ప్రసంగాల్లో ఊతపదాలు, భావోద్రేకాలు, అనవసర అంశాలు, పునరుక్తి, చిత్రమైన హావభావాల ప్రదర్శనలు ఉండవు. ఆయన

> "రెండో ప్రపంచయుద్ధం ముగిసి స్టాలిన్ మాలటోవ్‌లాంటి నాయకులు స్పెషల్‌ట్రయిన్లో బెర్లిక్ కు వస్తున్నప్పుడు స్టాలిన్ తనకు ఫోన్ చేసి " ప్రత్యేక దళాలు బ్యాండ్ వాయిద్యాల వంటి హడావుడులొద్దు. ఒకరిద్దరు ముఖ్యులు మాత్రం రండి" అని చెప్పినట్లు ఝుకోవ్ వ్రాశారు."

మాటలు సూటిగా స్పష్టంగా ఉంటాయి. ఆయన ఆహార్యం గాంభీర్యంగా హుందాగా ఉంటుంది. పని విషయాని కొస్తే నిర్విరామ శ్రామికుడు, పనిరాక్షసుడు, మిత భాషే అయినా అవసర మయిన సందర్భాల్లో ఖచ్చితంగా తన భావాలను వెల్లడించేవాడు. వినోదాల పట్ల ఆశక్తి లేని వ్యక్తి విలాసాలు ఇష్టపడని వ్యక్తి, అనవసరమైన సామగ్రేదీ తన పరిసరాల్లో ఉండనిచ్చేవాడు కాదు. రెండో ప్రపంచయుద్ధం ముగిసి స్టాలిన్ మాలటోవ్‌లాంటి నాయకులు స్పెషల్‌ట్రయిన్లో బెర్లిక్ కు వస్తున్నప్పుడు స్టాలిన్ తనకు ఫోన్ చేసి " ప్రత్యేక దళాలు బ్యాండ్ వాయిద్యాల వంటి హడావుడులొద్దు. ఒకరిద్దరు ముఖ్యులు మాత్రం రండి" అని చెప్పినట్లు ఝుకోవ్ వ్రాశారు. యుద్ధానంతరం మాస్కోలో జరిగిన విజయోత్సవంలో సర్వసేనానిగా తానే వందన స్వీకారం స్వీకరించాల్సి వున్నా, మరో యువనాయకునికి ఆ అవకాశం కల్పించారని మాలటొవ్ వ్రాశారు.

స్టాలిన్ వ్యక్తిగత విషయాలకు ఎంతటి అప్రాధాన్యతనిస్తారో తెల్సుకోవాలంటే అతని కుటుంబసభ్యులతో సంబంధమున్న కొన్ని ఘటనలు తెల్సుకోవాలి. స్టాలిన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో కూడా అతని భార్య అందరితో పాటుగా మామూలుగా కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణిస్తూ పనికి వెళ్ళేది. స్టాలిన్ కు తన పెద్ద కొడుకు యాకోవ్ అంటే అభిమానం. యాకోవ్‌లోని ఉత్తమ కమ్యూనిస్టు గుణాలే దానికి కారణం. అతను యుద్ధంలో జర్మన్లుకు చిక్కుతాడు. దేశద్రోహం చేస్తే అందల మెక్కిస్తామని ఆశచూపుతారు. కానీ యాకొవ్ ను అంగీకరించడు. అప్పుడు జర్మన్లు తమ సేనాని పౌరిస్‌రిస్ ను విడుదల చేస్తే అందుకు బదులుగా యాకొవ్ ను వదిలేస్తామని బేరం పెడతారు. కొడుకు మీది అభిమానంతో స్టాలిన్ లొంగుతాడనుకుంటారు. కానీ స్టాలిన్ తిరస్కరిస్తాడు. పౌరిస్ ఒక కమాండర్ కాని యాకోవ్ ఒక మామూలు సైనికుడు మాత్రమే! ఈ బేరం న్యాయమైంది కాదని స్టాలిన్ తిరస్కరిస్తాడు. సొంత కొడుకునే స్వార్ధంతో సోషలిస్టు నీతిని తప్పటానికి స్టాలిన్ ఒప్పుకోడు ఆ నాటి రష్యాలో ప్రతి కుటుంబమూ సగటున ఒక సభ్యుడ్ని కోల్పోయింది. తనదో ప్రత్యేక కుటుంబమన్నట్లు స్టాలిన్ ఎట్లాంటి మినహాయింపులూ కోరలేదు. స్టాలిన్ మెప్పు పొందాలని కొందరు అధికారులు అతని రెండో కొడుక్కి సైన్యంలో అక్రమ ప్రమోషన్ ఇస్తారు. ఈ సంగతి తెలిసిన స్టాలిన్ వెంటనే ప్రమోషన్ ను రద్దు చేపిస్తాడు. స్టాలిన్ కూతురు స్వెత్లానా యుద్ధ కాలంలో ఒక యువకుడ్ని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని తండ్రి అనుమతి కోరుతుంది. "ఇది దేశానికి పరిక్షా సమయం. దేశంలోని యువతీ యువకులంతా దేశ రక్షణకై నడుంబిగిస్తుంటే మీ కిప్పుడు పెళ్ళేంటి" అని స్టాలిన్ విసుకున్నాడు. ఇట్లాంటి అనేక సంఘటనలు స్టాలిన్ జీవితంలో ఉన్నాయని అతని సమకాలికులు వ్రాసారు.

చరిత్రను విశ్లేషించడం అంచనాకట్టడం అంత సులువయిన పనికాదు. సరైన ఆధారాలు లభించినప్పుడే తగు వ్యాఖ్యానం చేయాలి. చరిత్ర విశ్లేషణకు ఒక స్పష్టమయిన లక్ష్యం, సరైన పద్ధతి అవసరమవుతాయి. చరిత్ర గురించి మార్క్సిస్టులు వ్యాఖ్యానించేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. ఆయా సంఘటనలకు స్థల, కాలాలతో ఉన్న సంబంధాలను లోతుగా పరిశీలించాలి. స్టాలిన్ కాలానికి సంబంధించిన అనేక పరిణామాలతో కృశ్చేవిస్టులు యాంత్రిక విశ్లేషణలు చేసారు. స్టాలిన్ హయాంలో వందల మంది అమాయకులు చనిపోయారు. కాబట్టి స్టాలిన్ హంతకుడు. నియంత అనే ధోరణిలో వీరి విశ్లేషణ సాగింది. వీరి యొక్క ఈ యాంత్రిక విశ్లేషణ వెనుక రివిజనిస్టు అవకాశవాదం పని చేసింది. కృశ్చేవ్ తన పరిపాలనా కాలంలో చేసిన సైద్ధాంతిక సూత్రీకరణలు మార్క్సిజానికి దూరంగా వెళ్ళాయి."వర్గపోరాటాలు అవసరం లేదు శ్రామికవర్గ నియంతృత్వం అవసరం లేదు. శాంతియుతంగానే సోషలిజం సాధించొచ్చు"అనేవి కృశ్చవ్ సూత్రీకరణలు. ఇట్లాంటి వర్గసంకర రాజకీయాలకు స్టాలిన్ బద్ధ వ్యతిరేఖి. ఓ వైపు స్టాలిన్ పై దాడి చేస్తూ మరోవైపు చాపకింద నీరులాగా కృశ్చేవ్ ఈ రివిజనిజాన్ని రష్యాలో వ్యాపింప చేసాడు. ఫలితంగా ప్రజల్లో సోషలిస్టు చైతన్యం విప్లవ తత్వం మొద్దుబారి పోయాయి. క్రమ క్రమంగా రష్యన్ల సామాజిక చైతన్యం పరాయీకరణకు గురైంది. చివరకు గోర్బచెవ్, బోరిస్ ఎల్సిన్ లు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి అందమయిన పదాలను వల్లె వేస్తూ సోషలిస్టు వ్యవస్థను కూల్చేస్తుంటే రష్యా ప్రజలు మౌన ప్రేక్షకుల్లా చూస్తూ ఉండిపోయారు. " ఏ పదాల వెనుక ఏ వర్గ ప్రయోజనాలు దాగున్నాయో తెల్సుకోవాలన్న" లెనిన్ బోధనను రష్యా ప్రజలు మర్చిపోయారు. ప్రజల్లో, పార్టీలో సైద్ధాంతిక చైతన్యం తగ్గుతున్న కొలది సామాజిక ఉదాశీనత పెరుగుతుంది. ఈ క్రమానికి కృశ్చేవ్ కాలంలో బీజాలు పడ్డాయి. ఆనాడు స్టాలిన్‌పై మొదలైన దాడి చివరికి సోషలిజం అంతం వరకూ సాగింది.

కమ్యూనిస్టు విప్లకారులు విమర్శకు, ఆత్మవిమర్శకు అతీతులు కారు. నిజానికి వ్యక్తులుగా తమను, పార్టీని విప్లవతత్వంతో సజీవంగా ఉంచేందుకు విమర్శ, ఆత్మవిమర్శలు గొప్ప ఆయుధాలు, వ్యక్తుల్ని గానీ, పార్టీల్ని గానీ గుడ్డిగా అనుసరించకూడదు. ప్రతి దానిలోనూ అనుకూల ప్రతికూల అంశాలను స్పష్టంగా చూడ గలగాలి. ప్రతికూల అంశాలను నిరుత్సాహపర్చటం అనుకూల అంశాలను ప్రోత్సహించటం కమ్యూనిస్టుల బాధ్యత. ఇందుకు కరుకయిన ఆలోచనా శక్తి అవసరం. గొప్ప నాయకుల జీవితాలను, వారి బోధనలను అధ్యయనం చేయటం వల్ల ఇట్లాంటి ఆలోచనా శక్తి పెరుగుతుంది. అన్నా లూయిస్ట్రాంగ్ పుస్తకం "స్టాలిన్ యుగం",మోటూరు హనుమంత రావుగారి ముందు మాట స్టాలిన్ నాయకత్వానికి సంబంధించిన మంచి చెడులను నిజాయితీగా విశ్లేషించేందుకు ప్రయత్నించాయి. ఈ పుస్తకాన్ని ప్రతి కమ్యూనిస్టు, ప్రతి చరిత్ర విద్యార్థీ తప్పని సరిగా చదవాలి. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ను ఓడించి బెర్లిన్‌లోని జర్మన్ పార్లమెంట్ రీచ్‌స్టాగ్ పై రష్యన్ రెడార్మీ ఎర్ర జెండా ఎగరేసి 70 సంవత్సరాలు పూర్తయిన సందర్భమిది. ఈ పుస్తకం చదవటానికి, ఆయా విషయాలు చర్చించుకోవడానికి ఇదో మంచి సందర్భం. ❋

# అంతర్జాతీయ పరిణామాలు నూతన వాస్తవాలు

**- జాన్ చెరియన్**



రచయిత అంతర్జాతీయ పరిణామాల విశ్లేషకులు

పనామా నగరంలో జరిగిన అమెరికా దేశాల శిఖరాగ్ర సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు మరియు క్యూబా ఒకరికొకరు స్నేహపూర్వకంగా వ్యవహరించినట్లు కనిపించింది. కానీ వెనిజులాపై ఆంక్షలు విధించడం, శిఖరాగ్ర సమావేశపు ప్రకటనను అంగీకరించకపోవడం విషయంలో అమెరికాకు వ్యతిరేకత వచ్చింది. ఇది అమెరికా దేశాల సమూహంలో అమెరికాను ఏకాకిని చేసింది.

అమెరికా మరియు క్యూబా దేశాధ్యక్షుల మధ్య కరచాలనం మరియు సమావేశం జరగటం, కీలకమైన అంశాలలో కరేబియన్, లాటిన్ అమెరికా దేశాల మధ్య ఐక్యత వ్యక్తం కావటం మరో ముఖ్య పరిణామం. 2012లో కొలంబియాలోని నౌకా కేంద్ర నగరం 'కార్టాజెనా' లో జరిగిన శిఖరాగ్ర సమావేశం నుండి ఈ ఐక్యతా వ్యక్తీకరణ కొనసాగుతూ ఉన్నది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు క్యూబాపై విధించిన ఆర్థిక దిగ్బంధనం రద్దు చేయాలని ఆందోళనలను నిర్వహించటంలో అది ముఖ్యమైన పాత్రను నిర్వహించింది. అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విషయంలో ఏకాకిగా మిగిలిపోయాడు.

గత మూడు సంవత్సరాలుగా జరిగిన నాటకీయ పరిణామాలు శిఖరాగ్ర సమావేశంలో క్యూబా మొదటిసారిగా స్థానం పొందటాన్ని సాధ్యం చేశాయి. అమెరికా గత పాలకులందరూ అమెరికా దేశాల శిఖరాగ్ర సమావేశంలో క్యూబాకు భాగస్వామ్యం లేకుండా నిరోధించారు. ఈ విధానం వలన అమెరికా తాను ఏకాకిగా మారుతున్న విషయాన్ని అవగాహన చేసుకొంది. పరిస్థితిని చక్కబెట్టేందుకు అవసరమైన చర్యలను తీసుకుంది. క్యూబాతో అమెరికా సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకురావడం ఒబామా గత ఎన్నికల ప్రచార వాగ్దానాలలో కూడా ఒకటిగా ఉంది. వాషింగ్టన్ డి.సి.కి చెందిన విధాన నిర్ణేతలు కూడా క్యూబాకు వ్యతిరేకంగా విధించే ఆంక్షలు అమెరికాకు వ్యతిరేక ఫలితాన్నిస్తాయన్న వాస్తవాన్ని అవగాహన చేసుకున్నారు. ఒబామా తన రెండవ విడత పరిపాలనాకాలంలో, విదేశాంగ విధానానికి సంబంధించిన ఎన్నికల వాగ్దానాలలో కొన్నిటినైనా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. క్యూబా, ఇరాన్‌లకు సంబంధించిన విషయాలు ఆయనకు అత్యంత ప్రాధాన్యతాంశాలుగా ఉన్నాయి.

గత సంవత్సరం చివరలో, అమెరికా అధ్యక్షుడు ఒబామా మరియు క్యూబా అధ్యక్షుడు రావుల్ కాస్ట్రోలు తమ రెండు దేశాలు సంబంధాలను సాధారణీకరించుకోవడానికి అంగీకరించాయని నాటకీయంగా ఉమ్మడి ప్రకటన చేశారు. ఒబామా ప్రభుత్వం ఇంత త్వరితంగా ఈ నిర్ణయం తీసుకోవటానికి అమెరికా దేశాల సదస్సు జరుగుతున్న సమయం కూడా ఒక కారణం. ఈ సమయంలో తమ "క్యూబా విధానాన్ని" కొనసాగించుకొంటూపోతే అమెరికా మరొకసారి శిఖరాగ్ర సమావేశంలో ఏకాకిగా మిగులుతుందన్న వాస్తవాన్ని ఒబామా, అతని సలహాదారులు గ్రహించారు. ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదిస్తుంది. ఐక్యరాజ్యసమితిలో సర్వకాల, సర్వావస్థల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మద్దతునిచ్చే ఒకే ఒక్క మిత్రరాజ్యం ఇజ్రాయిల్ మాత్రమే.

1959 విప్లవానంతరం తొలిసారిగా అమెరికా, క్యూబా అధ్యక్షులు పనామా నగరంలో మర్యాదపూర్వకంగా సమావేశమయారు. గత 60 సంవత్సరాల కాలంలో అమెరికా, క్యూబా అధ్యక్షుల మధ్య కేవలం కొన్ని కరచాలనాలు మాత్రమే జరిగేవి. కానీ పనామా నగరంలో ఒబామా, రావుల్ కాస్ట్రోల మధ్య గంటకంటే ఎక్కువ సమయం చర్చలు జరిగాయి. సమావేశం తరువాత ఒబామా మాట్లాడుతూ తన సందేశాన్ని క్యూబా ప్రజలకు చెబుతూ, ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిందనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు క్యూబా నుండి ఎటువంటి ప్రమాదమూ లేదని చెప్పారు. "ప్రభుత్వ మార్పుకు సంబంధించిన ప్రయత్నాలలో మేము లేము" అని ఆయన నొక్కి వక్కాణించారు. అదే సమయంలో క్యూబా ప్రజలు తమ భవిష్యత్తును స్వేచ్ఛగా,స్వతంత్రంగా రూపొందించుకోవటానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలు సహకరిస్తాయని అన్నారు. ఒబామా, రావుల్ కాస్ట్రోతో తన సమావేశాన్ని "చారిత్రాత్మకమైనది"గా వర్ణించాడు. ఇరువురి మధ్య చర్చలు దాపరికం లేకుండా ఫలప్రదంగా జరిగాయని చెప్పారు.

**సాహసోపేతమైన చొరవ**

శిఖరాగ్ర సమావేశంలో రావుల్ కాస్ట్రో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుని "సాహసోపేతమైన చొరవ"కు ధన్యవాదాలు తెలిపారు. ఒబామా చేత వ్రాయబడిన పుస్తకాలను తాను

చదివినట్లుగా చెబుతూ, ఆయన యొక్క వినయపూర్వకమైన చరిత్రను కొనియాడారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు క్యూబామీద ఆర్థిక ఆంక్షలను విధించిన తరువాత ఒబామా జన్మించారని, తనకు ముందు పాలించిన 10 మంది అధ్యక్షుల పాలన వారసత్వం ఆయనకు లభించిందని రావుల్ కాస్ట్రో స్పష్టం చేశారు. అదే సమయంలో 19వ శతాబ్దం చివరినుండీ క్యూబా మరియు అమెరికా ఖండంలోని దేశాలను అమెరికా సంయుక్త రాష్ట్రాలు శిక్షించినట్లుగా రావుల్ చెప్పారు.

నిరంతరజోక్యం ద్వారా 20 దేశాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను తొలగించి, భయంకరమైన నియంతృత్వ ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. వాటిలో అత్యధికంగా 12 దేశాలు దక్షిణ అమెరికాలోనే ఉండటం జరిగింది. వందలు, వేలమందిని చంపారు. చిలీ అధ్యక్షుడు సాల్వేడార్ అలెండీ వారసత్వం శాశ్వతంగా మనకు మిగిలింది అని రావుల్ కాస్ట్రో తన ఉపన్యాసంలో చెప్పారు. ఆర్థిక దిగ్బంధనం కారణంగా క్యూబాలోని సామాన్య ప్రజలు అనుభవించిన బాధల గురించి చెప్పారు. మనము ఎన్నో తీవ్రమైన క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నాము. 77శాతం క్యూబా ప్రజలు కఠినమైన నిర్బంధకాలంలోనే జన్మించారు. అయినా మన దేశభక్తియుతమైన భావాలు పైచేయి సాధించాయి. దురాక్రమణ ప్రయత్నాలు మన యొక్క ప్రతిఘటనాశక్తిని పెంచడమేగాక, విప్లవ కార్యక్రమాన్ని వేగవంతం చేశాయి.

ఏదేమైనా ఒబామా పాలన క్యూబాతో అనుసరిస్తున్న విధానంలో మార్పు చేసుకున్న తర్వాత దౌత్యపరంగా సాధించిన ప్రయోజనాలను ఈ సంవత్సరం మార్చిలో వెనిజులాపై ఆంక్షలను విధించడం ద్వారా వమ్ముచేసుకుంది. వెనిజులా వలన అమెరికా జాతీయ భద్రతకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడిందని, జాతీయ అత్యవసర పరిస్థితి"ని ప్రకటించి, వెనిజులా మీద చర్యలు తీసుకుంటూ అసాధారణమైన ఆంక్షలు విధించింది. క్యూబాతో తన సంబంధాలను సాధారణీకరించుకునే అంచువరకూ వెళ్ళిన సమయంలోనే అమెరికా వెనిజులాపై ఈ ఆంక్షలు విధించింది. వెనిజులాకు వ్యతిరేకంగా ఆంక్షలు మరింత కఠినంగా ఉండబోతున్నాయని ప్రభుత్వాధికారులు చెబుతు న్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు వెనిజులా యొక్క అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగానూ, ఆ దేశ చమురుకు ప్రధాన మార్కెట్‌గానూ ఉంది.

**వెనిజులాకు వ్యతిరేకంగా ఆంక్షలు**

> **"వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా సంయుక్త రాష్ట్రాల జోక్యం శిఖరాగ్ర సమావేశంలో కీలకమైన అంశంగా మారింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల భద్రతకు ప్రమాదం కలిగించే విధంగా వెనిజులా ప్రవర్తించలేదన్న వాస్తవాన్ని ఒబామా శిఖరాగ్ర సమావేశం ముందు అంగీకరించాడు."**




**పనామా సదస్సులో కరచాలనం చేస్తున్న రావుల్ కాస్ట్రో, ఒబామా**

ఒక్క కెనడాను మినహాయిస్తే ఆ ప్రాంతంలోని అన్ని దేశాలు ఒబామా పాలన మరొక దేశం మీద ఆంక్షలు విధించే నిర్ణయాన్నీ, అదీ తమ సొంత ఉత్తరార్థ గోళంలో జరగడాన్ని విమర్శించాయి. ఈ ప్రాంతంలో ఆర్థికంగా, రాజకీయంగా అగ్రస్థానంలో ఉన్న బృందాలైన దక్షిణ అమెరికా రాజ్యాల కూటమి (యుఎన్ఎఎస్‌యుఆర్–యునాసుర్–), మరియు కరేబియన్, లాటిన్ అమెరికా దేశాల కూటమి (సెలాక్)లు తమ సభ్యదేశం మీద అమెరికా ఆంక్షలు విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఖండించాయి. గ్రూపు 77 దేశాలు, చైనా మరియు అలీనోద్యమ (నామ్) దేశాలు వెనిజులాపై అమెరికా విధించిన ఆంక్షల నిర్ణయానికి వ్యతిరేకంగా తమ గొంతు కలిపి వెనిజులాకు తమ సంఘీభావాన్ని తెలిపాయి. ఒబామా తన నిర్ణయాన్ని రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. చివరికి వెనిజులాలోని ప్రతిపక్షానికి చెందిన గవర్నర్ కూడా అమెరికా అధ్యక్షుడు తన నిర్ణయాన్ని పున్ణసమీక్షించాలని పిలుపునిచ్చాడు.

వెనిజులాపట్ల ఒబామా విధానం ఆ శిఖరాగ్ర సమావేశంలో అమెరికాను నీడలా వెంటాడింది. రావుల్ కాస్ట్రోతో ఒబామా కరచాలనం ప్రపంచంలో పతాక శీర్షికల నాకర్షించవచ్చు. కానీ వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా సంయుక్త రాష్ట్రాల జోక్యం శిఖరాగ్ర సమావేశంలో కీలకమైన అంశంగా మారింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల భద్రతకు ప్రమాదం కలిగించే విధంగా వెనిజులా ప్రవర్తించలేదన్న వాస్తవాన్ని ఒబామా శిఖరాగ్ర సమావేశం ముందు అంగీకరించాడు. శ్వేతసౌధం ఉపయోగించిన భాషను రోజువారీ వ్యవహారంలో భాగంగా చూయిస్తూ చట్టబద్ధంగా విధించిన ఆంక్షలను సమర్థించటానికి ప్రయత్నించాడు. అధ్యక్షుడు ఒబామా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా వెనిజులాకు వ్యతిరేకంగా విధించబడిన ఆంక్షలను ఒక 'అపహాస్యం'గా ఈక్వెడార్ అధ్యక్షుడు రాఫెల్ కొర్రియా వర్ణించాడు. ఈ ఆంక్షలు మన అమెరికా ఖండంలో సామ్రాజ్యవాదులచేత దండయాత్రలు, నియంతృత్వాలను ఎదుర్కొన్న అత్యంత చీకటి కాలాన్ని గుర్తు చేస్తున్నాయని ఆయన రాశారు. లాటిన్ అమెరికా మారిందన్న విషయాన్ని వారు అర్థం చేసుకుంటారా?

(మిగతా 34వ పేజీలో)

# సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : గౌరవనీయులు రాఘవులుగారు**

**జులై 5న గ్రీసుదేశ ప్రజలు యిచ్చిన రెఫరెండం ఫలితాలు వెలువడగానే భారతదేశపు ఆర్థిక విధానంపై గ్రీసు ప్రభావం ఉండదని రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురాం రాజన్‌గారు ప్రకటించారు. అలాగే భారతదేశపు ఆర్థిక ప్రధాన సలహాదారుడు అరవింద సుబ్రమణ్యంగారు అయితే మన దేశీయ మారక నిలువలు ఉన్నాయని, మన ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని, ముఖ్యంగా మన పెట్టుబడి దారులు మన ఆర్థిక విధానంపై గట్టి నమ్మకం కలిగి ఉన్నారని, అందువల్ల గ్రీసు ప్రభావం మనకు ఉండదని ప్రకటించారు. ఈ ఆర్థికవేత్తల ప్రకటనలు నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్న మన పాలకులకు కలిగిన దిగులు తెలుపుతున్నది గదా?**

**– ఇలిపిళ్ళ సూర్యనారాయణ, విజయవాడ**

జవాబు: ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒడిదుడుకులకు ప్రస్తుతం గ్రీసు కేంద్రబిందువుగా ఉన్నది. అక్కడ జరిగే పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటాయి. స్టాక్‌మార్కెట్టు ఒడిదుడుకుల్లో, విదేశీ మారకద్రవ్య నిల్వలలో వస్తున్న ఆటుపోట్లలో ఇప్పటికే అటువంటి ప్రభావం మనకి కనిపిస్తున్నది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ ప్రస్తుత మాంద్యం నుండి బయటపడలేక పోవచ్చన్న సంశయాన్ని గ్రీసు పరిణామాలు బలపరుస్తున్నాయి. గ్రీసు పరిణామాల ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్రంగానే ఉంటుంది. ఎటువంటి ప్రభావం ఉండబోదని మన పాలకులు చెప్పలేకపోతున్నారు. దుష్ప్రభావం ఉన్నా దాన్ని తట్టుకోగలం అన్న భరోసాను మాత్రమే ఇస్తున్నారు. అదికూడా మేకపోతు గాంభీర్యమే. గ్రీసులో పరిణామాలు ఇంకా స్తిమితపడలేదు. మనదేశంపై తీవ్రమైన దుష్ప్రభావం పడుతుందో లేదో అనే అంశం స్పష్టం కావడానికి ఇంకా కొంత సమయం పడుతుంది. ●

---

# నూతన వాస్తవాలు

(33వ పేజీ తరువాయి)

వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో వెనిజులాపై విధించబడిన ఆంక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోటి ముప్పై లక్షల మంది పౌరులచేత సంతకాలు చేయబడిన వినతిపత్రాలను తీసుకొని పనామాలో జరిగిన శిఖరాగ్ర సమావేశానికి వెళ్ళారు. అంతేకాక మదురో అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షునితో సమావేశమయ్యారు, దానిని హృదయ పూర్వకంగా జరిగిన సమావేశంగా అభివర్ణించారు. వెనిజులా ప్రజలు అమెరికాకు శత్రువులు కాదు అని అమెరికా అధ్యక్షునికి చెప్పినట్లు మదురో అన్నారు. "వెనిజులా ప్రజలు అమెరికాకు వ్యతిరేకం కాదు, వారు సామ్రాజ్య వాదులకు వ్యతిరేకం" అని ఆ సమావేశంలో మదురో చెప్పారు. "నేను మిమ్మల్ని గౌరవిస్తాను, కానీ నేను మిమ్మల్ని విశ్వసించను" అని ఒబామాను ఉద్దేశించి మదురో అన్నారు.

పనామా శిఖరాగ్ర సమావేశానికి కొద్దిగా ముందు కారకాస్‌లో ఉన్న బొలీవియా అధ్యక్షుడు ఇవోమొరెల్స్ వెనిజులా ప్రభుత్వానికి తన సంపూర్ణమైన సంఘీభావాన్ని ప్రకటిస్తూ, అధ్యక్షుడు ఒబామా తన కార్య నిర్వాహక ఉత్తర్వులను రద్దు చేయాలని కోరాడు. "ఒకవేళ అధ్యక్షుడు ఒబామా అమెరికా దేశాల అధ్యక్షుల శిఖరాగ్ర సమావేశానికి ముందే రద్దు చేసిన ఉత్తర్వులతో రాకపోతే, అప్పుడు అధ్యక్షులుగా మేము పనామాలో దానిని రద్దు చేసేట్లుగా చేస్తాము" అని మొరెల్స్ అన్నారు. ఒబామా అలా చేయనప్పటికీ, ఆయన ఈ ప్రాంత ప్రజల మానసిక స్థితిని అర్థం చేసుకున్నట్లుగా ఉన్నది. ప్రభుత్వంతోనూ, ప్రతిపక్షంతోనూ చర్చలు జరపటం కోసం ఆయన విదేశీ వ్యవహారాల శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారిని వెనిజులాకు పంపారు.

ఒక స్పానిష్ భాషా పత్రికా ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో, వెనిజులా అమెరికా సంయుక్త రాష్ట్రాలను బెదిరించే విధంగా ప్రవర్తించలేదన్న వాస్తవాన్ని ఒబామా అంగీకరించారు. "వెనిజులా అమెరికాను బెదిరిస్తుందని మేము నమ్మటం లేదు. అమెరికా కూడా వెనిజులా ప్రభుత్వాన్ని బెదిరించదు'' అని ఒబామా అన్నారు. వెనిజులా ఎప్పటికీ అమెరికా లాంటి అగ్రదేశాలను బెదిరించడం చెయ్యదు అని రావుల్ కాస్ట్రో చెప్పారు. "కార్య నిర్వాహక ఉత్తర్వులను'' రద్దు చేయాలని రావుల్ ఒబామాను కోరాడు.

శిఖరాగ్ర సమావేశం ముగిసిన వెంటనే, క్యూబా చాలాకాలం నుంచి గట్టిగా కావాలని కోరుతున్న మరొక నిర్ణయాన్ని ఒబామా ప్రకటించారు. క్యూబాపై విధించిన అదనపు ఆంక్షలను సమర్థించుకోవటం కోసం 1982లో అమెరికా క్యూబాను తీవ్రవాదాన్ని ఎగుమతి చేసే దేశాల జాబితాలో ఉంచి, బలవంతంగా అమలు చేసిన ఆంక్షల విషయంలో న్యాయం చేయాలని క్యూబా కోరుతున్నది. క్యూబా ఇంకా ఎంతోకాలం ఉగ్రవాద ప్రాయోజిత దేశాల జాబితాలో ఉండదు అని ఒబామా ప్రభుత్వం 2015 ఏప్రిల్ మధ్యలో ప్రకటించిది. క్యూబా ప్రభుత్వం సంబంధాలను సాధారణీకరించే పద్ధతిని ముందుకు తీసుకెళ్ళడానికి గట్టిగా పట్టుపట్టింది. ప్రపంచవ్యాప్త విముక్తి ఉద్యమాలకు, ప్రత్యేకించి ఆఫ్రికాలో జరిగిన ఉద్యమాలకు సూత్రబద్ధమైన మద్దతు ఇచ్చినందుకు రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం క్యూబామీద "టెర్రరిస్టు ముద్ర" వేసింది. ఆ సమయంలో అమెరికా, దక్షిణాఫ్రికాలోని (అపార్థిడ్) జాతి వివక్షను అనుసరించే ప్రభుత్వంతో మిత్రుత్వం నెరపుతూ, వలస విధాన విచ్ఛిన్నాన్ని నిరోధించేందుకు అంతిమ పోరాటం చేస్తున్నది. లాటిన్ అమెరికాలో మితవాద, సైనిక ప్రభుత్వాలను అమెరికా బలపరచింది. తీవ్రవాదం పేరుతో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను క్యూబాతో వ్యాపారం చేయకుండా నిరోధించింది.

క్యూబా ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని స్వాగతించింది. అదే సమయంలో ఆ దేశం తనపేరు ఆ జాబితాలో మొదటి వరుసలో లేకపోవడాన్ని ఆహ్వానించింది. " వివిధ రూపాలలో జరుగుతున్న అన్నిరకాల టెర్రరిస్టు చర్యలను, కార్యకలాపాలను క్యూబా తిరస్కరిస్తుంది మరియు ఖండిస్తుంది" అని క్యూబా ప్రభుత్వం ఒక ప్రకటనలో చెప్పింది.

అమెరికా దేశాల శిఖరాగ్ర సమావేశం మరొకసారి 2012లో లాగానే, చివరి ప్రకటనమీద ఎటువంటి అంగీకారం లేకుండానే ముగిసింది. ఆ సమావేశానికి హాజరైన మరో 33 దేశాలు అంగీకరించిన ముసాయిదా ప్రకటనను అమెరికా, కెనడా వీటో చేసిన కారణంగానే అలా జరిగింది. ఆ రెండు దేశాలు చివరి ముసాయిదాలో ఉన్న అనేక అంశాలకు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఆరోగ్య భద్రత మానవహక్కుగా, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ కావడం, ఎలక్ట్రానిక్ గూఢచర్యానికి ముగింపు పలకడం, వెనిజులాకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుని కార్యనిర్వాహక ఉత్తర్వులను రద్దుపరచడం కూడా ఈ అభ్యంతరాలలో ఉన్నాయి.

అనువాదం : **కె. నాగమల్లేశ్వరరావు**

# హరికిషన్‌సింగ్ సూర్జిత్

(2వ పేజీ తరువాయి)

విధానాన్ని అత్యంత నైపుణ్యంతో ఆచరణలో పెట్టేవారు.

మతతత్వానికి వ్యతిరేకంగా ఆయన జీవితమంతా పోరాడారు. మతతత్వ శక్తుల ఎదుగుదలను, వాటి వలన భారతదేశ లౌకిక పునాదులపై పడే ప్రభావాన్ని అంచనా వేసిన మొదటి తరం నాయకులలో సూర్జిత్ ప్రముఖులు. దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడటానికి తగిన విధానాలను రూపొందింటంలో సూర్జిత్ ముఖ్యపాత్ర పోషించారు. మతతత్వ, విచ్ఛిన్నకర శక్తులను అరికట్టడానికి అనుసరించాల్సిన విధానాలపై ఆయన నిరంతరం సూచనలు చేసేవారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ తీవ్రవాదం విజృంభించినప్పుడు, దానిని ఎదుర్కోవడంలో ఆయన చూపిన ఉక్కు సంకల్పం అమోఘం. ఆ వేర్పాటువాద ఉద్యమం దాదాపు 200 మంది కమ్యూనిస్టులను బలి తీసుకుంది. జమ్మూకాశ్మీర్ సమస్య పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ మార్గదర్శకంగా నిలిచారు.

ఆయన సారథ్యంలో సిపిఎం సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు, పరాయి పాలన నుండి విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటాలకు నికరంగా అండగా నిలిచింది. ముఖ్యంగా వియత్నాం, పాలస్తీనా విముక్తి పోరాటాలు, క్యూబా దిగ్బంధానికి వ్యతిరేకంగా జరిగిన సంఘీభావ పోరాటాలలో ఆయన పోషించిన పాత్ర శ్లాఘనీయం.

భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు)ను వామపక్ష ఉద్యమంలో కీలకశక్తిగా, అతిపెద్ద భాగస్వామిగా రూపొం దించటంలో ఆయన కృషి మరువలేనిది. పార్టీ అనుసరిస్తున్న సైద్ధాంతిక, రాజకీయ విధానాలను ఎప్పటికప్పుడు మార్క్సిస్టు మౌలిక సూత్రాల ఆధారంగా నిశితమైన పరీక్షకు గురిచేయాలని ఆయన ఎల్లప్పుడూ ఉద్బోధిస్తూ ఉండేవారు. 1990ల్లో సోవియట్ యూనియన్ కుప్పకూలాక, గత అనుభవాల ఆధారంగా పార్టీని సరైన మార్గంలో నడపటానికి కృషి చేశారు. ప్రజాస్వామ్య హక్కులను, లౌకిక విలువలను కాపాడటానికి అలుపెరుగని పోరాటం చేశారు. భారతదేశం అలీన విధానానికి కట్టుబడి ఉండేలా, విదేశాంగ విధానంలో స్వతంత్రతను కాపాడుకునేలా చూడటానికి ఆయన కృషి చేశారు.

కార్మికవర్గ అంతర్జాతీయతను, సోషలిజాన్ని సూర్జిత్ గట్టిగా బలపరిచేవారు. ఇతర కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి, అభిప్రాయాలను పంచుకోవటానికి ఆయన ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉండేవారు. పలుపార్టీలతో సిపిఐ(ఎం)కి తీవ్రమైన సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి. సూర్జిత్ వాటి గురించి అనవసర వాగ్వివాదాలకు దిగలేదు. అదే సందర్భంలో సామ్యవాదంపై తనకున్న స్థిరాభిప్రాయాలను వదులుకోలేదు. ఆయన ఏ విషయమైనా నిక్కచ్చిగా మాట్లాడేవారు. 1987లో మాస్కోలో జరిగిన అక్టోబర్ విప్లవ వార్షికోత్సవసభలో, "మీ చర్యలు సోవియట్ యూనియన్‌ను దెబ్బ తీస్తాయని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని నష్టపరుస్తాయని" గోర్బచెవ్ ముఖంమీదే చెప్పిన ధీశాలి. కార్మికవర్గ అంతర్జాతీయత మూర్తీభవించిన నాయకుడు సూర్జిత్ అని, ఆయన చేసినంత కృషి మరి ఏ ఇతర నాయకుడు చేయలేదని ప్రకాష్ కరత్ పేర్కొన్నారు.

సూర్జిత్ ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసేవారు. నిత్యం ఆయన పార్టీకి సంబంధించిన ఏదో ఒక కార్యక్రమంలో నిమగ్నమై ఉండేవారు. 2005లో అనారోగ్య కారణంగా ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకున్నారు. నిరాడంబరమైన కమ్యూనిస్టు జీవనానికి ప్రతీక సూర్జిత్. సహచరుల పట్ల స్నేహభావంతో ఉండేవారు. ప్రజల సంక్షేమం కోసం అహరహం తపన పడేవారు. ఆయన భౌతికంగా మనతో లేకపోయినా, దేశంకోసం, శ్రామిక ప్రజలకోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలు నిరంతరం మనకు స్ఫూర్తినిస్తూ ఉంటాయి. దోపిడీ, అణచివేత లేని సమాజాన్ని కాంక్షిస్తూ అందుకోసం పోరాడుతున్న వారందరికీ సూర్జిత్ నిత్య స్ఫూర్తి ప్రదాత. సమ సమాజ స్థాపనకోసం తపిస్తున్న, ఉద్యమిస్తున్న ప్రజలందరికీ సూర్జిత్ వేగుచుక్క.

# కార్మిక సమస్యలు

(23వ పేజీ తరువాయి)

తిరస్కరించారు. ఈ చట్టంలో మార్పులు చేసేముందు, కార్మికుని యొక్క ఉత్పత్తి శక్తిని, అలాగే యజమాని యొక్క ఆర్థిక స్తోమతని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బోనస్ పరిమితులను నిర్ణయించటంలో, సీలింగ్ నిర్ణయంలో, నిత్యావసర ధరల సూచికను పరిగణనలోకి తీసుకోవాలన్న కార్మిక సంఘాల డిమాండును కూడా త్రోసిపుచ్చారు. పారిశ్రామిక వివాదాల చట్టంలో నిర్వచించి నట్లుగా, ఎంప్లాయి (ఉద్యోగి) అనే పదాన్ని తొలగించి వారిని వర్క్‌మెన్ పదంతో పిలిచేలా చట్టంలో మార్పు చేయాలని సూచించారు. 46వ జాతీయ కార్మిక సదస్సు చాలా పరిమితమైన అంశాలలో ఏకాభిప్రాయంతో ముగిసింది. ముగింపు ఉపన్యాసంలో కూడా కార్మికశాఖ మంత్రిగారి నుండి ఎటువంటి భరోసా రాలేదు. ఇటువంటి వేదికల ప్రాధాన్యతకు, త్రైపాక్షిక విధానం యొక్క ఆవశ్యకత, వాటినుండి వచ్చిన సూచనల ప్రాధాన్యతకు, సూచనల అమలులో ప్రభుత్వ పాత్ర గురించి ఆయన ఎటువంటి భరోసా ఇవ్వలేదు. బి.ఎం.ఎస్. కార్యదర్శి బ్రిజేష్ ఉపాధ్యాయ ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ, కేంద్ర కార్మికసంఘాల ఉమ్మడి ఐక్య కార్యాచరణ వలన గత రెండేళ్ళలో పెద్దగా సాధించలేకపోయాము. కాని, ప్రభుత్వం మా వలన ఏమీ జరగదు అనుకొని ముందుకు వెళితే పొరపాటు అవుతుంది. ఇప్పటికే సెప్టెంబర్ 2న దేశవ్యాప్త ఒకరోజు సమ్మెకు కార్మికసంఘాలు ఐక్యంగా ఒకే వేదిక మీద నిలబడి సన్నాహాలు చేస్తున్నాయని, సమ్మె జయప్రదం చేస్తాయని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

– **ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ–2

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-09-2015 Postal Regd. No L1/SD/407/13-15

# కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ విలాసాలనుభవిస్తున్న పెట్టుబడిదారులు



పెట్టుబడిదారి విధానంలో అధిక లాభాలు పొందడం కోసం అధిక పెట్టుబడి పెట్టడమే వారి లక్ష్యం. పెట్టుబడిదారీ విధానంలో ఒక వస్తువు మీద అధిక లాభం పొందడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తారు. లాభం అంటే అర్థం ఒక వస్తువును వాస్తవిక ధర కంటే చాలా చౌకగా కొనటం, వాస్తవిక ధరకంటే చాలా ఎక్కువ ధరకు అమ్మటం. అతి తక్కువ వేతనమిచ్చి కార్మికులతో ఎక్కువ పని చేయించుకోవటమే, శ్రామికులను తన మిల్లులో పనికి వినియోగించేటపుడు పెట్టుబడిదారుని ఉద్దేశ్యం అదే. పెట్టుబడిదారుడు కార్మికునికి చెల్లించిన వేతనం తిరిగి అతను వద్దకే చేరుకుంటుంది. కార్మికుడు తనకు వేతనం చెల్లించిన పెట్టుబడిదారు నుండి తనకు కావలిసిన వస్తువులను కొనుక్కుంటాడు. కార్మికుడు తన వేతనాన్ని వస్తువులతో మార్పిడి చేస్తాడు. పెట్టుబడిదారుడు తను చేసే ప్రతి విక్రయాన్నుండి లాభాన్ని ఆశిస్తాడు. అందుచేత కార్మికుడు తన శ్రమకు తగ్గ వేతనం పొందడు. ఇంతేకాదు ప్రతి కొత్త వస్తువును కొనేటప్పుడు పెట్టుబడిదారుకు కొంత లాభం చేకూర్చుతాడు. ఈ విధంగా వేతన రూపంగా మారిన శ్రమను ఊరికే సమర్పించవలసి ఉంటుంది. మానవ శ్రమకు అనుగుణంగానే ప్రతి వస్తువు ధర ఉంటుందని ఇంతకు ముందే మేము చెప్పాము. కాని ఒక వస్తువు మూల్యం మాత్రం దాని తయారీకి ఉపయోగింపబడిన శ్రమ మొత్తం మీద ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా వస్తువును తయారీ చేసేటపుడు మూల్యము, శ్రమ ఈ రెండింటిని తరాజు రెండు సిబ్బెలలో పెడతారు. శ్రమకు యజమాని కార్మికుడు అంటే శ్రమ అతని స్వంతం. ఒక వస్తువు తయారీ చేయడానికి కార్మికుడు ఉపయోగించిన శ్రమను బట్టి ఆ వస్తువు ధరకు సరిపడ్డ ధనాన్ని అతనికివ్వడం సబబు. కాని అలా చేస్తే పెట్టుబడిదారుకు లాభాలు ఎక్కడినుండి వస్తవి. పెట్టుబడిదారుడు దానధర్మాలకు తన పరిశ్రమను తెరవలేదు. కారు, పెద్దమేడ, భార్య, పిల్లలకు నగలు అధికారులకు విందులు ఇవ్వడం వీటన్నింటికీ డబ్బు ఎక్కడ నుండి వస్తుంది? పెట్టుబడిదారుడు చిన్న మిల్లులకు బదులుగా పెద్ద మిల్లులకు పది లక్షల నుండి పది కోట్ల రూపాయిలకు ఎలా యజమాని అవుతాడు? పెట్టుబడిదారుడు కార్మికునితో ఎనిమిది గంటల పని చేయిస్తాడు. ఈ సమయంలో కార్మికుడు ఒక రూపాయి విలువగల ప్రత్తిని నాల్గు రూపాయల విలువగల వస్త్రంగా మారుస్తాడు. యంత్రము, ఇతర ఖర్చుల కోసం కొంత మినహాయించి కార్మికుని శ్రమకు సరిపోయిన కూలీ అంటే కనీసం రెండు రూపాయిలు అతనికి ఇవ్వడం సబబు. కాని కార్మికుని వేతన రూపంలో అర్థరూపాయి ఇస్తారు. దీని అర్థం ఏమిటంటే పత్తిని వస్త్రంగా మార్చడానికి ప్రతి గంటకు అతను 25 పైసలు చొప్పన తన శ్రమను వినియోగిస్తున్నాడు. కాని అతనికి వచ్చే వేతనం మాత్రం రెండు గంటలపాటు చేసిన పనికి మాత్రమే. మిగిలిన ఆరు గంటల శ్రమ మూల్యము ఎక్కడికి వెళ్లింది? పెట్టుబడిదారుని జేబులోకి. ఆ లాభాలతో అతనికి ప్రాప్తించిన దర్జా పెరుగుతున్న కారుల, గీరుల సంఖ్యను మీరు చూస్తునే ఉన్నారు. ఈ కాలంలో కుబేరులైన పెట్టుబడిదారుల భవనాలు, భోగవిలాసాల ముందు చక్రవర్తుల డబూ, దర్పం దిగదుడుపే అని చెప్పవచ్చు. ఒక షావుకారు తన నలుగురి పిల్లల చదువు కోసం సంవత్సరానికి నాలుగు లక్షల రూపాయిలు ఖర్చు చేసి ప్రతి యేటా తన భార్యను వెంటపెట్టుకుని యూరప్, అమెరికా, జపాన్ దేశాలు టూర్ చేసి వచ్చేవాడు. ఈ టూర్‌లో అతను విమానం, రైలు, ఓడలలో ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేసేవాడు. అదృష్టమో లేక దురదృష్టమో మన సేఠుల్లో చాలామంది మాంసాహారులే. అందుచేత యూరప్‌లో కూడా అతను తిండిని కూడా చాలా ఖర్చు చేస్తాడు. ప్రతిసారీ టూర్ చేసేటపుడు నీళ్లలా ఖర్చు చేసే వేలకొలది రూపాయిలు కార్మికుల నుండి కాజేసిన ఆరు గంటల శ్రమ నుండి వచ్చిన లాభాలే. ఇంత ఖర్చు చేసే సేఠ్‌గారు కూడా కార్మికులు న్యాయసమ్మత్తమైన అధిక కూలీ అడిగితే పోలీసు బలాన్ని పిలిపిస్తానికి ఫైరింగ్ జరపడానికి లారీల క్రింద కార్మికులను త్రొక్కించడానికి సంకోచించడు. సేఠ్‌గారు ఖర్చు ఇంతటితో ఆగిపోలేదు. ఆయన ప్రతి సంవత్సరము ఆయన తన మేడ అలంకరణకో లేక కట్టడంలో ఏదో ఒక మార్పుకో ఖర్చు చేస్తూ ఉండేవాడు. చౌకీదారు, తోటమాలి కలసి తన భవనాన్ని చక్కగా అలంకరించినప్పటికీ, సంవత్సరంలో కేవలం కొంత భాగామే సేఠ్‌గారు ఆ భవనాన్ని కొంత భాగం వాడుకుంటున్నప్పటికీ సేఠ్‌గారు ఆ ఇంటికోసం ఖర్చు పెట్టడం మానుకోడు. సిమ్లా, డార్జిలింగ్ లాంటి పట్టణాల్లో సేఠ్‌గారికి భవంతుల్లాంటివి రాజభవనాలుండేవి. వేసవి కాలంలో విదేశాలకు వెళ్లకున్నట్లయితే సేఠ్‌గారు ఆ భవనాన్ని వేసవి విడుదలగా కేవలం కొంతకాలం మాత్రమే వాడేవారు. ఇప్పటి వరకు చెప్పినదంతా సేఠ్‌గారు తన శారీరక విలాసాల కోసం ఖర్చు పెట్టే దానిని గురించి మాత్రమే.

(రాహుల్ సాంకృత్యాయన్ రచించిన 'మానవ సమాజం' అన్న గ్రంథంనుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.4. Published on September 1, 2015